epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక | తెలుగు దినపత్రిక

సంపుటి: 19 | సంచిక: 127 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 7 మార్చి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131




## ప్రపంచం దృష్టిని ఆకర్షించే వేదిక

- రేపు ఢిల్లీలో 110 దేశాల ప్రతినిధులతో సదస్సు...
- ఏపీ బ్రాండ్ ఇమేజ్‌పై సీఎం చంద్రబాబు ప్రజెంటేషన్
- ఢిల్లీలో రైసినా డైలాగ్ 2026 సదస్సు హాజరుకానున్న సీఎం
- సదస్సుకు హాజరుకానున్న 110 దేశాలకు చెందిన 2,700 మంది అంతర్జాతీయ ప్రతినిధులు

**అమరావతి:** ప్రపంచ వేదికపై ఆంధ్రప్రదేశ్ కీర్తిని మరోసారి చాటేందుకు, రాష్ట్రం లో అమలు చేస్తున్న వినూత్న పాలనా విధానాలను అంతర్జాతీయ సమాజానికి వివరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధమ య్యారు. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జరగనున్న అత్యంత ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్ 2026' సదస్సుకు ఆయన శనివారం హాజరుకా నున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సులో సీఎం పాల్గొని, 'సాంకేతికత - సుపరిపాలన', భవిష్యత్ సవాళ్లు అనే అంశాలపై కీలక ఉపన్యాసం చేయనున్నారు.

- మిగతా5లో

## మనం గొర్రెలు మేపాలా..

# వాళ్ల పిల్లలు రాజ్యం ఏలాలా?



### మాటలు, మూటలతో గెలిచి రాలేదు.. కేవలం ప్రజల మద్దతుతోనే వచ్చాం

- మా వద్ద ఎలాంటి అక్రమ సంపాదనా లేదు.. పేదల పక్షపాత ప్రభుత్వం మనది
- ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన పోరాటానికి మొదటి నుంచి అండగా నిలిచా
- మిత్రధర్మానికి కట్టుబడి కర్ణుడిలా మాదిగల వెంట ఉన్నా
- సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత వర్గీకరణ ప్రకటించిన తొలి రాష్ట్రం తెలంగాణే
- విద్యా వ్యవస్థ ప్రక్షాళన కోసమే విద్యాశాఖ నా వద్దే పెట్టుకున్నా
- హైదరాబాద్ శిల్పకళా వేదికలో మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

గత పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ నేతల పిల్లలు రాజ్యం ఏలుతుంటే, బడుగు బలహీన వర్గాలు మాత్రం బర్రెలు, గొర్రెలు మేపాలా అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో జరిగిన మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తాము గత పాలకుల మాదిరిగా మాటలు, మూటలతో గెలిచి రాలేదని, కేవలం ప్రజల పూర్తి మద్దతుతోనే అధికారంలోకి వచ్చామని స్పష్టం చేశారు. తమది పూర్తిగా పేదల పక్షపాత ప్రభుత్వమని, తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదని తేల్చి చెప్పారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ జాతి చేసిన సుదీర్ఘ పోరాటానికి తాను మొదటి నుంచి అండగా నిలిచానని గుర్తు చేశారు. మహాభారతంలో మిత్రుడి కోసం కర్ణుడు చివరికంటా నిలబడిన తరహాలోనే, మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డామని ఉద్వేగంగా ప్రకటించారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత వర్గీకరణను ప్రకటించిన తొలి రాష్ట్రం తెలంగాణనే అని స్పష్టం చేశారు. దళితులకు, పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలనే ఏకైక లక్ష్యంతో విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని రేవంత్ రెడ్డి వివరించారు.

వివరాలు 2వ పేజీలో



## బేషరతుగా లొంగిపోవాల్సిందే

- ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం..
- తీవ్రమవుతున్న యుద్ధ ప్రభావం
- యుద్ధంపై స్పెయిన్ ప్రధాని విమర్శలు
- ముడిచమురు ధరపై ఖతర్ హెచ్చరిక
- భారత్ నుంచి నిలిచిపోయిన 4 లక్షల టన్నుల బాస్మతి బియ్యం ఎగుమతులు
- హోర్ముజ్ జలసంధిపై ఆంక్షలతో మిల్లర్లు, రైతులకు తీవ్ర నష్టం
- శంషాబాద్ నుంచి గల్ఫ్ దేశాలకు 24 విమానాలు రద్దు

వివరాలు 2వ పేజీలో

## లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం!

*రెండో దశ బడ్జెట్ సమావేశాల్లో ఓం బిర్లాపై ప్రతిపక్షాల తీర్మానం*



- పక్షపాతంతో వ్యవహరిస్తున్నారంటూ 118 మంది ఎంపీల నోటీసు
- సోమవారం సాధారణ ఎంపీలా సభలో కూర్చోనున్న ఓం బిర్లా
- తీర్మానంపై తీవ్ర ఉత్కంఠ.. సొంత ఎంపీలకు విప్ జారీ చేసిన బీజేపీ, కాంగ్రెస్
- ఈ నెల 9, 10 తేదీల్లో తీర్మానంపై చర్చ, ఓటింగ్
- ఏప్రిల్ 2 వరకు జరగనున్న రెండో దశ పార్లమెంట్ సమావేశాలు

లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానం దేశ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. కేంద్ర బడ్జెట్ రెండో దశ సమావేశాలు ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో, అదే రోజు స్పీకర్ పై అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగనుంది. ఓం బిర్లా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ 118 మంది ప్రతిపక్ష ఎంపీలు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్మానంపై చర్చ, ఓటింగ్ సందర్భంగా సభకు తప్పనిసరిగా హాజరు కావాలని అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. ఈ పరిణామాలతో పార్లమెంట్ సమావేశాలు వాడివేడిగా సాగే అవకాశం ఉంది.

వివరాలు 2వ పేజీలో

## 99 రోజుల ప్రణాళిక.. డైవర్షన్ డ్రామా!



- ప్రజలను ఏమార్చేందుకే సర్కార్ కొత్త ప్లాన్
- రెండేళ్లుగా రాష్ట్రంలో అదే జరుగుతున్నది
- మరోమారు ప్రజలను మోసం చేసే యత్నం
- ఇచ్చిన దరఖాస్తులకే ఇంకా దిక్కులేదు
- వైఫల్యాలను కప్పిపుచ్చుకునే వ్యూహం
- మండిపడ్డ హరీశ్ రావు

వివరాలు 2వ పేజీలో

## అసోంలో కుప్పకూలిన సుఖోయ్

*ఇద్దరు పైలట్ల దుర్మరణం*







- కర్బీ ఆంగ్లాంగ్ లో కూలిన భారత వైమానిక దళ జెట్
- మృతుల్లో ఆపరేషన్ సిందూర్ లో పాల్గొన్న పూర్వేష్ దురాగ్కర్
- జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి టేకాఫ్ అయిన కాసేపటికే ప్రమాదం
- కేవలం నాలుగేళ్లు మాత్రమే దేశానికి సేవ చేశాడంటూ తండ్రి ఆవేదన
- శిక్షణా మిషన్ లో ఉండగా గాల్లోనే కుప్పకూలిన వైనం

వివరాలు 2లో

## సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక లాంఛనం

- రాజ్యసభ నామినేషన్ల పరిశీలన పూర్తి
- స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ
- 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడమే కారణం
- వివాదరహితుడు కావడంతోనే వేం వైపు అధిష్ఠానం మొగ్గు





కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభ బరిలో నిలిచిన అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. శుక్రవారం జరిగిన నామినేషన్ల పరిశీలనలో.. తగినంత మంది ఎమ్మెల్యేల మద్దతు లేని కారణంగా స్వతంత్ర అభ్యర్థి దాఖలు చేసిన పత్రాలను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. పోటీలో ఇంకెవరూ లేకపోవడంతో కాంగ్రెస్ అభ్యర్థుల ఎన్నిక లాంఛనంగా మారింది.

వివరాలు 3లో

## సివిల్స్ ఫలితాలు విడుదల


*సత్తా చాటిన తెలుగు తేజాలు*



- ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకర్ గా అనూజ్ అగ్నిహోత్రి
- అత్యుత్తమ ర్యాంకులు సాధించిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు
- మొత్తంగా 1087 మంది అభ్యర్థుల ఎంపిక

3లో

## తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ



- పార్టీ నుంచి అధికారిక ఉత్తర్వులు జారీ
- వరంగల్ మాజీ మేయర్‌కు దక్కిన పదవి
- నగరానికి మొట్టమొదటి మహిళా మేయర్ గా సేవలందించిన చరిత్ర
- నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

వివరాలు 2వ పేజీలో

# బేషరతుగా లొంగిపోవాల్సిందే

**ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం.. తీవ్రమవుతున్న యుద్ధ ప్రభావం**

**యుద్ధంపై స్పెయిన్ ప్రధాని విమర్శలు..ముడిచమురు ధరపై ఖతర్ హెచ్చరిక**

**భారత్ నుంచి నిలిచిపోయిన 4 లక్షల టన్నుల బాస్మతి బియ్యం ఎగుమతులు**

**హోర్ముజ్ జలసంధిపై ఆంక్షలతో మిల్లర్లు, రైతులకు తీవ్ర నష్టం**

**శంషాబాద్ నుంచి గల్ఫ్ దేశాలకు రాకపోకలు సాగించే 24 విమానాలు రద్దు**

**న్యూఢిల్లీ, మార్చి 6:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రపంచ దేశాలను కలవరపెడుతున్నాయి. ఇరాన్‌తో యుద్ధం మొదలై ఏడు రోజులు గడుస్తున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాల్సిందేనని తేల్చి చెప్పారు. మరోవైపు ఈ యుద్ధం ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థ, ప్రయాణాలపై తీవ్రంగా పడుతోంది. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతల వల్ల దేశం నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన బాస్మతి బియ్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు భారీగా నిలిచిపోయాయి. దీనికి తోడు హైదరాబాద్ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లే విమానాల రాకపోకలకు సైతం తీవ్ర అంతరాయం ఏర్పడింది.

### లొంగిపోవాల్సిందేనన్న ట్రంప్

ఇరాన్‌తో ఎలాంటి డీల్ ఉండదని డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాల్సిందేనని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో తాజాగా పోస్టు పెట్టారు. ఇరాన్ లొంగిపోయిన అనంతరం దేశాన్ని ముందుకు నడిపించే నాయకత్వ ఎంపిక ఉంటుందని, ఆ తరువాత ఇతర మిత్రదేశాలతో కలిసి ఇరాన్ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తామని చెప్పారు. ఇరాన్‌కు అద్భుత భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. కాగా, ఇరాన్ యుద్ధంపై ఐరోపా దేశాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ యుద్ధానికి యస్ చెప్పేది లేదని స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంఛెజ్ స్పష్టం చేస్తూ ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. ఇరాన్‌పై అమెరికా యుద్ధం ఒక అసాధారణ తప్పిదమని వ్యాఖ్యానించారు. దాడులకు వీలుగా స్పెయిన్ దక్షిణ భాగంలో సైనిక స్థావరాలను కలిసి నిర్వహిద్దామన్న ట్రంప్ ఆఫర్‌ను ప్రధాని శాంఛెజ్ తిరస్కరించారు. యుద్ధం ఇలాగే మరో రెండు మూడు వారాలు కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుందని, బ్యారెల్ ముడి చమురు ధర 150 డాలర్లకు చేరే అవకాశం ఉందని ఖతర్ ఇంధన శాఖ మంత్రి హెచ్చరించారు.

### నిలిచిపోయిన బాస్మతి ఎగుమతులు

యుద్ధం వల్ల దేశీయ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతోంది. చమురు విషయంలో ఇబ్బంది ఏమీ లేకపోయినా రవాణా జరిగే హోర్ముజ్ జలసంధిపై ఆంక్షలు, పలు నౌకలు నిలిచిపోవడంతో భారత్‌లో పండే బాస్మతి బియ్యం ఎగుమతి పూర్తిగా ఆగిపోయింది. సుమారు 4 లక్షల టన్నుల బాస్మతి బియ్యం ఎగుమతులు నిలిచిపోయినట్లు వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇందులో కొంత సరుకు నౌకల్లో, మరికొంత పోర్టులు, గోడౌన్లలో నిలిచిపోవడంతో వ్యాపారులు, రైతులు, మిల్లర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారత్ నుంచి ఏటా సగానికి పైగా బాస్మతి బియ్యం సౌదీ అరేబియా, ఇరాక్, యూఏఈ తదితర గల్ఫ్, మిడిల్ ఈస్ట్ దేశాలకే వెళ్తుంది. రవాణా నిలిచిపోవడంతో దేశీయంగా బాస్మతి ధరలు క్వింటాల్‌కు సగటున రూ.1,000 వరకు తగ్గాయి. మధ్యప్రదేశ్‌పై ఈ ప్రభావం ఎక్కువగా పడింది. అక్కడి నుంచి రవాణా అయ్యే అరుదైన బర్వాని రకం అరటి ఎగుమతులు కూడా ఆగిపోయాయి. ఈ సంక్షోభం ముగిస్తేనే తిరిగి వ్యాపారం పుంజుకుంటుందని రైతులు, వ్యాపారులు ఆశిస్తున్నారు.

### గల్ఫ్‌కు 24 విమానాలు రద్దు

పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నేపథ్యంలో విమానాల రద్దు కొనసాగుతోంది. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన 12 విమానాలు, గల్ఫ్ దేశాల నుంచి శంషాబాద్‌కు రావాల్సిన మరో 12 విమానాలు రద్దయ్యాయి. ఖతార్, యూఏఈ, కువైట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా నుంచి రావాల్సిన, వెళ్లాల్సిన విమానాలు రద్దయినట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు.

# అసోంలో కుప్పకూలిన సుఖోయ్.. ఇద్దరు పైలట్ల దుర్మరణం!

**కర్బీ ఆంగ్లాంగ్ లో కూలిన భారత వైమానిక దళ జెట్**

**మృతుల్లో ఆపరేషన్ సిందూర్ లో పాల్గొన్న పూర్వేష్ దురాగ్కర్**

**జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి టేకాఫ్ అయిన కాసేపటికే ప్రమాదం**

**కేవలం నాలుగేళ్లు మాత్రమే దేశానికి సేవ చేశాడంటూ తండ్రి ఆవేదన**

**శిక్షణా మిషన్ లో ఉండగా గాల్లోనే కుప్పకూలిన వైనం**

**న్యూఢిల్లీ, మార్చి 6:** అస్సాంలోని కర్బీ ఆంగ్లాంగ్ లో భారత వైమానిక దళానికి చెందిన సుఖోయ్ జెట్ కుప్పకూలింది. ఈ దారుణ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ దురాగ్కర్ తో పాటు స్క్వాడ్రన్ లీడర్ అనుజ్ ఉన్నారు. పూర్వేష్ ఇటీవల పాకిస్థాన్ పై చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో పాల్గొనడం గమనార్హం. జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి శిక్షణా మిషన్ కోసం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దేశ సేవలో తన కొడుకు ప్రాణాలు అర్పించాడని పూర్వేష్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ దురాగ్కర్ ఆపరేషన్ సిందూర్ లో పాల్గొన్నట్లు అతని కుటుంబ సభ్యులు మీడియాకు వెల్లడించారు. ఈ విషయం ముందుగా తమకు తెలియదని, ఆపరేషన్ సిందూర్ ముగిసిన 15 రోజుల తర్వాతే తెలిసిందని పూర్వేష్ తండ్రి రవీంద్ర దురాగ్కర్ తెలిపారు. ఆ సమయంలో పూర్వేష్ వద్ద ఫోన్ లేదని, అంతా ముగిసిన తర్వాతే తన కొడుకు ఫోన్ చేసి విషయం చెప్పాడని ఆయన వివరించారు. ప్రమాదం జరగడానికి ఒక రోజు ముందు కూడా కొడుకుతో మాట్లాడినట్లు చెబుతూ రవీంద్ర కన్నీటి పర్యంతమయ్యారు. తన కొడుకు భారత వైమానిక దళంలో భాగమైనందుకు గర్వంగా ఉందని చెప్పారు. పూర్వేష్ ఎప్పుడూ యుద్ధ విమానాలను నడిపిన అనుభవాన్ని, ఐఏఎఫ్ జెట్ల వేగం గురించి ఎంతో ఆసక్తిగా చెబుతుండేవాడని ఆయన గుర్తుచేసుకున్నారు.

### నాలుగేళ్లు మాత్రమే దేశ సేవ..

"నా కొడుకు దేశ సేవలో తనను తాను త్యాగం చేసుకున్నాడు. తన కలను నెరవేర్చుకున్నాడు. కానీ, కోరుకున్నంత కాలం దేశానికి సేవ చేయలేకపోయాడు. కేవలం 4 సంవత్సరాలు మాత్రమే పని చేశాడు. పది రోజుల క్రితం మా ఇంటికి వచ్చాడు.. తిరిగి విధుల్లోకి చేరిన తర్వాత ఇలా జరిగింది" అంటూ రవీంద్ర తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్, స్క్వాడ్రన్ లీడర్ అనుజ్ ఓ శిక్షణా మిషన్ లో ఉన్నారు. జోర్హాట్ వైమానిక స్థావరం నుండి వీరి జెట్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కనిపించకుండా పోయింది. సాయంత్రం 7:42 గంటలకు సుఖోయ్ తో కమ్యూనికేషన్ కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. ఆ తర్వాత జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి 60 కిలోమీటర్ల దూరంలో అది కూలిపోయినట్లు గుర్తించారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు.

### పాక్ ను వణికించిన ఆపరేషన్ సిందూర్

పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన రెసిస్టెన్స్ ఫ్రంట్.. ఏప్రిల్ 22న పహల్గామ్ లో ఉగ్రదాడికి పాల్పడింది. దీనికి ప్రతిస్పందనగా భారత దళాలు మే 7వ తేదీన 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించాయి. పాకిస్థాన్, పీఓకే లోని ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేశాయి. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ తర్వాత పాకిస్థాన్.. భారత్ పై క్షిపణులు, డ్రోన్లతో దాడులకు తెగబడగా, భారత రక్షణ దళాలు సమర్థంగా అడ్డుకున్నాయి. ప్రతిదాడులతో పాక్ ను వణికించాయి. మే 10వ తేదీన ఇరు దేశాలు కాల్పుల విరమణ ప్రకటించడంతో ఆపరేషన్ సిందూర్ నిలిచిపోయింది.

# మనం గొర్రెలు మేపాలా.. వాళ్ల పిల్లలు రాజ్యం ఏలాలా?



**హైదరాబాద్, మార్చి 6:** గత బీఆరఎస్ ప్రభుత్వం దళితులకు, బడుగు బలహీన వర్గాలకు బర్రెలు, గొర్రెలు ఇచ్చి మోసం చేసిందని.. మనం గొర్రెలు మేపాలా, వాళ్ల పిల్లలు రాజ్యం ఏలాలా అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాము మాటలు, మూటలతో గెలిచి రాలేదని, కేవలం ప్రజల మద్దతుతోనే అధికారంలోకి వచ్చామని ఆయన స్పష్టం చేశారు. పేదల పక్షపాత ప్రభుత్వమైన తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదనా లేదని తేల్చి చెప్పారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో జరిగిన మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి.. ఎస్సీ వర్గీకరణకు తమ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని, మిత్రధర్మానికి కట్టుబడి కర్ణుడిలా మాదిగల వెంట ఉంటానని ఉద్ఘాటించారు.

### అక్రమ సంపాదన లేదు.. మార్పు కోసమే వచ్చాం

ఈ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఇప్పుడున్నది మీరంతా కోరుకున్న ప్రభుత్వమని, మీరంతా కష్టపడి తెచ్చుకున్న ప్రభుత్వమని ప్రకటించారు. ఎన్నికల్లో మీరంతా తమకు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. మార్పు కోసమే ఈ ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని వివరించారు. గత పాలకులు ఎన్నో అక్రమాలు చేశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. గత ఎన్నికల్లో తాము కేవలం మాటలు, మూటలతో గెలవలేదని కుండబద్దలు కొట్టారు. కేవలం ప్రజల అండదండలతోనే తాము అధికారంలోకి వచ్చామని చెప్పారు. తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదని స్పష్టం చేశారు. చిత్తశుద్ధితో ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నామని, ప్రజాపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని అన్నారు.

### కర్ణుడిలా అండగా నిలబడ్డా..

వర్గీకరణ కోసం మాదిగ జాతి ఎంతో సుదీర్ఘంగా పోరాడిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఈ పోరాటంలో కొందరు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 ఏళ్ల నుంచీ ఈ వర్గీకరణ సమస్య ఉందన్నారు. మీ న్యాయమైన హక్కు కోసం తాను మొదటి నుంచీ మద్దతుగా ఉన్నానని ఆయన భరోసా ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సైతం పంపామని రేవంత్ వివరించారు. మహాభారతంలో మిత్రుడి కోసం కొన ఊపిరి వరకు కర్ణుడు నిలబడ్డాడని ఆయన గుర్తు చేశారు. అదే కర్ణుడి మాదిరిగా తాను కూడా మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డామని సీఎం రేవంత్ ఉద్వేగంగా పేర్కొన్నారు. వర్గీకరణ అంశంలో మాదిగల వైపే న్యాయం ఉందని అన్నారు. అందుకే ఎన్ని రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా మీవైపే నిలబడ్డామని ఆయన స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత దేశంలోనే వర్గీకరణ కోసం ప్రకటన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణనేనని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు.

### విద్యా వ్యవస్థ ప్రక్షాళన కోసమే..

తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు ప్రభుత్వ ఉద్యోగులేనని సీఎం రేవంత్ ప్రశంసించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతే అనేక సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తీసుకొచ్చామన్నారు. ప్రగతి ప్రణాళికలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఉద్యోగులకు హితవు పలికారు. తెలంగాణలో ప్రస్తుతం ఆర్థిక సమస్యలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం వద్ద పంచడానికి భూములు లేవన్నారు. ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటు అంతంత మాత్రంగానే ఉందని స్పష్టం చేశారు. మాదిగలకు మెరుగైన విద్య అందించాలన్నదే తమ ప్రధాన ఆలోచన అని ఆయన పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యాశాఖను తన వద్దే పెట్టుకున్నానని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గత బీఆరఎస్ ప్రభుత్వం బర్రెలు, గొర్రెలు, చేపలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇవన్నీ మనకు ముందే తెలియవా, వీళ్లు కొత్తగా ఇచ్చిందేంటి అంటూ ఆ పార్టీ నేతలపై సీఎం రేవంత్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మనం బర్రెలు, గొర్రెలు మేపుకోవాలా, వాళ్ల పిల్లలు మాత్రం రాజ్యం ఏలుతారా అంటూ బీఆరఎస్ నేతలను సీఎం రేవంత్ సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# లోక్ సభ స్పీకర్ పై అవిశ్వాస తీర్మానం!

- **రెండో దశ బడ్జెట్ సమావేశాల్లో ఓం బిర్లాపై ప్రతిపక్షాల తీర్మానం**
- **పక్షపాతంతో వ్యవహరిస్తున్నారంటూ 118 మంది ఎంపీల నోటీసు**
- **సోమవారం సాధారణ ఎంపీలా సభలో కూర్చోనున్న ఓం బిర్లా**
- **తీర్మానంపై తీవ్ర ఉత్కంఠ.. సొంత ఎంపీలకు విప్ జారీ చేసిన బీజేపీ, కాంగ్రెస్**
- **ఈ నెల 9, 10 తేదీల్లో తీర్మానంపై చర్చ, ఓటింగ్**
- **ఏప్రిల్ 2 వరకు జరగనున్న రెండో దశ పార్లమెంట్ సమావేశాలు**

**న్యూఢిల్లీ, మార్చి 6 :** కేంద్ర బడ్జెట్ పై రెండో దశ సమావేశాలు ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్నాయి. సభలో నెలకొన్న గందరగోళం నేపథ్యంలో మొదటి దశ సమావేశాలు అర్ధాంతరంగా వాయిదాపడ్డాయి. తిరిగి ప్రారంభం కానున్న ఈ రెండో దశ బడ్జెట్ సమావేశాల్లోనే లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాపై కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నాయి. ఆ తర్వాత దీనిపై సభలో చర్చ, ఓటింగ్ ఉంటాయి. తాజా బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 2 వరకు జరుగుతాయి.



### 118 మంది ఎంపీల సంతకాలతో నోటీసు

స్పీకర్ ఓం బిర్లా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ గత నెలలోనే కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షాలు ఆయనను పదవి నుంచి తొలగించాలని కోరుతూ అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చాయి. ప్రతిపక్షాలకు చెందిన 118 మంది ఎంపీలు సంతకాలు చేసి ఈ నోటీసులు ఇచ్చారు. అయితే, ఆ నోటీసు ఇచ్చిన తర్వాత నుంచి సభ వాయిదా పడి కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఇప్పుడు సభ ప్రారంభం కాగానే వచ్చే వారం లోక్ సభలో ప్రతిపక్షం ఈ అవిశ్వాస తీర్మానం పెట్టబోతుంది.

### సాధారణ ఎంపీగా ఓం బిర్లా

ఈ అవిశ్వాస తీర్మాన ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు స్పీకర్ చైర్ లో ఓం బిర్లానే ఉంటారు. సోమవారం ప్రారంభం కానున్న చర్చ సమయంలో మాత్రం ఆయన సాధారణ ఎంపీలాగే సభలో కూర్చుంటారు. పార్లమెంట్ నిబంధనల ప్రకారం ఒక ఎంపీగా తన స్పీకర్ పదవిని రక్షించుకుంటూ మాట్లాడే అవకాశం ఆయనకు ఉంటుంది.


### విప్ జారీ చేసిన బీజేపీ, కాంగ్రెస్

లోక్ సభలో స్పీకర్ పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్న నేపథ్యంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. దీనిపై ఈ నెల 9, 10 తేదీల్లో చర్చ, అనంతరం ఓటింగ్ జరగనుంది. అందువల్ల ఈ రెండు రోజుల్లో ప్రతి ఒక్కరూ సభకు తప్పనిసరిగా హాజరవ్వాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. సభలో చర్చ, ఓటింగ్ సందర్భంగా అందుబాటులో ఉండాలని కఠినంగా ఆదేశించాయి. తమ ఎంపీలు సభలో ఉండి ప్రభుత్వానికి మద్దతు తెలపాలని బీజేపీ సూచించింది.

# 99 రోజుల ప్రణాళిక.. మరో డైవర్షన్ డ్రామా!

- **ప్రజలను ఏమార్చేందుకే కాంగ్రెస్ సర్కార్ కొత్త ప్లాన్**
- **రెండేళ్లుగా రాష్ట్రంలో అదే జరుగుతున్నది**
- **మరోమారు ప్రజలను మోసం చేసే యత్నం**
- **గతంలో ఇచ్చిన దరఖాస్తులకే ఇంకా దిక్కులేదు**
- **800 రోజుల వైఫల్యాలను కప్పిపుచ్చుకునే వ్యూహం**
- **99 రోజుల ప్రజాపాలనపై మండిపడ్డ హరీశ్ రావు**

**హైదరాబాద్, మార్చి 6:** గతంలో రెండుసార్లు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి తీసుకున్న లక్షలాది దరఖాస్తులు పరిష్కారం కాక ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని మాజీ మంత్రి, బీఆరఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దరఖాస్తులకు ఎలాంటి దిక్కు లేదు కానీ, మళ్లీ ఇప్పుడు పది వారాల పాటు పది రకాల నాటకాలతో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం కావడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. రెండున్నరేండ్లలో అసలు ఏం చేశారని ప్రచారం



నిర్వహిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి మీ వైఫల్యాలు మీరే ప్రచారం చేసుకుంటారా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై హరీశ్ రావు మండిపడ్డారు.

### డైవర్షన్ ప్లాన్ తో డ్రామాలు

యాక్షన్ ప్లాన్ పేరిట పాలనా వైఫల్యం నుంచి దృష్టి మరల్చేందుకు డైవర్షన్ ప్లాన్ తో సరికొత్త డ్రామాకు తెర తీశారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఇదంతా కేవలం ప్రచారం కోసమేనని, దీనివల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని అన్నారు. దాదాపు 800 రోజుల పాలనలో చేసిందేం లేక, 99 రోజుల ప్రణాళిక పేరిట రేవంత్ రెడ్డి మరో డ్రామాకు తెరతీశారని ఆరోపించారు. రెండున్నరేండ్ల పాలన పూర్తయిన తర్వాత ఇప్పుడు ప్రగతి ప్రణాళికలు గుర్తుకు వచ్చాయా అంటూ నిలదీశారు. అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు, పాలనా వైఫల్యాలు, కోట్లు కొల్లగొట్టేందుకు చేసిన స్కాములు, ప్రజల ఛీత్కారాల నుంచి దృష్టి మరల్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మరో డైవర్షన్ ప్లాన్ ఇదని తీవ్రంగా విమర్శించారు.

### రైతులు, యువతకు మోసం


కోతల సమయం వచ్చినా ఈ సీజన్ కు సంబంధించి ఇప్పటి వరకు రైతు భరోసాకు దిక్కు లేదని హరీశ్ రావు గుర్తు చేశారు. గత సీజన్ పంట బోనస్ ఇవ్వక చేతులెత్తేశారని మండిపడ్డారు. చివరకు యూరియా కూడా సక్రమంగా సరఫరా చేయలేక రైతులను నడిరోడ్డు మీదకు ఈడ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. నమ్మించి గొంతు కోసిన ఈ మోసాల గురించి పల్లెల్లో రైతులకు వివరిస్తారా అని నిలదీశారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని ఊదరగొట్టి, అధికారంలోకి వచ్చాక యువతను నిలువునా మోసం చేశారని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ ను కాస్తా జాబ్ లెస్ క్యాలెండర్ గా మార్చేశారని ఎద్దేవా చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా మూసీ బ్యూటిఫికేషన్ పేరిట ప్రజాధనం లూటీకి తెగబడ్డారని ఆరోపించారు.

### పబ్లిసిటీ గారడీలను గమనిస్తున్నారు

రాజీవ్ యువ వికాసం పేరిట తీసుకున్న దరఖాస్తులు ఏమయ్యాయో, వాటికి ఎందుకు దిక్కు లేకుండా పోయాయో చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. అవన్నీ పక్కనపెట్టి యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం అంటూ కాంగ్రెస్ నేతలు కొత్త పాట పాడుతున్నారని దుయ్యబట్టారు. అందని గ్యారెంటీల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది బాధితుల సంగతేంటో ముందు చెప్పాలన్నారు. సోలార్ విద్యుత్, పర్యావరణం, డ్రగ్స్ అడ్డుకట్ట లాంటివన్నీ పత్రికల్లో పబ్లిసిటీ ఇచ్చుకునేందుకు పెట్టుకున్న పేర్లు తప్ప, వీటి అమలులో ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. పాలన గాలికి వదిలేసి పబ్లిసిటీ పేరిట చేస్తున్న మీ గారడీలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, ఈ దుర్మార్గ పాలనను నిలదీసేందుకు గ్రామ గ్రామాన ప్రజలు సిద్ధంగా ఉన్నారని హరీశ్ రావు హెచ్చరించారు.

# సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక లాంఛనం

- రాజ్యసభ నామినేషన్ల పరిశీలన పూర్తి
- స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ
- 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడమే కారణం
- వివాదరహితుడు కావడంతోనే వేం వైపు అధిష్ఠానం మొగ్గు





కాంగ్రెస్ పార్టీ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక దాదాపు ఏకగ్రీవం కానుంది.

**హైదరాబాద్, మార్చి 6:** రాజ్యసభ అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాల పరిశీలన శుక్రవారం పూర్తయింది. ఈ సందర్భంగా ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన సాయి అనే వ్యక్తి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. దీంతో

### స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

రాజ్యసభ అభ్యర్థిగా బలపరుస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు నామినేషన్ పత్రాలపై తప్పనిసరిగా ఉండాలని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. కానీ ఆ సంతకాలు సాయి దాఖలు చేసిన నామినేషన్ పత్రాలపై లేవని అధికారులు స్పష్టమైన వివరణ ఇచ్చారు. నిబంధనల ప్రకారం కనీస మద్దతు లేకపోవడం వల్ల ఈ పత్రాలను తిరస్కరించినట్లు వారు తెలిపారు.

### సింఘ్వీ, వేం ఏకగ్రీవం

స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎన్నిక లాంఛనంగా మారింది. అభిషేక్ మను సింఘ్వీకి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వరుసగా మరోసారి అవకాశం కల్పించింది. ఇక రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని తొలిసారిగా రాజ్యసభకు ఎంపిక చేసింది.

### వేం వైపే అధిష్ఠానం మొగ్గు

రాజ్యసభ సీటు ఒకటి అభిషేక్ మను సింఘ్వీకి కేటాయిస్తున్నట్లు పార్టీ అధిష్ఠానం గతంలోనే ప్రకటించింది. ఇక మరో రాజ్యసభ పదవి కోసం కాంగ్రెస్ పార్టీలో చాలా మంది నేతలు తీవ్రంగా పోటీ పడ్డారు. దాదాపు 16 మందితో కూడిన జాబితాను సిద్ధం చేసి సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి తీసుకు వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంతో ఆయన సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా ఉన్న వేం నరేందర్ రెడ్డి వివాదరహితుడు కావడంతో ఆయన వైపు అధిష్ఠానం మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

# ప్రజాపాలన ప్రణాళికను సక్సెస్ చేద్దాం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..

**కరీంనగర్, మార్చి 6 :** సన్నాక సమావేశంలో పాల్గొన్న కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎంపీ ,ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, ఆయా జిల్లాల కలెక్టర్లు, సిపి ఎస్పీలు అదనపు కలెక్టర్లు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో 99 రోజులపాటు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వ యంత్రాంగము ప్రజా ప్రతినిధులు ప్రజలు, అందరం కలిసి విజయవంతం చేద్దామని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో ప్రగతి పథంలో తీసుకెళ్లి అగ్ర భాగాన నిలుపుతామని పేర్కొన్నారు. ఒకవైపు సంక్షేమాన్ని మరోవైపు అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం పరుగులు పెట్టిస్తున్నదని తెలిపారు. రెండున్నర సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలందరికీ వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశానికి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు ,ఎమ్మెల్యేలు పెద్దపెల్లి ఎంపీ ఉమ్మడి జిల్లా పరిధిలోని కలెక్టర్లు సిపి, ఎస్పీలు అడిషనల్ కలెక్టర్లు అన్ని శాఖల ఉన్నత అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఇరిగేషన్, ఆర్ అండ్ బి కి సంబంధించిన



పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. 99 రోజులపాటు ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా గ్రామాలు పట్టణాల్లో ప్రధాన సమస్యలన పరిష్కారం.. రెండున్నర సంవత్సరాల ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలందరికీ అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో దేశంలోనే మహత్తరమైన అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. దేశానికే తెలంగాణ మోడల్ అభివృద్ధిలో నిలుస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి లక్ష కోట్లు బడ్జెట్ కేటాయించిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమేనని పేర్కొన్నారు. అత్యధికంగా పంట పండించడంలోనూ అత్యధికంగా ధాన్యాన్ని సేకరించడం లో తెలంగాణ ప్రభుత్వానికి సాటి ఎవరూ లేరని స్పష్టం చేశారు. ఇరిగేషన్ తోపాటు విద్యుత్ రంగంలోనూ మంచి ఫలితాలు ప్రభుత్వం సాధిస్తుందని తెలిపారు. జిల్లా యంత్రాంగం ముందుండి 99 రోజుల పాటు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్లు ముందుండి నడిపించాలని ప్రజలు, ప్రజా ప్రతినిధులు అధికారులు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.సన్నాహక సమావేశంలో సభ్యులు తెలిపిన సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామన్నారు సమష్టిగా సఫలీకృతంగా ఈ కార్యక్రమాన్ని అందరం కలిసికట్టుగా ఉంటూ 99 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని పూర్తి చేద్దామన్నారు. తద్వారా కరీంనగర్ జిల్లాను అగ్ర భాగాన నిలుపుదామని పేర్కొన్నారు.

# అసంపూర్తిగా అంబర్‌పేట ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు

# వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోండి

- రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ





**హైదరాబాద్,మార్చి6:** అంబర్‌పేట ఫ్లై ఓవర్ కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమైన జాతీయ రహదారుల నిర్మాణం విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న రూ. 1.85 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టుల కేటాయింపులు కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ అభివృద్ధి మీద ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని పేర్కొన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో 2,800 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. మరో 2,500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. తద్వారా తెలంగాణలో నూతనంగా ఏర్పాటైన జిల్లాలతో కలిపి మొత్తం 33 జిల్లాలు కూడా తక్కువ సమయంలోనే జాతీయ రహదారులతో అనుసంధానించామని.. ఇది చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని, ప్రయాణ సమయాన్ని తగ్గించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ రూ.265 కోట్ల వ్యయంతో ఔఊ163 (గతంలో ఔఊ-202) మీద నగరంలోని అంబర్‌పేట క్రాస్ రోడ్డు వద్ద 1.5 కిలోమీటర్ల పొడవైన 4 వరుసల్గ ÷÷-ల ఓవర్‌ను నిర్మించిందని గుర్తుచేశారు. 5 మే, 2025 నాడు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ ఫ్లై ఓవర్‌ను ఘనంగా ప్రారంభించారని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తనతోపాటుగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ఈ్గ ÷÷-ల ఓవర్‌కు అవసరమైన భూసేకరణ పూర్తి కాలేదని అన్నారు. దీని నిర్మాణం జరిగి, ప్రారంభోత్సవం కూడా పూర్తి చేసుకున్నప్పటికీ దీని కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణం మాత్రం పూర్తిస్థాయిలో జరగలేదని తెలిపారు. భూసేకరణ విషయంలో కొన్ని శక్తులు అడ్డుతగులుతోండటంతో అనవసరంగా తీవ్ర జాప్యం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇది 2018లో మంజూరయినప్పటికీ లేని సమస్యలు సృష్టించి భూసేకరణ పూర్తి కాకుండా కుట్రలు చేసి సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో జరగనివ్వకపోవడంతో ఈ రహదారి వెంట ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అప్పటి సీఎం కె. చంద్రశేఖరరావు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి అనేకసార్లు తెలియజేశానని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ మంత్రులకు స్వయంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా అనేకసార్లు తెలియజేశారని అన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్, ఇతర సంబంధిత అధికారుల దృష్టికి తాను కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లి అనేకసార్లు మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేసినప్పటికీ, ఈ సమస్య ఓ కొలిక్కి రాలేదని చెప్పుకొచ్చారు. భూసేకరణకు సంబంధించిన భూమికి రూ. 2.54 కోట్ల పరిహారం లబ్దిదారులకు ప్రభుత్వం చెల్లించినప్పటికీ మధ్య దళారులు అడ్డుకుంటున్నారని అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా చొరవ చూపించి, సర్వీసు రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత జీహెచ్ఎంసీ, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అధికారుల ద్వారా తగిన చర్యలు తీసుకొని సర్వీస్ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించటానికి సహకరించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు.

# తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ

- పార్టీ అధిష్ఠానం నుంచి అధికారిక ఉత్తర్వులు జారీ
- వరంగల్ మాజీ మేయర్ కు దక్కిన కీలక పదవి
- ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం
- నగరానికి మొట్టమొదటి మహిళా మేయర్ గా సేవలందించిన చరిత్ర
- నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



**హైదరాబాద్, మార్చి 6:** తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సీనియర్ నాయకురాలు, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణను పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధత ఉండటం వల్ల అధిష్ఠానం ఆమెపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎర్రబెల్లి స్వర్ణకు వరంగల్ జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలంగా కొనసాగుతూ వస్తున్న ఆమె, ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా కూడా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేశారు.

### మొట్టమొదటి మహిళా మేయర్ గా..

గతంలో ఆమె వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా పనిచేశారు. 2002లో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కు ఎన్నికైన ఆమె, నగరానికి మొట్టమొదటి మహిళా మేయర్ గా సేవలందించి నగరాభివృద్ధిలో తనదైన ముద్రవేశారు. పరిపాలనలో మంచి మార్కులు తెచ్చుకున్నారు. తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ నియామకం పట్ల జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి పార్టీని అంటిపెట్టుకుని ఉన్న సీనియర్ నాయకురాలికి అధిష్ఠానం తగిన గుర్తింపు ఇచ్చిందని కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# సివిల్స్ ఫలితాలు విడుదల.. సత్తా చాటిన తెలుగు తేజాలు

- ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకర్ గా అనూజ్ అగ్నిహోత్రి
- అత్యుత్తమ ర్యాంకులు సాధించిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు
- మొత్తంగా 1087 మంది అభ్యర్థుల ఎంపిక
- 15 రోజుల్లో వెబ్ సైట్ లో మార్కులు అప్ లోడ్
- ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంచిన యూపీఎస్సీ

**న్యూఢిల్లీ, మార్చి 6:** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) శుక్రవారం సివిల్స్ పరీక్ష ఫలితాలను విడుదల చేసింది. ఈ పరీక్షల్లో అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. రాజేశ్వరి సువే రెండో స్థానంలో నిలవగా, ఆకాన్ష్ ధుల్ మూడో ర్యాంక్, రాఘవ్ ఝున్‌ఝున్ వాలా నాలుగో ర్యాంక్ సాధించారు. ఈ ప్రతిష్టాత్మక పరీక్షల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు అభ్యర్థులు అద్భుత ప్రతిభ కనబరిచి సత్తా చాటారు.

### తెలుగు అభ్యర్థుల ర్యాంకులు ఇవే..

తెలుగు రాష్ట్రాలకు చెందిన సృజన 55వ ర్యాంక్, డీఎస్ కే ప్రచేత్ 193వ ర్యాంక్ సాధించారు. ఎం.పవన్ కుమార్ రెడ్డి (297వ ర్యాంక్), ఎస్. వర్షిత్ రెడ్డి (259వ ర్యాంక్), వి. విక్రమసింహారెడ్డి (541వ ర్యాంక్), పోతుపురెడ్డి భార్గవ్ (537వ ర్యాంక్), గుమ్మల శ్వేత (573వ ర్యాంక్), పుడారి రాహుల్ (748వ ర్యాంక్), కత్తిమాని అనిరుధ్ (786వ ర్యాంక్), కోరపాతుల శ్రీకర్ రాజు (806వ ర్యాంక్), ఇస్లావత్ శ్రీరామ్ హర్ష (823 ర్యాంక్), కట్టా ప్రత్యూష (908వ ర్యాంక్), గోగుల రాజశేఖర్ (920వ ర్యాంక్), గుగులోతు జితేందర్ నాయక్ (939వ ర్యాంక్) సాధించి తమ సత్తా చాటారు.

### 15 రోజుల్లో వెబ్ సైట్ లో మార్కులు


ఈ పరీక్షా ఫలితాలు విడుదలైన 15 రోజుల్లో వెబ్ సైట్ లో మార్కులు అప్ లోడ్ చేస్తామని యూపీఎస్సీ ప్రకటించింది. మరిన్ని వివరాల కోసం 23385271, 23381125, 23098543 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సూచించింది. ఉదయం 10 నుంచి సాయంత్రం 05.00 గంటల మధ్య సంప్రదించాలని యూపీఎస్సీ స్పష్టం చేసింది.

### 1087 మంది అభ్యర్థుల ఎంపిక

గతేడాది (2025లో) సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో మెయిన్స్ పరీక్షలు చేపట్టారు. వాటిలో అర్హత పొందిన వారికి ఈ ఏడాది ఫిబ్రవరిలో మౌఖిక పరీక్ష (ఇంటర్వ్యూ) నిర్వహించారు. ఈ చివరి వడపోతలో మొత్తం 1087 మంది అభ్యర్థులు సివిల్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. వీరంతా ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్ తో పాటు గ్రూప్ ఏ, గ్రూప్ బీ లోని వివిధ సెంట్రల్ సర్వీస్ లో చేరనున్నారు.

# మూడు వారాల్లో క్యాతన్‌పల్లి ఎన్నిక

### ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం




**హైదరాబాద్,మార్చి6:** క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక మూడు వారాల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. క్యాతనపల్లి మున్సిపాలిటీ వివాదంపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు పై విధంగా ఆదేశించింది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లిలో పలు రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అర్ధంతరంగా నిలిచిపోయింది. ఇక బీఆర్ఎస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనకు కోర్టు రిమాండ్ విధించింది. బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించగా.. ఇటీవల బెయిల్ మంజూరు అయింది. అనంతరం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తర్వాత కేతనపల్లిలోని తన నివాసంలో బాల్క సుమన్ విలేకర్లతో మాట్లాడుతూ.. స్థానిక ఎంపీ వంశీ కృష్ణ, ఎమ్మెల్యే వివేక్‌పై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. తనను జైల్లో తీవ్ర ఇబ్బందులకు గురి చేశారంటూ పోలీసులపై ఆయన మండిపడ్డారు. ఫిబ్రవరి 11వ తేదీన తెలంగాణలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు పోలింగ్ నిర్వహించారు. ఫిబ్రవరి 14వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. అనంతరం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్ పదవుల ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అలాగే క్యాతనపల్లిలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వేళ.. ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఆగిపోయింది. దీనిపై బీఆర్ఎస్ పార్టీ నేతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు పై విధంగా ఆదేశాలు జారీ చేసింది.



సంపాదకీయం

# ఈ యుద్ధం ముగిసేదెలా ?

**పశ్చిమాసియా యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు. దీనికితోడు ఇది మూడో ప్రపంచ యుద్ధంగా మారబోతుందా అన్న భయాలు వెల్లడవుతున్నాయి. ఎందుకంటే ఇజ్రాయిల్, అమెరికాల దూకుడు తగ్గడం లేదు. ప్రతిగా ఇరాన్ కూడా విధ్వంసం సృష్టిస్తోంది. ఓ రకంగా చెప్పాలంటే ఇరాన్‌ను అమెరికా తక్కువ అంచనా వేసినట్లుగా అర్థం అవుతోంది. మరోవైపు యుద్ధాన్ని ఆపాలని చైనా, రష్యాలు రంగంలోకి దిగాయి. ఇరాన్‌కు ఈ రెండు దేశాలు మద్దతు ప్రకటించాయి. దీంతో ఏంజరగబోతుందో అన్న ఆందోళన సహజంగానే కలుగుతోంది.తాజాగా చైనా నోరు విప్పడంతో ఈ యుద్ధం కీలకమైన మలుపు తీసుకునే అవకాశం లేకపోలేదు. ఒకవేళ ఇరాన్‌లో రహస్యంగా కొనసాగుతున్న న్యూక్లియర్ రియాక్టర్ ఏ మాత్రం లీక్ అయినా, ఇరాన్, పరిసర ప్రాంతాల్లో ఉన్న దేశాలకు కూడా ముప్పు ముంచుకొస్తుంది. దీనిపై ఇటు ఇరాన్‌కు అటు అమెరికాకు కూడా అవగాహన ఉండివుంటుది. కానీ ఎందుకో ఇరాన్ కూడా తమ దాడుల తీవ్రత పెంచింది.ఈ యుద్ధంతో ఇప్పటికే మధ్య ప్రాచ్యం మండిపోతోంది.**

ఇరాన్ సార్వభౌమత్వాన్ని కాపాడతామంటూ చైనా రంగంలోకి దిగడంతో ప్రపంచ దేశాల్లో మూడో ప్రపంచ యుద్ధ భయాలు కనపడుతున్నాయి. ఇదే సమయం లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరిన్న భీకర దాడుల్ని చేసేందుకు సిద్ధమౌతున్నట్లు ప్రకటించారు. యుద్ధం మరో నాలుగైదు వారాలు తప్పదని ట్రంప్ ముందే హెచ్చరించారు. ఆ వెనువెంటనే యుద్ధ తీవ్రత ఎలా ఉంటుందో కూడా చెప్పనే చెప్పారు. ఎనిమిది అరబ్దేశాలు ఇరాన్ దాడులతో విలవిల్లాడు తున్నాయి. ఇరాన్ అమెరికాతో రాజీ చర్చల కోసం ఏవిధంగానూ ప్రయ త్నించడం లేదు. మరోవైపు హర్మూజ్ జలసంధి మూసివేయడంతో ప్రపంచం మీద చమురు భారం పడుతోంది. సంక్షోభం తప్పేలా లేదు. అమెరికా మాత్రం చర్చలకు ఆలస్యం అయ్యిందని బెదిరిస్తోంది. ఇరాన్‌లో తదుపరి ఎవరు నేతగా ఉండాలో తామే నిర్ణయిస్తామని కూడా ట్రంప్ ప్రకటించాడు. ఇకపోతే ఇరాన్ దాడులతో గల్ఫ్ దేశాలు ముప్పు ముంగిట ఉన్నాయి. సౌదీలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రం,రిఫైనపై ఇరాన్ దాడి చేయడంతో చమురు సరఫరా ఆగిపోయింది. ఇరాన్ తన హోర్ముజ్ జలసంధిని మూసి వేస్తే ప్రపంచ దేశాలకు అందే చమురు సరఫరా ఆగిపోగలదని అనుభవంఓలకి వచ్చింది. ఈ క్రమంలో బహ్రెయిన్ పోర్టులో ఆగి ఉన్న అమెరికాకు చెందిన స్టెనా ఇంపరేటివ్ చమురు నౌక పైనా డ్రోన్ దాడులు జరిగి మంటలు చెలరేగాయి. ఇరాన్ ప్రతీకార దాడుల్లో ప్రధానంగా అమెరికా తదితర దేశాల చమురు నౌకలు దెబ్బతింటే ఆయా దేశాలు ఇక చమురుకు కష్టాలు పడాల్సిందే. ఒకవైపు అమెరికా యుద్ధనౌకల మోహరింపు. మరోవైపు ఇరాన్, రష్యా యుద్ధ నౌకలు సంయుక్త నావికాదళ విన్యాసాల కవ్వింపుతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

యుద్ధ జ్వాలలు మింటికెగయడంతో భారత్ దేశంతో సహా ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు, పప్పు ధాన్యాలు, నూనెల ధరలపై విపరీతమైన ప్రభావం పడుతోంది. ఇప్పటికే దక్షిణ కొరియా, జపాన్, చైనా స్టాక్ మార్కెట్లు అతలాకుతలమయ్యాయి. తాజా పరిస్థితుల రీత్యా యుద్ధ సంకేతాలు విస్తరించి ఆయా దేశాలు ఏదో ఓ పక్కకు చేరిపోవడం ఒక్కటే ప్రత్యామ్నాయంగా ఉన్నందున యుద్ధం మరికొంతకాలం తమ ప్రతాపాలను చూపిస్తుంది. యుద్ధం ఆగినా యుద్ధకాలపు ప్రభావాలు అంతత్వరగా ఉపసంహరణ జరుగదు. ఆ తర్వాత కూడా మార్కెట్లు కోలుకోవడానికి, పెరిగిన ధరలు తగ్గడానికి మరెంతో కాలం పడుతుంది. ఎందుకంటే ఇప్పట్లో ఈ యుద్ధం ముగిసేలా లేదు. ఇరువైపులా భీకర యుద్ధమే సాగుతోంది. ఎవరూ తగ్గేటట్లు లేరు. నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడి చేసాయి. ఈ దాడిలో ఏమరుపాటున ఆ అణుకేంద్రం నుంచి వెలువడే అణుధార్మికత ప్రమాదకరమే. ఇరాన్‌ను లొంగదీసుకోవాలని అమెరికా అధినేత ట్రంప్ ప్రయత్నిస్తున్న తరుణంలో చైనా ఇరాన్‌తో చేయికల్పడం ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందోనని సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రష్యా కూడా రంగంలోకి దిగితే ఇక అది ప్రపంచ యుద్ధానికి దారితీయవచ్చు. మరోవైపు ఉక్రెయిన్ కూడా ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికాతో చేతులు కలిపింది. ఇది సహజంగానే రష్యాకు గిట్టదు. మొత్తంగా ప్రపంచ దేశాలు రెండు వర్గాలుగా ఏర్పడితే వినాశనం తప్పదు. ప్రజలు ఆకలిచావులకు లోను కావాల్సిందే. ఈ క్రమంలో యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నాలు సాగాలి. ఇరు దేశాల మధ్య ఇగోలను చల్లార్చాలి. ఈ దశలో ఎవరు ముందుకు వస్తారన్నదే ముఖ్యం.



# ఇజ్రాయిల్‌పై తీవ్రమైన ఇరాన్ ప్రతిదాడులు

- **డిమోనా అణు కేంద్రంపై దాడికి ఇరాన్ గురి**



**టెహ్రాన్, మార్చి 6:** ఇజ్రాయిల్ దాడులకు ప్రతిదాడులను ముమ్మరం చేసిన ఇరాన్ ఇజ్రాయెల్ అణు రియాక్టర్‌పై గురిపెట్టిందన్న వార్తలు వస్తున్నాయి. ఇజ్రాయిల్ అణు కేంద్రాన్ని ధ్వంసం చేస్తామని ప్రకటించింది. ఇజ్రాయెల్ తన అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను డిమోనాకు రక్షణగా మోహరించింది. ప్రపంచంలోనే అత్యంత దుర్భేద్యమైన ప్రదేశంగా మార్చేసింది. ఇక్కడ యారో-2, 3, డేవిడ్ స్లింగ్ వంటి క్షిపణి రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. ఇటీవల తన అత్యాధునిక ఐరన్ బీమ్‌ను కూడా ఇక్కడికే తరలించినట్లు కథనాలు వెలువడ్డాయి. అంతేకాదు.. భూగర్భంలో కొన్ని అంతస్తుల కింద తన అణు కార్యక్రమాన్ని ఇజ్రాయెల్ సురక్షితంగా ఉంచినట్లు తెలుస్తోంది. డిమోనాపై దాడి చేయడానికి ఇరాన్ అమ్ములపొదిలో డ్రోన్లు, క్షిపణులు వంటి చాలారకాల ఆయుధాలు ఉన్నాయి. రియాక్టర్ నుంచి ఇరాన్ 1200-1500 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇంత దూరం ప్రయాణించేందుకు టెహ్రాన్ అమ్ముల పొదిలో షహెద్ 136 డ్రోన్లు భారీ సంఖ్యలో ఉన్నాయి. ఇది దాదాపు 50 కిలోల పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు. ఇక క్షిపణుల విషయానికి వస్తే సాహబ్-3, ఖైబర్‌షేకన్, ఎమాద్, ఖుర్రంషహర్, ఫత్ర, సెజ్జిల్, సుమర్ వంటి క్షిపణులున్నాయి. వీటి రేంజి 1300 కిలోమీటర్ల నుంచి 2500 కిలోమీటర్ల వరకు ఉంది. ఇవికాకుండా ఫతా-2 హైపర్ సోనిక్ క్షిపణి కూడా ఉంది. ఇది ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలను కూడా తప్పించుకోగలదు. గతంలో సిరియాతో ఘర్షణ వేళ ఈ రియాక్టర్ సమీపంలో కొన్ని క్షిపణులు పడ్డాయి. ఇజ్రాయెల్ ఏర్పడిన తర్వాత పొరుగు దేశాలు వరుసగా దానితో యుద్ధాలకు దిగాయి. అమెరికా సాయంతో.. వాటిని ఓడించినా.. ఎప్పటికైనా తన ఉనికికి ముప్పు తప్పదని గ్రహించింది. దీంతో నాటి ప్రధాని డేవిడ్ బెన్ గురియన్ తమ దేశాన్ని అణుశక్తిగా మార్చాలనే నిర్ణయానికి వచ్చారు. ఫ్రాన్స్ సాయంతో అణు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు నెగెవ్ ఎడారిలో 'డిమోనా' అనే ప్రదేశంలో ఓ భారీ రియాక్టర్‌ను ఇజ్రాయెల్ నిర్మించింది. ఐరోపా దేశాల టెక్నాలజీ, బ్లూప్రింట్స్, నిపుణుల సాయంతో దీనిని రూపొందించారు. ఇందులోని భూగర్భ బంకర్లలో అణుబాంబులకు వాడే ప్లుటోనియం ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ఈ విషయం అతికొద్దిమందికి మాత్రమే తెలుసు. అలా ఇజ్రాయెల్ అణ్వాయుధం తయారీలో డిమోనా రియాక్టర్ కీలక పాత్ర పోషించింది. ఈ రియాక్టర్‌కు ఉత్తరం వైపు 85 కిలోమీటర్ల దూరంలో జెరూసలెం నగరం ఉంది. ఇక 75 కిలోమీటర్ల దూరంలో ఈజిప్ట్ సరిహద్దులు.. 25 కిలోమీటర్ల దూరంలో జోర్డాన్ ఉన్నాయి. ఒకవేళ దాడి జరిగితే ఇక్కడి నుంచి లీకయ్యే రేడియేషన్ ప్రభావం ఈ దేశాలకు పాకే ప్రమాదం ఉంది.

# అమెరికా ఆస్తులపైనే మా దాడులు

- **అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు**
- **ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే**

**న్యూఢిల్లీ, మార్చి 6:** పశ్చిమాసియాలోని అమెరికా ఆస్తులపై మాత్రమే తాము దాడులు చేస్తున్నామని ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే వెల్లడించారు. తమ దాడుల వల్ల పొరుగున ఉన్న అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో తన దేశం చేపడుతున్న చర్యలను ఆయన సమర్థించారు. యూఎస్ ఆస్తులనే మేం లక్ష్యంగా చేసుకుంటున్నాం. అందుకే మా దాడుల వల్ల అరబ్ దేశాల్లో ప్రాణనష్టం సంభవించలేదని ఖతీబ్జాదే అన్నారు. అలాగే ఇటీవల హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌక ఐరిస్ దేనా-75ను యూఎస్ ముంచేసిన సంగతి తెలిసిందే. భారత స్నేహితుల ఆహ్వానం మేరకు ఆ నౌక ఇక్కడికి వచ్చింది. దానిపై అమెరికా దాడి దురదృష్టకరం అని వ్యాఖ్యానించారు. అలాగే దిల్లీ పర్యటనలో భాగంగా ఆయన భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో ఖమేనీ సహా పాలనావర్గానికి చెందిన పలువురు ఉన్నతస్థాయి వ్యక్తులు చనిపోయారు. వారి మృతితో ఇరాన్ రాజకీయ వ్యవస్థ కూలిపోతుందని ట్రంప్ ప్రభుత్వం వ్యాఖ్యలు చేస్తోంది. వాటిని ఖతీబ్జాదే తోసిపుచ్చారు. తమ దేశ పాలనా నిర్మాణం వ్యక్తులపై కాకుండా వ్యవస్థలపై ఆధారపడి ఉందని స్పష్టంచేశారు. 'ఇరాన్‌లో రాజ్యాంగం ఉంది. ఎవరెవరు ఏఏ బాధ్యతలు నిర్వహించాలనే దానిపై స్పష్టమైన విభజన ఉంది' అని అన్నారు.







# పశ్చిమాసియా యుద్ధంలో బాలలు బలి

**200 మంది వరకు చనిపోయినట్లు యూనిసెఫ్ ప్రకటన**

**న్యూఢిల్లీ, మార్చి 6:** అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ దాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. యుద్ధం కారణంగా ఎంతోమంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వారిలో చిన్నారులు కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం మొదలైన నాటినుంచి దాదాపు 200 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని తాజాగా యునిసెఫ్ పేర్కొంది. ఇందులో అత్యధికంగా ఇరాన్‌లో 181 మంది మరణించినట్లు వెల్లడించింది. లెబనాన్‌లో (7), ఇజ్రాయెల్ (3), కువైట్(1)లో మృతి చెందినట్లు తెలిపింది. యుద్ధాలు పిల్లలు ప్రారంభించరు.. కానీ, మూల్యం మాత్రం చెల్లిస్తున్నారు అని వ్యాఖ్యానించింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే చిన్నారులపై ఆందోళనకర ప్రభావాన్ని చూపిందని పేర్కొంది. ఇదిలాఉండగా.. అమెరికా- ఇజ్రాయెల్ తొలిరోజు ఆపరేషన్‌లో ఇరాన్‌లోని మినాబ్‌లో ఉన్న ఓ బాలికల పాఠశాలపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 160 మందికి పైగా విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తెలిపింది. ఈ దాడిపై తాజాగా యూఎస్ దళాలు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు యూఎస్ అధికారులు పేర్కొన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

# ఇరాన్ బేషరతుగా లొంగిపోవాల్సిందే - ట్రంప్



**ఢిల్లీ:** ఇరాన్‌తో ఎటువంటి ఒప్పందం ఉండదని, బేషరతుగా లొంగిపోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఆ తర్వాత ఇరాన్‌కు ఆమోదయోగ్యమైన నాయకుడి ఎన్నిక ఉంటుందన్నారు. వివిధ భాగస్వామ్య పక్షాలతో కలిసి ఇరాన్‌ను సంక్షోభం నుంచి బయటకు తీసుకువచ్చేందుకు తాము కృషి చేస్తామన్నారు. గతంలో లేని విధంగా ఇరాన్‌ను ఆర్థికంగా మెరుగైన, బలమైన స్థితికి తీసుకువస్తామన్నారు. ఇరాన్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొంటూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ పోస్టు చేశారు.మరోవైపు పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధంపై కొన్ని దేశాలు మధ్యవర్తిత్వ ప్రయత్నాలు చేస్తున్నాయని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ పేర్కొన్నారు. అయితే, ఏయే దేశాలు ప్రయత్నాలు చేస్తున్నాయన్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. తమ ప్రాంతంలో శాశ్వత శాంతికి కట్టుబడి ఉన్నామని.. అయినప్పటికీ, తమ దేశ గౌరవం, సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటామనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు.

# యుద్ధం నుంచి వెనక్కి తగ్గబోం

**అసలు యుద్ధం మొదలయ్యిందే ఇప్పుడు**

**అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ స్పష్టం**

**వాషింగ్టన్, మార్చి 6:** ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం నుంచి వెనక్కి తగ్గేదే లేదని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ స్పష్టం చేశారు. అమెరికా సైనిక శక్తిని ఇరాన్ తక్కువ అంచనా వేస్తోందన్నారు. ఈ యుద్ధంలో అమెరికా నిలబడలేదని ఇరాన్ అనుకుంటోందని, తాము అసలు పోరాటాన్ని ఇప్పుడే మొదలుపెట్టామని ఆయన పేర్కొన్నారు. ఇక గల్ఫ్ ప్రాంత సముద్ర జలాల్లో అమెరికా నౌకా దళాలు వెనక్కి జరుగుతున్నాయనే ప్రచారాన్ని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఖండించింది. యావత్ ఇరాన్ నేవీని సముద్రంలో ముంచేసే వరకు తమ మిషన్ ఆగదని తేల్చి చెప్పింది. గత 72 గంటల్లో ఇరాన్‌లోని దాదాపు 200 లక్ష్యాలపై అమెరికా బాంబర్ ఫోర్స్ వైమానిక దాడులు చేసిందని సెంట్‌కామ్ వెల్లడించింది. బి-2 స్పిరిట్ బాంబర్ విమానాల నుంచి కేవలం ఒక గంట వ్యవధిలోనే 2వేల పౌండ్ల బరువున్న డజన్ల కొద్దీ పెనెట్రేటర్ బాంబులను బాలిస్టిక్ మిస్సైల్ లాంచ్ ప్యాడ్లపై వేశామని పేర్కొంది. అమెరికా సంకల్పం ఎంత బలమైందో ఇరాన్ అర్థం చేసుకోలేకపోతోందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ అన్నారు. ఇరాన్‌పై తమ సైనిక చర్యను బలంగా కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. వాషింగ్టన్‌లో విలేకరుల సమావేశం వేదికగా పీట్ హెగ్సెథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాను ఇరాన్ నేతలు, ఐఆర్‌జీసీ తక్కువ అంచనా వేస్తున్నాయని ఆయన చెప్పారు. తమ సంకల్పానికి కట్టుబడి ఉంటామని, ఇరాన్‌పై పోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. పూర్తి శక్తితో అమెరికా ఇప్పుడే దాడులను మొదలుపెట్టిందన్నారు. ఒకవేళ అవసరమైతే దీర్ఘకాలం పాటు ఈ యుద్ధాన్ని చేసేందుకూ అమెరికా సన్నద్ధమై ఉందని పేర్కొన్నారు. ఇరాన్ దాడుల నేపథ్యంలో అరబ్ దేశాల నుంచి అమెరికాకు శరణార్థులు క్యూ కట్టే ఛాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. అయితే అరబ్ శరణార్థులకు అమెరికాలో ఆశ్రయాన్ని కల్పించే ఎలాంటి ప్రణాళికలూ ప్రస్తుతానికి తమకు లేవని అమెరికా రక్షణ మంత్రి తేల్చి చెప్పారు.



# బీసీ కమిటీ నివేదిక తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు

**విజయవాడ :** ఏపీ పాలిటిక్స్‌లో స్థానిక పోరు ఊరిస్తోంది. న్యూఇయర్ స్టార్టింగ్‌లోనే పంచాయతీ ఎలక్షన్స్ పెడతారని ఊహాగానాలు వినిపించినప్పటికీ..ఇప్పటికీ ఓ క్లారిటీ లేదు. జనగణన అడ్డంకిగా మారిందన్న ప్రచారం ఓవైపు..స్టేట్ ఈసీ రివ్యూస్..లోకల్ బాడీ పోల్స్‌పై సస్పెన్స్‌ను కంటిన్యూ చేస్తున్నాయి. ఏపీలో ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2న ముగుస్తుంది. మార్చిలో..కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీకాలం అయిపోనుంది. అందుకు తగ్గట్లుగానే స్టేట్ ఎలక్షన్ కమిషన్ అరేంజ్‌మెంట్స్‌ను స్పీడప్ చేసింది. మార్చిలో టెన్త్ ఎగ్జామ్స్ అయిపోయాక వరుసపెట్టి జూన్ లోపు స్థానిక ఎన్నికలను పూర్తి చేయాలనుకుంది ఏపీ సర్కార్. కానీ ఇంతలోనే ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీ అమలు దిశగా అడుగులు వేసింది. ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ రిపోర్ట్ ఇచ్చాక బీసీ కోటా పెంపుపై ఏదో ఒక నిర్ణయం తీసుకున్నాకే..లోకల్ ఫైట్‌పై ముందడుగు వేస్తారన్న టాక్ బయలుదేరింది.మరోవైపు రాష్ట్ర ఎన్నికల కమిషన్..ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు? ఎంతమంది అనర్హులు ఉన్నారనే వివరాలను సేకరిస్తోంది. ఈ నెల 20 నాటికి ఈ కసరత్తు పూర్తి చేసి..ఓటర్ల జాబితాను ఫైనల్ చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. దీని ప్రకారం..ఏప్రిల్ 2వ తేదీతో ముగియనున్న పంచాయతీలకు గడువు ప్రకారం..ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ రెడీగా ఉన్నట్లే. కానీ పల్లె పోరుపై సర్కారు ఆలోచన మాత్రం వేరేగా ఉందట. ఏప్రిల్ 2నే గ్రామాల స్థాయిలో పంచాయతీలకు గడువు ముగిసిపోనున్నా.. ఈ ఎన్నికలకు బ్రేక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.బీసీ రిజర్వేషన్లపై మిశ్రా కమిషన్ అధ్యయనం చేస్తోంది. ఆ రిపోర్ట్ వచ్చిన తర్వాత..ప్రభుత్వం అధ్యయనం చేసి..ఎన్నికలకు వెళ్లనుందని అంటున్నారు. ఈ ప్రాసెస్‌కు కొంత టైమ్ పట్టే అవకాశం ఉంటుంది. ఇక రిజర్వేషన్లపై ఎలాగూ న్యాయపరమైన సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వాటిన్నింటిని సాల్వ్ చేసుకుని..బీసీ కోటాను పెంచే లోకల్ బాడీ ఎన్నికలపై ముందుకెళ్లాలని సర్కార్ భావిస్తోందట.ఇలా స్థానిక పోరుపై ఎప్పటికప్పుడు అప్ డేట్స్ కమింగ్ సూన్ అన్నట్లుగా మారిపోయింది పరిస్థితి. స్టేట్ ఎలక్షన్ కమిషన్ అరేంజ్‌మెంట్స్‌ను స్పీడప్ చేసినా..కూటమి ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను కాస్త ఆలస్యంగా నిర్వహించే యోచనలోనే ఉందంటున్నారు. ఏప్రిల్‌లోపు ఎన్నికలకు వెళ్తారని ప్రచారం జరుగుతున్న టైమ్‌లోనే ఏపీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. లోకల్ బాడీస్‌లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి



పెంచాలని డిసైడ్ అయింది. ఈ క్రమంలో సెన్సేషనల్ డెసిషన్ తీసుకుంది కూటమి ప్రభుత్వం.బీసీ కోటా పెంపు సాధ్యాసాధ్యాలు, న్యాయ సమస్యల అధ్యయనానికి కమిషన్ వేసింది సర్కార్. బీసీలకు రాజకీయంగా మేలు చేసే ఉద్దేశంతో ఏకంగా 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు స్టార్ట్ చేసింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కోసం మాజీ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది సర్కార్. ఈ కమిషన్ పూర్తిగా అధ్యయనం చేసి తన నివేదికను ప్రభుత్వానికి ఇస్తుంది. 45 రోజుల్లో నివేదికను ఇవ్వాలని కూడా ఏకసభ్య కమిషన్‌కు కాల పరిమితిని విధించింది సర్కార్. కమిషన్ ఇచ్చే రిపోర్ట్‌ను బేస్ చేసుకుని బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ప్రభుత్వం డెసిషన్ తీసుకోనుంది.బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. బీసీలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకుని ఎన్నికలకు వెళ్తే తమకు ఇంకా అడ్వాంటేజ్ మారుతుందని..బెటర్ రిజల్ట్స్ వస్తాయని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో ఎలాగూ అధికార పార్టీకి అనుకూలంగా ఫలితాలు వస్తుంటాయి. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశం ట్రంప్ కార్డుగా వాడుకునేందుకు ప్లాన్ చేస్తోంది ప్రభుత్వం. అయితే రిజర్వేషన్లు పెంపు హామీకి కూటమి సర్కార్ కట్టుబడి ఉన్నప్పటికీ, సుప్రీంకోర్టు నిబంధనలు అడ్డుగా మారే అవకాశం ఉందన్న టాక్ వినిపిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలతో కలిపి మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని గతంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పే..బీసీ రిజర్వేషన్ల పెంపునకు సమస్యలు తెచ్చి పెడుతోంది. ఏపీలో ఇప్పటికే బీసీలకు 24 శాతం రిజర్వేషన్ అమలవుతోంది. దీనిని 34 శాతానికి పెంచితే మొత్తం రిజర్వేషన్లు 60 శాతానికి చేరి సుప్రీంకోర్టు పెట్టిన కోటా దాటిపోనుంది.ఇటీవల తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు పెట్టిన పరిమితిని దాటాలని ప్రయత్నించినా, లీగల్ సమస్యలు వచ్చి కోర్టుల్లోనే ఆగిపోయిన పరిస్థితి. అయితే ఈ సమస్యలన్నింటిని దృష్టిలో పెట్టుకునే బీసీ రిజర్వేషన్ల పెంపునకు ట్రిపుల్ టెస్ట్ ఫార్ములాను ఫాలో అయ్యే ఆలోచనలో ఉందట కూటమి సర్కార్. అందుకే ముందుగా బీసీల వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేసేందుకు డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని అంటున్నారు.ఎలాంటి చట్టపరమైన సమస్యలు రాకుండా సూచనలు ఇవ్వాలని ఇప్పటికే డెడికేటెడ్ కమిషన్‌కు సూచించింది ప్రభుత్వం. ఒకవేళ కమిషన్ రిపోర్ట్ బేస్ చేసుకుని జీవోనో ఆర్డినెన్సో జారీ చేస్తే..లీగల్ సమస్యలు వచ్చినా కేంద్రంతో చర్చించి బీసీ కోటా పెంపునకు లైన్ క్లియర్ చేసుకోవాలని భావిస్తున్నారట కూటమి పెద్దలు. ఒకవేళ చట్టపరంగా రిజర్వేషన్ల పెంపునకు సమస్యలు వస్తే..పార్టీపరంగా బీసీలకు అధిక సీట్లు కేటాయించే యోచనలో కూడా ఉన్నారట. ఈ నేపథ్యంలో ఏపీలో పంచాయతీ ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది.

# క్రిస్టియన్ కార్డు ఎవరికి లాభం... ఎవరికి నష్టం

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం 'మతం' చుట్టూ సాగుతున్న రాజకీయం పెను దుమారం రేపుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఒక నిర్దిష్ట మతానికే పరిమితమైన పార్టీగా చిత్రీకరించడంలో తెలుగుదేశం కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందనే చర్చ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా శాసనమండలి వేదికగా జరిగిన పరిణామాలు, సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులు వైసీపీని తీవ్రమైన ఆత్మరక్షణలో పడేశాయి.ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు అభివృద్ధి, సంక్షేమం నుంచి మతపరమైన అంశాల వైపు మళ్లుతోంది. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి వ్యక్తిగత విశ్వాసాలను ఆసరాగా చేసుకుని, ఆ పార్టీని ఒక క్రిస్టియన్ పార్టీగా ముద్ర వేయడం ద్వారా హిందూ ఓటు బ్యాంకును దూరం చేయాలనేది టీడీపీ పక్కా వ్యూహంగా కనిపిస్తోంది.శాసన మండలిలో మంత్రి అచ్చెన్నాయుడు నేరుగా మండలి చైర్మన్ మోషేన్ రాజు, జగన్మోహన్ రెడ్డిలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి ఆజ్యం పోశాయి. తామంతా హిందువులమని, వారు క్రిస్టియన్లని ఆయన వ్యాఖ్యానించడం సంచలనం సృష్టించింది. దీనిపై మోషేన్ రాజు తాను హిందువునని స్పష్టం చేయడం, అచ్చెన్నాయుడు క్షమాపణలు చెప్పడంతో సభలో ఆ వివాదం ముగిసినట్లు కనిపించినా, అసలు కథ సోషల్ మీడియాలో మొదలైంది.సభలో అచ్చెన్నాయుడు వెనక్కి తగ్గినప్పటికీ, టీడీపీ సోషల్ మీడియా విభాగం మాత్రం మోషేన్ రాజు గతంలో చర్చిల్లో పాల్గొన్న వీడియోలు, ఆయన మతపరమైన నేపథ్యాన్ని సూచించే ఫొటోలను బయటపెట్టింది. "నోటితో హిందువునని చెబుతూ, ఆచరణలో క్రిస్టియానిటీని పాటిస్తున్నారు" అనే అర్థం వచ్చేలా చేస్తున్న ప్రచారం వైసీపీని ఇరకాటంలో పడేసింది. ఈ పరిణామం వల్ల పార్టీ నాయకత్వం సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.గత కొన్ని రోజులుగా తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంపై చర్చ జరగాలని వైసీపీ పట్టుబట్టింది. ప్రభుత్వం చర్చకు వెనకాడుతోందని ప్రచారం చేసుకున్న వైసీపీకి, తీరా చర్చ మొదలయ్యాక సీన్ రివర్స్ అయ్యింది. చర్చను తమకు అనుకూలంగా మలుచుకోవడంలో వైసీపీ సభ్యులు



విఫలమయ్యారు. కేవలం సాంకేతిక అంశాల మీద కాకుండా, భావోద్వేగ అంశాల మీద ప్రభుత్వం చేసిన దాడిని వారు తిప్పికొట్టలేకపోయారు. వైసీపీ హయాంలోనే అపవిత్రం జరిగిందని, హిందూ ధర్మంపై ఆ పార్టీకి గౌరవం లేదని మంత్రులు చేసిన ఆరోపణలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయి. జగన్ 'డిక్లరేషన్' అంశాన్ని కూడా దీనికి ముడిపెట్టడంతో, వైసీపీ కేవలం ఒక మతానికే కొమ్ముకాస్తోందనే భావనను కలిగించడంలో టీడీపీ కూటమి సక్సెస్ అయ్యింది.రాజకీయాల్లో ఒకసారి ముద్ర పడితే దాన్ని చెరిపేసుకోవడం చాలా కష్టం. గతంలో బీజేపీపై ఉన్న 'హిందూత్వ' ముద్రను ఆ పార్టీ బలంగా వాడుకోగా, ఇప్పుడు వైసీపీపై పడుతున్న 'క్రిస్టియన్ పార్టీ' ముద్రను టీడీపీ ఎన్నికల అస్త్రంగా మలుచుకుంటోంది. జగన్మోహన్ రెడ్డి తాను అన్ని మతాలను గౌరవిస్తానని చెబుతున్నా, పార్టీలోని కీలక నేతల మతపరమైన నేపథ్యాలను సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టడం ద్వారా వైసీపీని హిందూ వ్యతిరేక పార్టీగా చూపించే ప్రయత్నం ముమ్మరంగా సాగుతోంది. దీనివల్ల తటస్థంగా ఉండే హిందూ ఓటర్లు వైసీపీకి దూరం అయ్యే ప్రమాదం ఉంది. తిరుమల వంటి సున్నితమైన అంశాల్లో తడబడటం, సొంత పార్టీ నేతల మతపరమైన క్లారిటీ లేకపోవడం వైసీపీకి పెద్ద మైనస్ పాయింట్లుగా మారుతున్నాయి.

## ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఈడీ దూకుడు...

-మొదటిపేజీ తరువాయి

డిపాజిట్లు, భూములు, ఇతర స్థిరాస్తులు ఉన్నాయి. ఏపీలో 2019కి ముందు మద్యం వ్యాపారం పారదర్శకంగా, డిజిటల్ ట్రాకింగ్‌తో జరిగేదని, అయితే ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం కావాలనే ఆటోమేటెడ్ విధానాన్ని రద్దు చేసి మాన్యువల్ విధానాన్ని తీసుకొచ్చిందని ఈడీ పేర్కొంది. ఈ కొత్త విధానం ద్వారా అధికారులకు విచక్షణాధికారాలు కట్టబెట్టి, తమకు నచ్చిన బ్రాండ్లకు అనుకూలంగా వ్యవహరించారని దర్యాప్తులో తేలింది. ఆర్డర్లు ఇవ్వాలంటే 15 నుంచి 20 శాతం ముడుపులు ఇవ్వాలని డిస్టిలరీలను సిండికేట్ సభ్యులు డిమాండ్ చేశారని, నిరాకరించిన వారి చెల్లింపులు నిలిపివేశారని ఈడీ ఆరోపించింది. ఈ అక్రమాల వల్ల ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.3,500 నుంచి రూ.4,000 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేసింది. వసూలు చేసిన ముడుపులను హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో దాచిపెట్టి, అక్కడి నుంచి తరలించినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో కీలక నిందితులు 'సిగ్నల్ వంటి ఎన్‌క్రిప్టెడ్ యాప్స్ ద్వారా సంభాషణలు జరిపారని, దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని ఈడీ స్పష్టం చేసింది.

## ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు అస్వస్థత

-మొదటిపేజీ తరువాయి

దీంతో ఆయనను హైదరాబాద్‌కు తరలించారు. సిటీ న్యూరో సెంటర్‌లో చికిత్స అందించారు. కాగా ఆ తర్వాత ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కానీ మళ్లీ నేడు మండలిలో మాట్లాడుతున్న బొత్స మరోసారి అస్వస్థతకు గురయ్యారు. మండలిలో మరోసారి అస్వస్థతకు గురైన బొత్స: ద్రవ్య వినిమయ బిల్లు పై ప్రసంగిస్తుండగా బొత్స అస్వస్తతకు లోనయ్యారు. వెనక్కి తుల్లి పడబోతుండగా మరో సభ్యుడు పట్టుకున్నారు. బొత్స ఆరోగ్య పరిస్థితిని గుర్తించిన మండలి ఛైర్మన్ సభను ఓసారి వాయిదా వేశారు. సభ నుంచి తన ఛాంబర్‌కు వచ్చిన బొత్సకు అసెంబ్లీలోని వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. బొత్సకు బీపీ కాస్త ఎక్కువగా ఉన్నట్లు గుర్తించిన వైద్యులు బొత్సకు చికిత్స అందించే వైద్యులతో మాట్లాడి మందులు ఇచ్చి పంపారు.

### హైదరాబాద్‌కు బొత్స

కాసేపటికే తిరిగి సభకు వచ్చిన బొత్స ద్రవ్య వినిమయ బిల్లుపై ప్రసంగించారు. తిరిగి మరోసారి స్వల్ప అస్వస్తతకు గురి కావడంతో విశ్రాంతి తీసుకోవాలని సూచించినా వినకుండా ప్రసంగాన్ని ముగించే వరకు ఆయన మాట్లాడారు. అనంతరం అసెంబ్లీ లోని చాంబర్?కు రాగా వైద్యులు మరోసారి పరీక్షించారు. బొత్స ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్?లో రెగ్యులర్?గా చికిత్స అందించే వైద్యులతో మాట్లాడిన బొత్స వారి సూచన మేరకు మరో సారి అక్కడకే బయలు దేరారు. చికిత్స కోసం శాసన సభ నుంచి నేరుగా హైదరాబాద్? కు బయలు దేరారు. పయ్యావుల పరామర్శ: మంత్రి పయ్యావుల కేశవ్? బొత్స ఆరోగ్య పరిస్థితిపై వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం బొత్స పరిస్థితి ఎలా ఉందని ఆరా తీశారు. తగినంత విశ్రాంతి తీసుకోవాలని బొత్సకు సూచించారు.


## 13 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం

-మొదటిపేజీ తరువాయి

చర్యను చేపడుతున్నట్లు తెలిపారు. పిల్లలు సోషల్ మీడియా వినియోగంపై సీఎం చంద్రబాబు అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు చేశారు. 13 ఏళ్లలోపు వారు సోషల్ మీడియా ఉపయోగించకుండా నిషేధం విధించనున్నట్లు వెల్లడించారు. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. 13 ఏళ్ల లోపు వారికి సంబంధించి సోషల్ మీడియా బ్యాన్ చేస్తే బాగుంటుందని ఆ వయసు లోపు వారికి సోషల్ మీడియా అందుబాటులో లేకుండా చేసే కార్యక్రమానికి 90 రోజుల్లో శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. 13-16 ఏళ్లలోపు వారికి సంబంధించి ఏం చేయాలన్నదానిపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సోషల్ మీడియా వల్ల మన పిల్లలు నష్టపోకూడదని. దానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. టెక్నాలజీని వాడుకుంటే ఆయుధంగా పనిచేస్తుందని, బానిసైతే జీవితాలు నాశనమవుతాయని అన్నారు. దావోస్?లో వెల్లడించిన మంత్రి లోకేశ్: ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో పిల్లలు సోషల్ మీడియా వినియోగించడంపై మంత్రి నారా లోకేశ్ అభిప్రాయాన్ని వెల్లడించారు. అలానే కొద్ది రోజుల క్రితం సచివాలయంలో నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల సదస్సులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ బాలబాలికలు సోషల్ మీడియా వినియోగించకుండా నియంత్రించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వినియోగంపై ప్రత్యేక చట్టం తీసుకొస్తామని ప్రకటించారు. సోషల్ మీడియా అడ్డం పెట్టుకుని అసభ్య దూషణలతో వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. గతంలో అసభ్య పదజాలంతో రెచ్చిపోయిన వారిని వదిలిపెట్టకుండా నియంత్రించగలిగామని గుర్తు చేస్తూ మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని, ఏపీని అత్యంత సురక్షిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## ప్రపంచం దృష్టిని ఆకర్షించే వేదిక

-మొదటిపేజీ తరువాయి



ప్రపంచ రాజకీయాలు, అంతర్జాతీయంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థపై చర్చించేందుకు అత్యున్నత వేదికగా 'రైసినా డైలాగ్'కు గొప్ప పేరుంది. 2016 నుంచి ఏటా నిర్వహిస్తున్న ఈ సదస్సు.. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన 'మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్' తరహాలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈసారి జరుగుతున్న 11వ ఎడిషన్ సదస్సులో దాదాపు 110 దేశాలకు చెందిన 2,700 మంది ప్రతినిధులు పాల్గొంటుండటం విశేషం. వివిధ దేశాల అధినేతలు, మంత్రులు, అత్యున్నత సైనిక అధికారులు, విధానకర్తలు, మేధావులు ఒకే వేదికపై గ్లోబల్ వ్యూహాలను చర్చించనున్నారు. ఈ ఏడాది ఈ సదస్సును సంస్కార, అన్వేషణ, సమన్వయం, పురోగతి అనే ఆసక్తికరమైన థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ ఈ సదస్సులో ప్రధాన ఉపన్యాసం చేయనున్నారు.

### సీఎం పర్యటన వివరాలు

ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు రేపు (మార్చి 7) ఉదయం 10.50 గంటలకు విజయవాడ నుంచి విమానంలో ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ వేదికగా జరిగే 'రైసినా డైలాగ్ 2026' సెషన్‌లో పాల్గొంటారు. సదస్సు ముగిసిన అనంతరం ఆయన తిరిగి అమరావతికి పయనమవుతారు.

### ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా ప్రసంగం

దేశంలోనే అభివృద్ధి పథాన నడుస్తున్న రాష్ట్రంగా ఏపీలో అమలు చేస్తున్న సుపరిపాలన, డిజిటల్ విప్లవం గురించి ముఖ్యమంత్రి తన ప్రసంగంలో సవివరంగా చెప్పనున్నారు. ప్రధానంగా రియల్ టైమ్ గవర్నెన్స్, డేటా ఆధారిత నిర్ణయాల ద్వారా సామాన్య ప్రజలకు పౌరసేవలను ఎంత వేగంగా, పారదర్శకంగా అందిస్తున్నారో వివరించనున్నారు. పాలనకు సాంకేతికతను జోడించి ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, సంపద సృష్టి, 'స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్' వంటి అంశాలపై తన సుదీర్ఘ అనుభవాలను అంతర్జాతీయ ప్రతినిధులతో పంచుకోనున్నారు. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ ఆవిష్కరణల కేంద్రంగా, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న దార్శనిక నిర్ణయాలను ప్రపంచ దేశాల ముందు ఉంచనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఎకోసిస్టమ్, భారీ డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీ కారిడార్ల ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సీఎం వివరించనున్నారు. పెట్టుబడులకు స్వర్గధామంగా ఏపీని మార్చేందుకు చేస్తున్న కృషిని, భవిష్యత్ ప్రణాళికలను ఈ వేదిక ద్వారా ప్రపంచానికి తెలియజేయనున్నారు.

# రాజ్యసభ సభ్యుడికి సన్మానం.



**నిజామాబాద్ మార్చి 06:-** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా ఇదివరకే కొనసాగించి ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడుగా వేం నరేందర్ రెడ్డి కి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాటేపల్లి నరేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాటిపల్లి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తగా కొనసాగుతూ వాటికి మేలు జరిగే విధంగా కృషిచేసిన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీలో ప్రత్యేక స్థానం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో బహిరంగ సభలోని ప్రజల సమక్షంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో చిరస్థాయిలో ప్రజల గుండెల్లో నిలిచిపోతారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీకి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్త రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ ఫలాలను ప్రజల వద్దకు చేరే విధంగా కృషి చేయాలని ఆయన సూచించడం జరిగిందనీ అన్నారు. రాబోయే రోజులలో విడుదల వారీగా సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీకి కృషిచేసిన పనితీరును దృష్టిలో పెట్టుకొని ఖచ్చితంగా పదవులు కట్టబెట్టడం జరిగి తీరుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి సీనియర్ నాయకుడికి భరోసా ఇవ్వడం జరిగిందన్నారు. రాజ్యసభ సభ్యుడుగా నియమితులైన వేం నరేందర్ రెడ్డి కి శాలువా కప్పి పుష్పగుచ్చాన్ని అందించి మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో కాటిపల్లి నరేందర్ రెడ్డి తోపాటు కాటిపల్లి రాహుల్ కుమార్ రెడ్డి ఉన్నారు.

# గుండల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో "షీ" టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

- అవగాహన కల్పించిన "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు
- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు








**దోమ మండలం, మార్చి,06(సమయం న్యూస్) :** శుక్రవారం దోమ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇన్‌చార్జ్ నర్సిములు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు అలాగే ఉపాధ్యాయులకు మహిళలపై జరిగే నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం గురించి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే డయల్ 100, "షీ" టీమ్ హెల్ప్‌లైన్ 181, సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అలాగే బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా నివారణ, మద్యపాన నిషేధం, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, సైబర్ నేరాలపై (హెల్ప్‌లైన్ నం: 1930) తీసుకోవాల్సిన చర్యల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. మల్లారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు,"షీ" టీమ్ సభ్యులు సావిత్రి, శోభ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా జిల్లాకు ఫైజాన్ అహ్మద్ చేసిన సేవలు మరువలేనివి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

**నిర్మల్ మార్చి06( సమయం న్యూస్) :** జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా ఫైజాన్ అహ్మద్ చేసిన సేవలు మరువలేని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా పనిచేసి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు అదనపు కలెక్టర్ గా బదిలీపై వెళ్లిన ఫైజాన్ అహ్మద్ కు, గురువారం రాత్రి కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ఏ ఉద్యోగికి అయినా బదిలీ ప్రక్రియ సర్వసాధారణమని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా ఫైజాన్ అహ్మద్ అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ముఖ్యంగా స్థానిక సంస్థల బలోపేతానికి, పల్లె, పట్టణ ప్రగతి, ఎన్నికల నిర్వహణ, పలు విభాగాలకు నోడల్ అధికారిగా, నిర్మల్ మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా, ప్రభుత్వ పథకాల అమలు, తదితర కార్యక్రమాల అమలులో ఆయన విశేష కృషి చేశారని తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించే తత్వం ఆయన సొంతమని కలెక్టర్ ప్రశంసించారు. బదిలీపై వెళ్లిన జిల్లాలో కూడా అదే స్ఫూర్తితో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇన్ చార్జి మాతా శిశు సంక్షేమ శాఖ అధికారిగా, శాఖకు మంచి సేవలు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**నిర్మల్ జిల్లాలో పని చేయడం సంతృప్తినిచ్చింది:-ఫైజాన్ అహ్మద్.**

ఈ కార్యక్రమంలో భాగంగా బదిలీపై వెళ్లిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ,నిర్మల్ జిల్లాలో పనిచేయడం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని, జిల్లా అభివృద్ధిలో భాగస్వామిని కావడం సంతోషంగా ఉందని తెలిపారు. విధుల నిర్వహణలో తనకు పూర్తి సహకారం అందించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు, సిబ్బందికి అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది మాట్లాడుతూ, ఉద్యోగ నిర్వహణలో అదనపు కలెక్టర్ అందించిన ప్రోత్సాహకం, ఆయనతో ఉన్న అనుబంధం గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, పలువురు అధికారులు బదిలీపై వెళ్లిన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ దంపతులను పూలమాల, శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డిఓ రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయవంతం చేయాలి

- మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం, మార్చి 6:( సమయం న్యూస్ ) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా కలిసి విజయవంతం చేయాలని మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, జారే ఆది నారాయణ, మాలోతు రాందాస్ నాయక్, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. 99 రోజుల కార్యాక్రమంలో చేపట్టే కార్యాచరణను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఖమ్మం జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు 99 రోజుల కార్యాచరణను ప్రణాళిక ప్రకారం అమలు చేయాలన్నారు. ఆర్థిక స్థితిగతులు సహకరించక పోయినా పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు ప్రజల గడపకు చేరేలా అధికారులు కృషి చేయాలని అన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలని అన్నారు. రైతులు పండించే పంటకు బోనస్ అందించి వారిలో విశ్వాసం కల్పించడమే కాకుండా పేదలకు నాణ్యమైన సన్న బియ్యం రేషన్ ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్నదని అన్నారు. గతంలో మధ్యవర్తులు లబ్దిదారుల పేరిట మీద ఇండ్లు మంజూరు చేయించుకొని డబ్బులు వసూలు చేసుకున్నారని, నేడు అటువంటి లబ్దిదారులకు ఇండ్లు లభించకపోవడం వల్ల చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో మంజూరు చేసే ఇందిరమ్మ ఇండ్లలో పేదల పట్ల అధికారులు మానవతా దృక్పథంతో పని చేయాలని అన్నారు. క్రీడలలో భవిష్యత్తు ఉంటుందనే భావన యువతకు వచ్చేలా అవసరమైన ఇన్ ఫ్రా అభివృద్ధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గచ్చిబౌలిలో హాకీ క్రీడలు ప్రపంచ స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. క్రీడలలో గాయపడిన క్రీడాకారులకు మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రతి వారం అందించే చికెన్ స్థానంలో చేపలు పెట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కోతులు, కుక్కల సమస్య పరిష్కారం కోసం వాటి సంతానోత్పత్తి నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పని తీరు ఆధారంగానే ప్రజలలో ప్రభుత్వం పట్ల స్పందన ఉంటుందని మంత్రి తెలిపారు. 99 రోజుల కార్యాచరణ సంవత్సరం మొత్తం కొనసాగించాలని ఆయన తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సంయుక్తంగా ప్రజలకు సేవలు అందించాలన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పేదలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటు భవిష్యత్తు ప్రణాళిక సిద్ధం చేసుకునే ఉద్దేశ్యంతో ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణ ప్రోగ్రాం చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమం ప్రతి గ్రామం, పట్టణానికి చేరువ చేసేందుకు అనుసరించాల్సిన విధానంపై చర్చించేందుకు ఉమ్మడి జిల్లా స్థాయిలో సన్నాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10 సెక్టార్ లకు సంబంధించి రూపొందించిన ప్రణాళిక క్షేత్ర స్థాయిలో కట్టుదిట్టంగా అమలు అయ్యేలా చూడాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టల్స్ కు తహసిల్దార్ క్యాడర్ కు తగ్గకుండా ఒక అధికారిని ఇంచార్జి గా నియమించాలని, వీరు ప్రతి వారానికి ఒకసారి వెళ్లి అక్కడ భోజనం నాణ్యత పరిశీలించాలని, అక్కడ ఏదైనా తప్పు జరిగితే సంబంధిత అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. గ్రౌండింగ్ కాని ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఆసక్తి లేని పక్షంలో అదే గ్రామంలో మరో లబ్ధిదారునికి కేటాయించాలని మంత్రి తెలిపారు. మార్చి చివరి వరకు మొదటి విడత మంజూరు చేసిన ప్రతి ఇల్లు గ్రౌండ్ కావాలని అన్నారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా హెల్త్ సెక్టార్ పని తీరు మెరుగ్గా ఉండాలని, ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అందుబాటులో ఉన్న యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించేందుకు అవసరమైన స్టాఫ్ అందుబాటులో ఉండేలా చూడాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యత ఆధారంగా ఈ కార్యక్రమం అమలుకు నిధులు కేటాయిస్తుందని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా డ్రైయిన్ వల్ల ఇబ్బందులు ఎక్కడ ఉంటున్నాయో పరిశీలించి అక్కడ అవసరమైన మరమ్మత్తు పనులు చేపట్టాలని మంత్రి తెలిపారు. మార్చి 12న ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించాలని అన్నారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య ఉన్న భూ సమస్యలు జాయింట్ సర్వే ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. గ్రామ పంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు వస్తున్నాయని, వీటిని సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, ఆ నిధుల వినియోగం ఎలా జరుగుతుందో నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. ఎకో పార్కుల అభివృద్ధి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలతో పాటు వ్యవసాయ రంగంలో చాలా అంశాల పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పంట మార్పిడి, ఎరువుల, రసాయనాల వినియోగం తగ్గించడం, ఆధునిక సాగు పద్ధతులు వంటి అంశాలను ప్రచారం కల్పించాలని అన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలిమార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ, ముఖ్యమంత్రి సూచనల మేరకు ఉమ్మడి జిల్లాలో సన్నాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2నగ్రామ స్థాయి, ఏప్రిల్ 16 న మండల స్థాయి, మే 2న నియోజకవర్గ స్థాయిలో, మే 22న జిల్లా స్థాయిలో, జూన్ 2న రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. 10 ప్రత్యేక అంశాలతో 99 రోజుల కార్యాచరణ చేపట్టడం జరిగిందని అన్నారు. మార్చి 6 నుంచి మార్చి 15 వరకు పారిశుధ్య నిర్వహణ, ఫైల్స్ క్లియరెన్స్, ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 11 వరకు వైద్య శాఖ, ఏప్రిల్ 13 నుంచి ఏప్రిల్ 18 వరకు ఎరైవ్ ఎలైవ్ పేరిట రోడ్ సేఫ్టీ కార్యక్రమం, ఏప్రిల్ 20 నుంచి ఏప్రిల్ 26 వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమం, హౌసింగ్, ఏప్రిల్ 27 నుంచి మే 2 వరకు చైల్డ్ సేఫ్టీ, డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాలు, మే 4 నుంచి మే 10 వరకు వ్యవసాయ శాఖ, మే 11 నుంచి 16 వరకు విద్యాశాఖ, మే 18 నుంచి 23 వరకు యువజన క్రీడా శాఖ, మే 25 నుంచి 30 వరకు మహిళ సంక్షేమం, జూన్ 1 నుంచి 12 వరకు పర్యావరణ ప్రాధాన్యతగా కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. వార్డ్ మెంబర్ నుంచి సర్పంచ్, మున్సిపల్ చైర్ పర్సన్ వరకు ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేస్తూ క్షేత్ర స్థాయిలో పర్యటించి ఎక్కడ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలో ప్రణాళిక సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం పరిధిలో ప్రజలకు అందించే వివిధ సేవలకు సంబంధించి పెండింగ్ ఫైల్స్ 10 రోజులలో క్లియర్ చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. మార్చి 7 నుండి ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్వాడి స్కూల్స్, బస్టాండ్, ప్రభుత్వ పాఠశాలల వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాలుపడుతున్నట్లు తెలిపారు. గ్రామం, పట్టణాల్లో ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ శుభ్రం చేసుకోవాలని, హోటల్స్, ఫంక్షన్ హాల్స్ వద్ద అధికంగా చెత్త ఏర్పడుతుందని, అక్కడ వాటిని డిస్పోజ్ చేసేందుకు ప్రత్యేక చర్యలు ప్రారంభిస్తామని అన్నారు. మార్చి 14న వీధి కుక్కల బెడద తొలగించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. నూతనంగా ఎన్నిక కాబడిన సర్పంచ్, కౌన్సిలర్ లకు మార్చి 12న అవగాహన నిర్వహిస్తామని కలెక్టర్ అన్నారు. వైద్య శాఖ పరిధిలో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల పై వీధి వ్యాపారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో న్యూట్రిషన్ పై అవగాహన కల్పిస్తామని అన్నారు. ఏప్రిల్ 7న వరల్డ్ హెల్త్ డే రోజు వైద్య శాఖలో బాగా పనిచేసే వైద్యులు, సిబ్బందికి అవార్డుల ప్రదానం ఉంటుందన్నారు. ఎయిడ్స్ హెచ్.ఐ.వి. నివారణ చర్యలు, మాతృ శిశు సంరక్షణ, హోమియోపతి, ఆయుష్, నకిలీ మందుల నివారణ దిశగా కార్యాచరణ ఉంటుందని అన్నారు. ఎరైవ్ ఎలైవ్ కార్యక్రమం ద్వారా పోలీస్, రవాణా శాఖ అధికారుల ద్వారా రోడ్ సేఫ్టీ పై వివిధ కార్యక్రమాలు ఉంటాయన్నారు. గత 3 సంవత్సరాల డేటా పరిశీలించిజిల్లాలో 50 శాతంకు పైగా ప్రమాదాలు జరిగే 30 జంక్షన్ లనుగుర్తించి ప్రమాదాల నియంత్రణకు అవసరమైన జాగ్రత్తలు అక్కడ చేపట్టామని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో 10 వేల ఇందిరమ్మ ఇండ్లు 99 రోజుల కార్యాచరణలో భాగంగా పూర్తి చేసీ గృహప్రవేశం చేసేలా కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. చైల్డ్ సేఫ్టీ కార్యక్రమం ఏప్రిల్ 27 నుంచి మే 2 వరకు ఉంటుందని, ఇందులో అనాథ పిల్లలకు స్పోర్ట్స్ కిట్ పంపిణీ, సైబర్ నేరాలు, గ్యాంబ్లింగ్, లోన్ యాప్ వేధింపులపై దృష్టి సారిస్తామని, బాల కార్మికుల నిర్మూలన, పిల్లలకు అవసరమైన వైద్య చికిత్స, పిల్లల దత్తత సక్రమంగా జరిగేలా అవగాహన ఉంటుందని అన్నారు. వ్యవసాయ శాఖ పరిధిలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరాలు ప్రచారం చేయడం, యూరియా యాప్ బుకింగ్ పై అవగాహన కల్పన ఉంటుందన్నారు. విద్యా శాఖ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు శుభ్రంగా ఉండేందుకు పాత సామాగ్రి, పాత కంప్యూటర్ ల తొలగింపు కార్యాచరణ చేపట్టామని అన్నారు. పర్యావరణ ప్రాధాన్యత సందర్భంగా పార్కుల అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ పచ్చదనం పెంపు చర్యలు, ప్లాస్టిక్ నియంత్రణకు మెగా డ్రైవ్ నిర్వహణ చేపడుతున్నామని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూలి పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రత్యేక అధికారులను ప్రతి మండలానికి నియమించినట్లు తెలిపారు. 30 రోజుల కంటే ఎక్కువ పెండింగ్ ఉన్న ఫైల్స్ 10 రోజులలో క్లియర్ చేయాలన్నారు. వ్యవసాయ శాఖలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రచారం, రైతు నేస్తం ద్వారా శాస్త్రవేత్తలతో నేరుగా రైతులు సంప్రదించి ఆధునిక సాగు పద్ధతులు నేర్చుకోవడం, యూరియా బుకింగ్ యాప్ లో సమస్యల తొలగింపు వంటి అంశాల లపై దృష్టి సారించామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూగ్రామ పంచాయతీ, మున్సిపల్ పాలక వర్గాలను భాగస్వామ్యం చేస్తూ 99 రోజుల కార్యాచరణ అమలు చేయాలన్నారు. గ్రామాలలో ఉన్న కోతుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫుడ్ సేఫ్టీ పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, ఆధునిక సాగు పద్ధతులు, క్లస్టర్ వారిగా వివిధ పంటల సాగు, పంట మార్పిడి వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరగాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నీటి సరఫరాతో కూడిన టాయిలెట్స్ నిర్మించాలన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబ శివరావు మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం ఇంటి క్రింద 20 వేలు మంజూరు చేసిన లబ్దిదారులకు నేడు ఇందిరమ్మ ఇండ్లు తిరస్కరిస్తున్నారని తెలిపారు. అర్హులకు రద్దు చేసిన ఇండ్లు కేటాయించాలని, జిల్లాలో మరో విడత ఇందిరమ్మ ఇండ్లను కేటాయించే సమయంలో అర్హులు అధికంగా ఉన్న పక్షంలో లాటరీ పద్ధతి అనుసరించా లని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్ది దశ నుంచి క్రీడలు భాగస్వామ్యం చేయాలని, పాఠశాల కరికులంలో క్రీడలు ఒక పార్ట్ గా మారాలని ఆయన సూచించారు. జిల్లాలో నిర్మించే డ్రైయిన్స్ అలైన్మెంట్ సరిగ్గా లేకపోవడం వల్ల కొత్త సమస్యలు వస్తున్నాయని, దీనిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆది నారాయణ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండే అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, భద్రాచలం ఐటిడిఎ పీవో బి. రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డిఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, వివిధ శాఖల ఉమ్మడి జిల్లా అధికారులు, మునిసిపల్ చైర్ పర్సన్లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధులు, అధికారులందరి సమన్వయం

- సహకారంతో ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక ,99 రోజుల కార్యచరణ ప్రణాళికను విజయవంతం చేయాలని
- స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణిందర్ రెడ్డి కోరారు.







**మహబూబ్ నగర్,మార్చి,06(సమయం న్యూస్( :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చి 6 నుండి 31 వరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఒకరోజు ఆరు రకాల ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు గాను నిపుణులైన డాక్టర్స్ ను పిలిపించడం జరిగిందని, ముఖ్యంగా డెంటల్, ఓబీజీ, ఆర్థో ,ఆప్తమాలజీ, పీడియాట్రిషన్ డాక్టర్ల చేత వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా, మందులు, తదుపరి వైద్య సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. రోగులు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ప్రత్యేకంగా ఒక ఐడి నెంబర్ ఇవ్వడం జరుగుతుందని, దాని ఆధారంగా వైద్య సేవలు అందించ డంతోపాటు, భవిష్యత్తులో కూడా వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు . స్పెషలిస్ట్ డాక్టర్లు ప్రతిరోజు రెండు, మూడు పీహెచ్సీలను కవర్ చేస్తూ ఇలా అన్నిపీ హెచ్ సిలను కవర్ చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం నుండి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టడం జరుగుతున్నదని, అంతేకాక ఫైళ్ల పరిష్కారం కూడా చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు అందరి సమన్వయంతో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి/ఉమ్మడి పాలమూరు జిల్లా ఇంచార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో జరిగిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్నారు. నారాయణ పేట జిల్లా లో శుక్రవారం నుంచి 99 రోజుల పాటు 10 థీమ్స్ పై చేపట్టే కార్యక్రమాల గురించి మంత్రికి అదనపు కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రామచందర్ నాయక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, డిఆర్డిఓ మొగులప్ప, డిపివో సుధాకర్ రెడ్డి, డిఇఓ గోవిందరాజులు, డీ ఏ వో జాన్ సుధాకర్, సివిల్ సప్లై అధికారులు బాల్ రాజ్, సైదులు, హౌసింగ్ పీడీ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# "డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం 2కె రన్" కార్యక్రమం

- పాల్గొన్న జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS.
- "ప్రజా పాలన—ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం"
- 5వ థీమ్ అయిన "పిల్లల భద్రత —డ్రగ్స్ కు అడ్డుకట్ట"
- కొడంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ స్థాయిలో 2క నిర్వహణ
- ఈగల్ టీం డైరెక్టర్ సందీప్ శ్యాండిల్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించిన -జిల్లా ఎస్పీ



**కొడంగల్ మున్సిపల్, మార్చి,06(సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం"లో భాగంగా, 5వ థీమ్ అయిన "పిల్లల భద్రత – – డ్రగ్స్ కు అడ్డుకట్ట" అంశంపై కొడంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ స్థాయిలో 2ఖ రన్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఈగల్ టీం డైరెక్టర్ సందీప్ శ్యాండిల్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ Say No to Drugs, Drug Free Telangana అనే నినాదాలతో యువత ముందుకు సాగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సిన నేటి విద్యార్థులే రేపటి భారత పౌరులని, వారిని మాదకద్రవ్యాల మహమ్మారి నుండి కాపాడుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, యువత తమ శక్తిని క్రీడలు, విద్య మరియు ఇతర నిర్మాణాత్మక కార్యక్రమాల వైపు మళ్లించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ టీం విభాగాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఎక్కడైనా డ్రగ్స్ సరఫరా లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే భయపడకుండా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. డ్రగ్స్ వ్యాపారంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని, యువత భవిష్యత్తును కాపాడటమే పోలీస్ శాఖ, ఈగల్ టీమ్ ల ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. మహిళలు విద్య, ఉద్యోగం, క్రీడలు మరియు ఇతర రంగాల్లో రాణించి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ అవగాహన కార్యక్రమం కేవలం కొడంగల్‌కే పరిమితం కాకుండా, వికారాబాద్ జిల్లాలోని 20 పోలీస్ స్టేషన్ల పరిధిలోని 76 గ్రామాలలో విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో అవగాహన ర్యాలీలు, సమావేశాలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతలో డ్రగ్స్ పై చైతన్యం తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. డ్రగ్స్ నియంత్రణలో పోలీస్ -- ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం శ్రద్ధ వహించాలని, విద్యాసంస్థలు కూడా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని జిల్లా ఎస్పీ సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ నడుం బిగించి "డ్రగ్స్ రహిత తెలంగాణ" లక్ష్యంగా కలిసి పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీం అదనపు ఎస్పీ కృష్ణ మూర్తి, జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ వీరేష్, కొడంగల్ తహేసిల్దార్ రాంబాబు, ఎంపీడీఓ ఉషశ్రీ ,ఎంఈఓ రాంరెడ్డి , మునిసిపల్ ఛైర్మన్ నందారం ప్రశాంత్,మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఈగల్ టీం సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువజన సంఘాలు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 536మంది విద్యార్థులు గైర్ హాజరు. ఒకరి పై మాల్ ప్రాక్టీస్ కేసు

## పరీక్షలు ప్రశాంతం

గురువారం మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షల్లో జిల్లాలో ఒక విద్యార్థి కాపీయింగ్ చేస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యా అధికారి శ్రీ తిరుమలపుడి రవికుమార్ తెలియజేశారు. మొదటి సంవత్సరం మ్యాథ్స్-1బి, జూవాలోజి, హిస్టరీ , ఒకేషనల్ పరీక్షలు ప్రశాంతంగా జరగగా 97శాతం విద్యార్థులు హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యా అధికారి శ్రీ రవికుమార్ తెలియజేశారు. కాగా డిచిపల్లి మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ఒక విద్యార్థి పై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మొత్తం 536 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజర్ అయ్యారని తెలియజేశారు. మొత్తం 17,637 మంది విద్యార్థులకు గాను17,101 మంది హాజరయ్యారని తెలియజేశారు. జనరల్ లో మొత్తం 14,825మంది విద్యార్థులకు గాను 14,458 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఒకేషనల్ లో 2,812 మంది విద్యార్థులకు గాను 2,643 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలియజేశారు. జిల్లాలో మొత్తం 58 పరీక్షా కేంద్రాలకు గాను 57 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి శ్రీ తిరుమలపుడి రవికుమార్ తెలియజేశారు. ఈరోజు జిల్లా ఇంటర్ విద్య అధికారి 3 పరీక్ష కేంద్రాలు,పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు19, హై పవర్ కమిటీ 6, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లు మొత్తం 29 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పర్యవేక్షించారని తెలియజేశారు.

# విద్యుత్ చార్జీలు తగ్గించుకోవాలి

## - జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ మార్చి06( సమయం న్యూస్) :** గురువారం కలెక్టర్ కార్యాలయంలో పి ,యం సూర్యఘర్ ప్రచార వాహనాన్ని జెండా ఊపి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రధానమంత్రి సూర్య గార్ పథకం ద్వారా గృహాలపై సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకొని విద్యుత్ ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. ఈ వాహనం మెదక్ జిల్లాలోని వివిధ మండలాలు,గ్రామాలు పర్యటించి పథకం గురించి అవగాహన కల్పించి పథకం యొక్క ప్రయోజనాలను ఎలా పెంపొందించాలో మార్గనిర్దేశనం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**దుబ్బాక మార్చి06( సమయం న్యూస్) :** దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మీ ఆసుపత్రిలో పాత పెండింగ్ ఫైల్స్ క్లియర్ చెయ్యాలని మునుపటికి క్లియర్ చేశాక ఫోటోగ్రఫీ తీసుకుని డాక్యుమెంట్ చెయ్యాలని, 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో రోజు ఏఏ కార్యక్రమాల నిర్వహణ గూర్చి ప్రజలకు తెలిసేలా బయట ఒక బ్యానర్ పెట్టుకోవాలని మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. అటెండెన్స్ రిజిస్టర్ ఓపి రిజిస్టర్ వెరిఫై చేశారు. ఆసుపత్రి సిబ్బంది సమయ వేళలు పాటిస్తున్నారా ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు

# తారా కళాశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమ ప్రారంభోత్సవం





**సంగారెడ్డి, మార్చి 06( సమయం న్యూస్). :** తార ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న "ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక" ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ప్రవీణ తెలిపినారు.ప్రత్యేకంగా విద్యాశాఖ అభివృద్ధికై ప్రజా పాలన ప్రగతి పాలన కార్యక్రమములో భాగంగా 10 రోజుల అభివృద్ధి ప్రణాళిక ను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, ఈ పది రోజుల్లో చేపట్టి చేపట్టవలసిన అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తామని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. మొదటి రోజైన శుక్రవారం కార్యక్రమంలో భాగంగా అధ్యాపక బృందము, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్సీసీ క్యారెట్లు, విద్యార్థిని విద్యార్థులు కళాశాల పరిసర ప్రాంతాలను శుభ్రం చేయడం జరిగిందని, కళాశాలలో వృధాగా పేరుకుని పోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని తొలగించడం జరిగిందని, దీనివల్ల పర్యావరణ పరిశుభ్రత ఏర్పడి పర్యావరణంలో సమతుల్యత ఏర్పడడానికి అవకాశం ఉంటుందని తెలిపినారు .ఈ పది రోజులలో నిర్వహించవలసిన కార్యక్రమ ప్రణాళికను తయారు చేసుకోవడం జరిగిందని తెలిపినారు. ఈ పది రోజుల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా కళాశాలలో అన్ని రకాలైన రికార్డులను తయారు చేయడము, సైన్స్ విభాగాల లేబరేటరీ సదుపాయాలను మెరుగుపరచడం, కళాశాలలో వివిధ విభాగాలలో చేయవలసిన రిపేర్లను చేయించడం జరుగుతుందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందము ఎన్ఎస్ఎస్ అధికారులు ఎన్సిసి అధికారి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# తార కళాశాలలో ముగిసిన రెండు రోజుల జాతీయ సదస్సు

**సంగారెడ్డిమార్చి06( సమయం న్యూస్,) :** తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో కంప్యూటర్ సైన్స్ విభాగము మరియు జీవశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ద ఫ్యూచర్ ఆఫ్ లైఫ్ సైన్స్ ఇంటెగ్రేటింగ్ కాంపిటేషనల్ ఇంటెలిజెన్స్ అండ్ బయోలాజికల్ రీసెర్చ్ అనే అంశముపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపినారు.

తారా కళాశాల లో రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సులో దేశములోని వివిధ విశ్వవిద్యాలయాలు మరియు రాష్ట్రములోని వివిధ విశ్వవిద్యాలయాలు నుండి వచ్చిన అధ్యాపకులు మరియు పరిశోధకులు పై అంశముపై తమ పరిశోధనా పత్రాలను జాతీయ సదస్సులో సమర్పించడం జరిగిందని త్వరలో ఈ పరిశోధనా పత్రాలకు సంబంధించి ఐఎస్బిఎన్ నంబర్తో ప్రత్యేక మ్యాగజిన్ ను విడుదల చేస్తామని తెలిపినారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ బాల భాస్కర్ మరియు ప్రొఫెసర్ రాజేందర్ సింగ్ గారి ఉపన్యాసాలు మరియు కాంపిటేషనల్ బయాలజీ ఎడిటింగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సైన్స్ బయో రీ మెడిటేషన్ వంటి అంశాలపై ప్రత్యేక చర్చలను నిర్వహించడం జరిగిందని ప్రధానంగా జీవశాస్త్ర పరిశోధనలో కాంపిటేషన్ల పద్ధతుల ప్రాముఖ్యతను జీవశాస్త్రంపై వాటి ప్రభావాలను తెలియజేయడం జరిగిందని పేర్కొన్నారు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కన్వీనర్ డాక్టర్ నాగప్రసాద్, కో కన్వీనర్ డాక్టర్ వై. రమేష్ బాబు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ మిథున్ కుమార్ రాథోడ్, కళాశాల అధ్యాపక బృందము , ఎమ్మెస్సీ జువాలజీ మరియు కంప్యూటర్ సైన్స్ విద్యార్థిని విద్యార్థులు, ఎన్సిసి క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.

# పైఅధికారులకు మొరపెట్టుకుంటే గాని కదలని స్థానిక HMWS అధికారులు.



**హైదరాబాద్, మార్చి 06సమయం న్యూస్ :** పటాన్చెరు పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో డ్రైనేజీ ఉప్పొంగి రోడ్డుపైకి మరియు ఇంటిలోకి ప్రవహిస్తున్న సమస్యపై స్థానికులు చేసిన ఫిర్యాదుతో వీణ= ఫౌండేషన్ ట్విట్టర్ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై స్పందించిన అధికారులు వెంటనే సిబ్బందిని పంపించి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. అయితే ఈ సమస్య తరచూ వస్తోందని స్థానికులు వాపోతున్నారు. గతంలో డ్రైనేజీ లెవెల్స్ పరిశీలించకుండా పనులు చేయడం,కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. సమస్యను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎండిఆర్ ఫౌండేషన్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుండేది ఎం డి ఆర్ ఫౌండేషన్ అని స్థానికులు అభినందించారు.



# కీర్తిశేషులు మాజీ సర్పంచ్ పేరి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం

- యాలాల మండల కేంద్రంలో చలి వేంద్ర కేంద్రం ప్రారంభం
- ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు

**యాలాల మండలం, మార్చి,06(సమయం న్యూస్) :** యాలాల మండల్ కేద్రం లోచావడి దగ్గరా కీర్తిశేషులు మాజీ సర్పంచ్ పేరి నారాయణరెడ్డి జ్ఞాపకర్థంగా యాలాల్ మండల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చలి వేంద్ర కేద్రాని ప్రారంభించిన ముఖ్య అతిథిగా పాల్గొన్న తాండూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ పట్లోల నర్సిములు గ్రామ సర్పంచ్ సీ. హెచ్ శివయ్య,ఉప సర్పంచ్ మల్కిరెడ్డి శోభారాజు రెడ్డి, వికారాబాద్ జిల్లా మాజీ కో-ఆప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబ,ఎఎంసి డైరెక్టర్ గోనెగరి శ్రీనివాస్, ఎఎంసి డైరెక్ట్ రాజు వార్డ్ నెంబర్లు.గడ్డం బస్వరాజ్ గౌడ్,శేఖర్, నర్సమ్మ, ఉమేష్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి,మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యూ. బుగ్గప్ప,గ్రామ కమిటీ అధ్యక్షులు రాపోల్ నాగయ్య,కార్యదర్శి హైమద్, సహాయ కార్య దర్శి గొల్ల చందు, గ్రామాకమిటి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ నాయి, పావని,మైను, బుర్ల పూరి నర్సిములు,సంకారం లాలు, గడ్డం సత్యప్ప గౌడ్,సంజప్ప,పోస లాలు,ఉప్పలి నర్సిములు, మ్యాదరి వేణు,మౌలానా, రజాక్, పేరి మధు,కార్తీక్, మ్యాదరి బాలు,ప్యాక్,పట్టా లాలు, దూస వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# నేడు దౌల్తాబాద్ మండల కేంద్రంలోని PHC లో మెగా హెల్త్ క్యాంప్

- డాక్టర్.. అమూల్య ప్రియదర్శిన PHC దౌల్తాబాద్



**దౌల్తాబాద్ మండలం, మార్చి,06(సమయం న్యూస్ :** వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ PHC ఆవరణలో నేడు మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు పి హెచ్ సీ వైద్యాధికారినీ డాక్టర్ అమూల్య ప్రియదర్శిని తెలిపారు. ఇట్టి క్యాంప్ లో గైనకాల జిస్ట్(స్త్రీ వైద్యనిపుణులు) ఆర్థోపెడిక్(ఎముకల వైద్యులు) జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్(చిన్న పిల్లల వైద్యులు) ఆప్తమాలజీ(కంటి వైద్యులు) మరియు డెంటల్ (పంటి వైద్యులు) వస్తున్నారు కావున దౌల్తాబాద్ మండల ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పి హెచ్ సీ వైద్యాధికారి డాక్టర్ అమూల్య ప్రియదర్శిని తెలిపారు.

# నేడు రఘునాథ పాలెం లో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు



● భూక్యా ఉపేంద్ర బాయి

**ఖమ్మం, మార్చి 6:( సమయం న్యూస్ ) :** రాజ్యాంగం, బహుజన మహిళలు, రిజర్వేషన్లు, సాధికారత, బీసీ మహిళా కోటా అంశంపై వీరనారీ మణుల ఆశయ సాధన సమితీ ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు రఘునాథ పాలెం లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్ర బాయి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రఘునాథ పాలెం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపం లో గల సేవాలాల్ మహరాజ్ ఆలయ ప్రాంగణంలో ఈ నెల 7న మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూఈ వేడుకల్లో పాల్గొనిమహిళా దినోత్సవం ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభిస్తున్న ఆత్మ పోస్ట్ బడ్జెట్ విడుదల

● ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏడీఏ శంకర్ రాథోడ్



**కొడంగల్ మండలం, మార్చి,06(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం పర్సాపూర్ రైతు వేదికలో కొడంగల్ డివిజన్ లోని మండల వ్యవసాయ అధికారులు మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు ఆత్మ స్టాఫ్, అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్, బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ అందరూ కలిసి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభిస్తున్న ఆత్మ పోస్ట్ బడ్జెట్ విడుదల ప్రోగ్రామ్ కి హాజరై ప్రోగ్రాంను వీక్షించడం జరిగింది. ఈ ప్రోగ్రాం కి కొడంగల్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శంకర్ రాథోడ్ (ఏడీఏ) ముఖ్య అతిథిగా అటెండ్ అవ్వడం జరిగింది. అదేవిధంగా పర్సాపూర్ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మరియు గ్రామ రైతులు ఈ యొక్క వెబినార్ కార్యక్రమాన్ని వీక్షించడం జరిగింది.

# హాసన్ పర్తిలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు విద్యార్థులు మృతి



హాసన్ పర్తిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పెద్ద చెరువు సమీపంలో ఎస్సార్ కాలేజ్ విద్యార్థులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ లారీ ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో మృతులు సుప్రతిక, అక్రమ్ గా గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్థానిక పోలీసులకు ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, మార్చి,06(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి,ఉమ్మడి రంగారెడ్డి ఐ డి ఓ సి కి చేరుకున్న రాష్ట్ర ఐ టి శాఖ మంత్రి వర్యులు శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబుని మర్యాద పూర్వకంగా కలిశారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**రాయపోల్,మార్చి 06:** దౌల్తాబాద్ మండలం శేరిపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు విద్యను బోధించారు. డీఈవోగా అయాజ్, మండల విద్యాధికారిగా వర్షిత, ప్రధానోపాధ్యాయురాలుగా మనస్విని తోపాటు పలువురు విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు స్వయం పరిపాలనతో తమ బాధ్యతలను తెలుసుకుంటారని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బోధన అంశంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అమల, హర్షిణి, తదితరులు పాల్గొన్నారు....

# శంకర్‌పల్లిలో ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ (సిడిఎంఎ) డా. టికే శ్రీదేవి

● మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్



**చేవెళ్ల: మార్చి 06: (సమయం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని శంకర్‌పల్లి మున్సిపాల్టీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రెటరీ (సిడిఎంఎ) డా. టికే శ్రీదేవి, మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ఈ కార్యక్రమం మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ఉంటుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విద్య, వైద్యం, సంక్షేమం, వ్యవసాయం, క్రీడలు, యువత, నైపుణ్యాలు వంటి అంశాలపై విడతల వారీగా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. మార్చి 6 నుంచి 15వ తేదీ వరకు పరిసరాల శుభ్రత, పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్ పరిష్కారంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నామని తెలియజే శారు. రోడ్లపై చెత్త వేయరాదని, తడి చెత్త పొడి చెత్త వేరు చేయాలని, ప్లాస్టిక్ ను నిర్మూలించాలని సూచించారు. పారిశుద్ధ్యం విషయంలో శంకర్‌పల్లి పట్టణం జాతీయ స్థాయిలో అవార్డు పొందాలని ప్రజలకు సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ కే. ఫల్గుణ్ కుమార్, వైస్ చైర్ పర్సన్ జూలకంటి శ్వేత పాండురంగ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు దండు రాజేశ్వర్, అశోక్, ఉషాకిరణ్ విజయ్ కుమార్, ఆనంద్ రావు, గణేష్, గిరిజ చంద్రశేఖర్, కమిషనర్ యోగేష్, మేనేజర్ అంజన్ కుమార్, డిఈ యాదయ్య, ఏఈ నరేష్, మెప్మా ఆర్పీలు, పారిశుద్ధ, మున్సిపల్, రెవెన్యూ, ఇతర లైన్ డిపార్ట్మెంట్ల సిబ్బంది ఉన్నారు.

# మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలి

● జిల్లా ఎస్పీ డాక్టర్. వినీత్ IPS
● మహిళ సాధికారతకు విద్యే మూలం.
● మహిళలకు కుట్టు మిషన్లు,సర్టిఫికెట్లు పంపిణీ



**నారాయణపేట, మార్చి,06(సమయం న్యూస్) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణపేట జిల్లా కేంద్రంలోని శిల గార్డెన్‌లో (ఆపరేషన్ మెస్సి ఇండియా ఫౌండేషన్) ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ గారు హాజరై మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు మరియు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోగిని వ్యవస్థ నుండి బయటపడిన మహిళలు, వారి పిల్లలు, బీద మరియు మధ్యతరగతి మహిళలు, ఒంటరి మహిళలు, తల్లిదండ్రులు లేని విద్యార్థులు వారికి స్వయం ఉపాధి పొందడం కోసం సహాయంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 సెంటర్లలో కుట్టు మిషన్ మరియు బ్యూటీ పార్లర్ ట్రైనింగ్ పొందిన సుమారు 300 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయగా, 30 మంది ఒకేషనల్ కోర్స్ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అదేవిధంగా సంస్థలో పనిచేస్తున్న మహిళల్లో కొందరు గతంలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచులు, వార్డ్ మెంబర్లుగా ఎన్నికై విజయం సాధించిన వారికి ఎస్పీ ప్రత్యేకంగా శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ... మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని తెలిపారు. ప్రపంచంలో పురుషులు ఎంతమంది ఉన్నారో దాదాపు అంతే సంఖ్యలో మహిళలు ఉన్నారని, అందరికీ సమాన హక్కులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఎదగాలని సూచించారు. మహిళలు ఉన్నతంగా ఎదగాలంటే చదువు అత్యంత ముఖ్యమని, ప్రతి మహిళ చదువుకుంటే వారి కుటుంబం మాత్రమే కాకుండా తరతరాల భవిష్యత్తు కూడా మెరుగుపడుతుందని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెప్పినట్లుగా ప్రతి ఇంట్లో ఒక మహిళ చదువుకుంటే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి గ్రామాల అభివృద్ధితోనే సాధ్యమని, గ్రామాల్లోని కుటుంబాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ లక్ష్మి పతి గౌడ్, అడిషనల్ పిపి సురేష్, ావీ×ఖీ స్టేట్ డైరెక్టర్ డా. బెరిల్ డిసౌజా, ప్రాజెక్టు మేనేజర్ ఏంజెలా దేవిస్, జిల్లా కోఆర్డినేటర్ ఆజమ్మ, జోష్, సి డబ్ల్యూ సి చైర్మన్ అశోక్ శ్యామల, యాదయ్య, కమల, సఖి సెంటర్ సభ్యులు క్రాంతి, కవిత, కౌన్సిలర్ మహేష్, మహిళలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే విధంగా ప్రత్యేక చర్యలు

● తీసుకుంటామని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు.



**వికారాబాద్,మార్చి,06(సమయం న్యూస్) :** శుక్రవారం రంగారెడ్డి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన వివిధ శాఖల అధికారులకు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ పి.మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్లు నారాయణ రెడ్డి, మను చౌదరి, దీపక్ తివారి, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ లు వినయ్ కుమార్ రెడ్డి, సృజన ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించి ప్రధాన అంశాలపై చర్చించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు మంచి పేరు వస్తుందని ఆయన. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వ యంతో పని చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు జవాబుదారి తనంతో పని చేయాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి ఐటీ, పరిశ్రమల మరియు వాణిజ్య శాఖ మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 99 రోజుల పాటు చేపడుతున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో జవాబుదారీ తనంతో ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి తెలిపారు. 99 రోజుల పాటు చేపడుతున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ అందని వారిని గుర్తించి నిర్లక్షం వహించకుండా అమలు కాని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అధికారులకు సూచించారు. శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... 99 రోజుల పాటు చేపట్టే ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో 10 అంశాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకుప్రజల వద్దకే అధికారులు వస్తున్నారన్నారు. ఇప్పటికీ రేషన్ కార్డులు, ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇండ్లను కేటాయించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన తెలిపారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 6 హామీలను నెరవేర్చే దిశగా పని చేస్తామన్నారు. జిల్లాలోని 4 నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించడం జరిగిందని అన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా స్థాయిలో అధికారులను సమన్వయం చేసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన అన్నారు. అనంతగిరి ఈకో పార్క్ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. హౌసింగ్ ద్వారా ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి ఎప్పటికప్పుడు చెల్లింపులు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. గ్రామ పంచాయతీల్లో నీటి కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. జిల్లాలోని 106 గురుకుల పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా, మండల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నాణ్యమైన భోజనాన్ని అందించే దిశగా పనిచేస్తామని ఆయన తెలిపారు. ఈ అవగాహన సమావేశంలో శాసన సభ్యులు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, శంకరయ్య, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిలతో పాటు వివిధ శాఖల చైర్మన్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అవగాహనా కార్యక్రమం

● రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు.

**రాయపోల్, మార్చి 6:** రాయపోల్ మండలకేంద్రం రైతులు అధిక సంఖ్యలో పాల్గొని వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి నరేష్ సూచించారు. నేడు (మార్చి 7) రాయపోల్ రైతు వేదికలో రైతుల కోసం ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి శాస్త్రవేత్తలు హాజరై పంటల్లో వచ్చే చీడపీడలు, వ్యాధులు, వాటి నివారణ పద్ధతులపై రైతులకు వివరంగా అవగాహన కల్పించనున్నారని పేర్కొన్నారు. రైతులు తమ పంటలకు సంబంధించిన సమస్యలను శాస్త్రవేత్తలను నేరుగా అడిగి తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మండలంలోని రైతులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- 99 రోజుల కార్యాచరణతో ముందుకు సాగాలి.
- కార్యక్రమ 10 థీమ్స్ బాగున్నాయి.
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ.




**మహబూబ్ నగర్,మార్చి,06(సమయం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయ వంతం చేసేందుకు అధికారులు తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి/ఉమ్మడి పాలమూరు జిల్లా ఇంచార్జీ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న 99 రోజుల కార్యక్రమంలో సూచించిన 10 థీమ్స్ చాలా బాగున్నాయని మంత్రి కితాబునిచ్చారు. 99 రోజుల కార్యక్రమాన్ని ఒక ఛాలెంజ్ గా తీసుకోవాలనీ ఆయన సూచించారు.గ్రామ సభల్లో తాగునీటి సమస్య ను ప్రజలు ప్రస్తావించే అవకాశం ఉందని, తాగునీటి సమస్యను ముందస్తుగా పరిష్కరించేందుకు అధికారులు దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. మహబూబ్ నగర్ జిల్లా సమీకృత భవన సముదాయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు పై జిల్లా ఇంచార్జీ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ..మూడో విడత నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12 న జరిగే ప్రజా ప్రతినిధుల శిక్షణ చాలా ముఖ్యం అన్నారు.కమ్యూనికేషన్ గ్యాప్ ఉండొద్దని చెప్పారు.ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వం అని మంత్రి పేర్కొన్నారు.గ్రామ సభల్లో ఎక్కువ ఏ ఏ దరఖాస్తులు వస్తాయో అధికారులు అంచనా వేయాలన్నారు. ఈ రెండున్నర ప్రభుత్వ హయంలో గ్రామాల్లో ప్రభుత్వ పథకాల లబ్ధి పొందిన వారి వివరాలను గ్రామ సభల్లో వెల్లడించాలనీ ఆయన తెలిపారు. లబ్ధిదారుల జాబితా, నోడల్ అధికారుల జాబితా , దరఖాస్తుల వివరాలను అధికారులు మంత్రులు, ఎమ్మెల్యే లకు ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల్లో పెండింగ్ పనులు ఏం ఉన్నాయో కనీస సమాచారం ఉండాలన్నారు. పూర్తి సమాచారాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తాం అన్నారు.46 లక్షల మంది మహిళల కు హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు.మహిళల పాత్ర ఎంతో కీలకమని, ఏ రాష్ట్రంలో ఇవ్వని పథకాలు మన రాష్ట్రంలో ఇస్తున్నాం అని ఆయన తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఎక్కువ శాతం మహిళలను భాగస్వాములను చేయాలని మంత్రి ఆదేశించారు. ఆరోగ్య శాఖ తనదేనని, ఒక రోజంతా శాఖపై సమీక్ష చేస్తా అని ఆయన చెప్పారు.ఐదు జిల్లాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఒక్కో రోజు తాను పాల్గొంటానని మంత్రి స్పష్టం చేశారు.కార్యక్రమంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉన్నాయని, 99 రోజుల కార్యక్రమానికి అనుగుణంగా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని మంత్రి సూచించారు.ముఖ్యమంత్రి కూడా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని ఆయన తెలిపారు. 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో నోడల్ అధికారులు ముఖ్య భూమిక పోషించాలన్నారు. 15 రోజులకోసారి ఒక థీమ్ పై సమీక్ష చేస్తానని మంత్రి స్పష్టం చేశారు. అటవీ పోడు భూముల సమస్య పరిష్కారానికి రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, అటవీ భూముల సమస్య ఒక్క పాలమూరు జిల్లాలోనే కాదు రాష్ట్రమంతట నెలకొందని ఆయన తెలిపారు. ఆస్పత్రుల అభివృద్ధి కమిటీల సమావేశాలు నిర్వహించేలా చూస్తామన్నారు.సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నా రెడ్డి మాట్లాడుతూ.... ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజులు నిర్వహించనున్నట్లు ,మొదటి రోజు నుండి చివరి వరకు అదే ఉత్సాహంతో కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. 99 రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించటం ఇదే మొదటిసారి అనిజిల్లా కలెక్టర్ లు,అధికారులు చొరవ తీసుకొని కార్యక్రమం ను విజయవంతం చేయాలని అన్నారు.గ్రామ సభల్లో ప్రజలు దరఖాస్తులు సమర్పిస్తే నిరాకరించకుండా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం పెన్షన్ లపై త్వరలో నిర్ణయం తీసుకోనుందని తెలిపారు.రాష్ట్రంలో 46 లక్షల మంది మహిళల హెల్త్ ప్రొఫైల్ కార్యక్రమం చేపడుతున్నదని తెలిపారు,.మహిళలను,ప్రజలను భాగస్వామ్యులు చేసి కార్యక్రమం విజయవంతం చేయాలని అన్నారు.వేసవి లో త్రాగు నీటి సమస్య,తొలకరి లో మొక్కలు నాటే ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. రైతులకు విత్తనాలు,ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు.యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకోవడం పై రైతులకు ఈ కార్యక్రమంలో అవగాహన కలిగించాలన్నారు. అంతకు ముందు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ...గత పది సంవత్సరాలు ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా పాలన సాగిందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలను మరింత సమర్థంగా అమలు చేయవచ్చని అన్నారు. ఉమ్మడి జిల్లాలో 20 మున్సిపాలిటీలు ఉన్నందున రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం అమలు చేసిన మిషన్ భగీరథ పథకంలో నాణ్యతా లోపాలు ఉన్నాయని, వాటి వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సమస్యలు తలెత్తిన తరువాత స్పందించడం కాకుండా ముందుగానే నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులు--ఉపాధ్యాయుల నిష్పత్తిని పరిశీలించి, ఉపాధ్యాయుల కొరత ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచించారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... గత రెండు సంవత్సరాల్లో ప్రభుత్వం ప్రజల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం మంచి అవకాశమని ఆయన అన్నారు.ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో ఉన్న ప్రతి అంశానికి సంబంధించి సరైన ప్రచారం నిర్వహించి, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రజా పాలన ప్రగతి నివేదికలో పేర్కొన్న పది థీములు మంచి అంశాలే అని ఆయన తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు విషయంలో జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు జరిపితే కార్యక్రమాల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతుందన్నారు.ఈ నెల 12వ తేదీన నూతనంగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లకు నిర్వహించే ఒకరోజు శిక్షణ కార్యక్రమం మంచి కార్యక్రమమని ఆయన తెలిపారు. ఈ శిక్షణ ద్వారా ప్రజాప్రతినిధులకు పరిపాలనా విధానాలపై సరైన అవగాహన కలిగి తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సహాయపడుతుందని పేర్కొన్నారు.మార్చి 6 నుంచి 15 వరకు నిర్వహించే స్వచ్ఛత కార్యక్రమాల్లో సంబంధిత ప్రజాప్రతినిధులను తప్పనిసరిగా ఆహ్వానించి భాగస్వామ్యం కల్పించాలని అధికారులను కోరారు. అలాగే ఏప్రిల్ 2న నిర్వహించే గ్రామ సభల ద్వారా ప్రభుత్వ పథకాల ద్వారా ఎంతమంది లబ్ధి పొందారు, గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు, ప్రజల సమస్యలు వంటి అంశాలు స్పష్టంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని అన్నారు.ఏ పథకం అమలు చేసినా అది ఎమ్మెల్యేల అవగాహనతోనే అమలు చేయాలని, తద్వారా తమ సూచనలు ఇవ్వడం, అవసరమైతే ప్రజల అభిప్రాయాల ఆధారంగా సవరణలు చేయడం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అలాగే సీజీజీ (జ++) మొబైల్ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు. ప్రజా పాలన -- ప్రగతి నివేదికను ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా సరైన సమాచారంతో అమలు చేసి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్యం, పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచడంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఎంతో మంచి కార్యక్రమమని పేర్కొన్నారు. అయితే గ్రామాల్లో కొన్ని చిన్న సమస్యలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కొన్ని ఇళ్లు ఎల్2, ఎల్3 రిజెక్షన్ల కారణంగా నిలిచిపోయి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించుకునేలా అధికారులు ఈ అంశాన్ని సమీక్షించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. రోడ్డు భద్రత విషయాన్ని ప్రస్తావిస్తూ ఆటోరిక్షాల్లో అధికంగా ప్రయాణికులను ఎక్కించడంవల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అందువల్ల ఆర్టీఏ అధికారులు ఆటోరిక్షాలపై ప్రత్యేకంగా నిఘా ఉంచి ఓవర్‌లోడింగ్‌ను నివారించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో రోడ్లు మరియు కాలువల నిర్మాణ పనులు చిన్న చిన్న అడవి భూభాగాలు అడ్డుగా రావడం వల్ల అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో నిలిచిపోయాయని తెలిపారు. దీని కారణంగా వనపర్తి జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు సాగునీరు అందకుండా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ఈ సమస్య పరిష్కారానికి అటవీ మరియు రెవెన్యూ శాఖ అధికారులు కలిసి సంయుక్త సర్వే నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహని కోరారు. అలా చేస్తే ప్రభుత్వ అభివృద్ధి పనులు వేగంగా అమలు అవుతాయని ఎమ్మెల్యే మేఘా రెడ్డి తెలిపారు.సమావేశంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి అధికారులు చురుకుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధరణి పోర్టల్‌కు సంబంధించిన కొన్ని భూ సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, రైతులు, భూ యజమానులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా సమస్యలపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అనేక గ్రామాల్లో ప్రస్తుతం తాగునీరు రెండు, మూడు రోజులకోసారి మాత్రమే సరఫరా అవుతుందని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని దెబ్బతిన్న పైపులను మరమ్మతు చేయడం, సాంకేతిక సమస్యలను పరిష్కరించడం, అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం ద్వారా గ్రామాల్లో నిరంతర తాగునీటి సరఫరా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సమస్యలను కూడా పరిష్కరించాలని ఆయన అన్నారు. చిన్న చిన్న సాంకేతిక కారణాలతో అనేక అర్హులైన లబ్ధిదారులు ఇళ్లకు నోచుకోకుండా ఉన్నారని పేర్కొంటూ, అటువంటి కేసులను అధికారులు సమీక్షించి అర్హులైన వారికి ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ మైనారిటీ కమిషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ మైనారిటీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కచ్చితంగా సమర్థవంతంగా అమలవ్వాలని తెలిపారు. ఈ పథకాల అమలుపై సమీక్ష చేసేందుకు ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మంచి వేదికగా ఉపయోగపడుతుందని అన్నారు.ప్రత్యేకంగా నారాయణపేట, గద్వాల్ జిల్లాలలోని మైనారిటీ లబ్ధిదారులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో అనేక మంది అర్హులైన మైనారిటీ యువకులు ఇప్పటికీ ప్రభుత్వ సహాయం పొందకుండా ఉన్నారని చెప్పారు. స్వయం ఉపాధి కోసం అందించాల్సిన కుట్టు యంత్రాలు, పనిముట్లు, ఇతర సాధనాలు చాలా మందికి అందలేదని ఆయన చెప్పారు.అదే విధంగా మైనారిటీ యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించేలా నూతన మరియు వినూత్న పథకాలను రూపొందించి అమలు చేయాలని ఆయన అధికారులకు సూచించారు.అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో పోడు భూములను సాగు చేస్తున్న రైతులు అభివృద్ధి కార్యక్రమాల నుండి దూరం కాకుండా ఉండేందుకు అటవీ శాఖ మరియు రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అటవీ ప్రాంతాల్లో పోడు భూములను సాగు చేస్తున్న రైతులు వ్యవసాయం చేయడానికి అటవీ శాఖ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కారణంగా ఇందిరా సౌర గిరి జల వికాసం కార్యక్రమం అమలులో కూడా ఆలస్యం జరుగుతోందని తెలిపారు.పోడు భూముల్లో హార్టికల్చర్ పంటలు సాగు చేయడం ద్వారా రైతులకు మంచి లాభం కలుగుతుందని, అదే సమయంలో అటవీ శాఖకు కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల కోసం అమలు చేయాల్సిన అనేక సంక్షేమ కార్యక్రమాలు పునరావాసం పేరుతో అమలు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు అటవీ శాఖ అధికారులు, జిల్లా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, ప్రజాప్రతినిధులను కూడా కలుపుకొని ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. అలా చేస్తే అవసరమైన వారికి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు అవుతాయని ఆయన తెలిపారు.తెలంగాణలో క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి తెలిపారు. ఇటీవల నిర్వహించిన సీఎం కప్ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు మరియు కళాశాలలకు చెందిన 5 లక్షలకుపైగా విద్యార్థులు వివిధ క్రీడలు, ఆటలు మరియు అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతిభ కనబర్చిన అనేక మంది విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు కూడా ఎంపిక కావడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రంలోని క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం త్వరలోనే ప్రతి గ్రామపంచాయతీకి రూ.45,000 విలువైన స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 12,700 గ్రామపంచాయతీలకు ఈ కిట్లు అందించనున్నట్లు ఆయన చెప్పారు. ముఖ్యంగా కబడ్డీ, ఖోఖో ఆటలకు సంబంధించిన కిట్లు మరియు మ్యాట్లకు ఎక్కువ డిమాండ్ వచ్చిందని వెల్లడించారు.అదేవిధంగా ప్రతి జిల్లాకు ఒక్కోటి చొప్పున 33 స్పోర్ట్స్ కిట్లు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కిట్లు మ్యాట్లు జిల్లా క్రీడాధికారుల ద్వారా ఉచితంగా పంపిణీ చేయబడతాయని, అయితే లబ్ధిదారులు రవాణా ఖర్చు మాత్రమే భరించాల్సి ఉంటుంది అని వివరించారు. గ్రామపంచాయతీలలో క్రీడల మైదానాల పరిస్థితి గురించి ఆయన వివరించారు. అనేక గ్రామాలలో క్రీడా మైదానాలు లేకపోవడం, ఉన్న చోట్ల కూడా ఒకటి నుంచి ఒకటిన్నర ఎకరాల మాత్రమే విస్తీర్ణం ఉండడం వల్ల క్రీడా అభివృద్ధి సక్రమంగా జరగడం లేదన్నారు. అందువల్ల ప్రతి పల్లె క్రీడా ప్రాంగణానికి కనీసం రెండు ఎకరాల భూమిని కేటాయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అలా చేస్తే గ్రామస్థాయిలో క్రీడల అభివృద్ధి కోసం అవసరమైన మౌలిక వసతులు మెరుగుపరచడం సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. అనంతరం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమ ప్రచార పోస్టర్ లు, టీ షర్ట్ లను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, కలెక్టర్ల తో కలిసి మంత్రి ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్ బదావత్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, నారాయణపేట జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు, , మహబూబ్‌నగర్ మేయర్ గుమాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లు మల్లు నర్సింహ్మారెడ్డి, వార్ల విజయకుమార్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, ఆయా జిల్లాల ఆర్డీవోలు,మున్సిపల్ కమిషనర్ లు డి ఆర్ డి ఓ లు, డిపివోలు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- మాదారంలో భారీ అవగాహన సదస్సు..
- ముఖ్య అతిథులుగా హాజరైన టీం డైరెక్టర్ సందీప్ శాండిల్య మరియు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా.



**పరిగి మున్సిపల్,( మం)మార్చి 06(సమయం న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, 5వ థీమ్ 'పిల్లల భద్రత - డ్రగ్స్ కు అడ్డుకట్ట' పై పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాదారం గ్రామంలో ఈ రోజు భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఈగిల్ టీం డైరెక్టర్ సందీప్ శాండిల్య ముఖ్య అతిథిగా హాజరుకాగా, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సందీప్ శాండిల్య మాట్లాడుతూ, డ్రగ్స్ అనే మహమ్మారి పట్ల యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. తొలుత సరదాగా ప్రారంభమయ్యే చిన్న చిన్న అలవాట్లు కాలక్రమేణా ప్రాణాంతకమైన వ్యసనాలుగా మారి, వ్యక్తిగత జీవితంతో పాటు సమాజాన్ని కూడా సర్వనాశనం చేస్తాయని హెచ్చరించారు. ముఖ్యంగా పసిపిల్లలను డ్రగ్స్ ఊబిలోకి దించడం అనేది క్షమించరాని నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. విద్యార్థులు చెడు స్నేహాలకు, అలవాట్లకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో కూడిన ఉత్తమ అలవాట్లను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ, డ్రగ్స్ అనేది కేవలం ఒక వ్యక్తిగత సమస్య కాదని, ఇది ఒక 'ఆర్గనైజ్డ్ క్రైమ్' (వ్యవస్థీకృత నేరం) అని అభివర్ణించారు. మన రాష్ట్ర అభివృద్ధిని, దేశ భవిష్యత్తును దెబ్బతీయడానికి శత్రువుల చేతిలో డ్రగ్స్ ఒక మారణాయుధంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడు ఈ విషయంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సమాజంలో డ్రగ్స్ సరఫరా లేదా వాడకం గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అదేవిధంగా, విద్యార్థుల భద్రతపై దృష్టి సారిస్తూ వారికి 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్' పై అవగాహన కల్పించారు. చిన్న వయసులోనే తమకు ఎదురయ్యే అసౌకర్యాలను గుర్తించి, ధైర్యంగా తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలియజే యాలని సూచించారు. విద్యార్థులు జీవితంలో ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఆ లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలే తప్ప పక్కదారి పట్టకూడదని హిత బోధ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక మరియు ఆర్థిక నష్టాలను వివరించారు.ఈ కార్యక్ర మంలో ఈగల్ టీం అదనపు ఎస్పీ కృష్ణ మూర్తి, జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్,ఎక్సైజ్ అధికారులు, ఈగిల్ టీం సిబ్బంది,మాదారం గ్రామం సర్పంచ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువజన సంఘాలు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నగరాన్ని ఐదేండ్లలో అద్భుతంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్ మార్చి06( సమయం న్యూస్) :** మహబూబ్ నగర్ నగరాన్ని వచ్చే ఐదేళ్లలో అద్భుతంగా తీర్చిది ద్దుతానని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగర్ నగరంలోని 31వ డివిజన్ గణేష్ నగర్‌లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమం వివరాలను అధికారులకు, ప్రజలకు వివరించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తం గా 99 రోజుల పాటు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్ర మాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. మహబూబ్ నగరంలోని నగరపాలక సంస్థ పరిధిలో డివిజన్ లలో నగర అభివృద్ధి పనులకు త్వరలోనే శంకుస్థాపనలు ప్రారంభమవుతాయని తెలిపారు. నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం గౌరవ ముఖ్యమంత్రి గారు రూ.220 కోట్లను మంజూరు చేశారని తెలిపారు. అలాగే నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కోసం రూ.603 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. త్వరలో ప్రతి డివిజన్ అభివృద్ధి పనుల కోసం రూ.50 లక్షలు అందించనున్నట్లు వెల్లడించారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలను అందజేశారు. గణేష్ నగర్‌లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ పట్టణ గౌరవ మేయర్ శ్రీమతి గుమ్మాల మమత, డిప్యూటీ మేయర్ శ్రీ సురేందర్ రెడ్డి ,, మున్సిపల్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా నూతన కలెక్టర్ దీపక్ తివారిని మర్యాదపూర్వకంగా కలిసిన వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా

**వికారాబాద్, మార్చి,06(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్.

## "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక"

**తాండూరు మున్సిపల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ నిర్వహించిన మున్సిపల్ అధికారులు**



**తాండూరు, మున్సిపల్, మార్చి,06(సమయం న్యూస్) :** "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" లో భాగంగా మొదటి రోజు తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ నిర్వహించారు. శుక్రవారం ఇందులో భాగంగా 12 వార్డ్ లోని జిమ్ పార్క్ వద్ద క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ శాఖ నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో అధికారులు సిబ్బంది ఉన్నారు.

## కోస్గి ఎంపీడీఓ ఆధ్వర్యంలో "ప్రజా- పాలన -ప్రగతి ప్రణాళిక"

- ప్రారంభించిన ఎంపీపీవో శ్రీధర్



**కోస్గి మున్సిపల్, మార్చి,06(సమయం న్యూస్) :** కొడంగల్ నియోజక వర్గం కోస్గి ఎంపీడీవో ఆధ్వర్యంలో ప్రజాపాలన ..ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో 99 రోజుల కార్యక్రమాన్ని ఎంపీడీవో శ్రీధర్ ప్రారంభించారు. ఇందులో ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యక్రమంలో 10 అంశాలను ప్రవేశపెట్టి తేదీలవారీగా అట్టి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు..

## "కొత్తపల్లి తహేసిల్దార్ ఆధ్వర్యంలో "ప్రజా- పాలన- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం



**కొత్తపల్లి మండలం, మార్చి 06(సమయం న్యూస్) :** ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో మొదటి రోజు కొత్తపల్లి తాహసిల్దార్ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో పాల్గొన్నారు. పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి.



**వికారాబాద్, మార్చి,06(సమయం న్యూస్) :** శుక్రవారం ఉదయం వికారాబాద్ పట్టణ పరిధి గంగారం లో ఉన్న డంపింగ్ యార్డ్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యర్థాల నిర్వహణ విధానం, శుభ్రత, వ్యర్థాల వర్గీకరణ మరియు పారిశుధ్య చర్యలపై అధికారులతో మాట్లాడారు.డంపింగ్ యార్డ్‌లో చెత్తను సక్రమంగా వర్గీకరించి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పర్యావరణానికి హాని కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేసి రీసైక్లింగ్ చర్యలను వేగవంతం చేయాలని పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో శుభ్రతను కచ్చితంగా పాటించాలని, దుర్వాసన మరియు కాలుష్యాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.అనంతరం పట్టణం లో 28 వ వార్డ్ ను సందర్శించి వార్డ్ సమస్య ల పై ఆరా తీశారు. ప్రతి ఇంటికి వెహికిల్ తిరిగి 100% తడి, పొడి చెత్త సేకరణ జరగాలని, వెహికిల్ లో జియో ట్యాగింగ్, సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలనీ అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థ లు అదనపు కలెక్టర్ సుధీర్,మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహా రెడ్డి, వైస్ చైర్మన్ అర్ద సుధాకర్ రెడ్డి,మున్సిపల్ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి అందరూ కృషి చేయాలి

- ప్రజాపాలనతోనే అభివృద్ధి సాధ్యం..
- పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రజలు సహకరించాలి..
- కోస్గి మున్సిపల్ చైర్మన్ నాగులపల్లి నరేందర్.



**కోస్గి మున్సిపల్, మార్చి,06(సమయం న్యూస్) :** ప్రజాపాలనతో నే సమగ్ర అభివృద్ధి సాధ్యపడుతుందని కోస్గి మున్సిపల్ చైర్మన్ నాగులపల్లి నరేందర్ అన్నారు. శుక్రవారం ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కమిషనర్ నాగరాజు తో కలిసి మున్సిపల్ సిబ్బంది, అధికారులు,ఆశ కార్యకర్తలతో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా తేది 6వ తేదీ నుండి 99 రోజుల పాటు ప్రజాపాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు కొనసాగుతాయని అన్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందని అదే స్ఫూర్తితో కోస్గి మున్సిపాలిటీలో కూడా అభివృద్ధి పనులు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు అభివృద్ధికి సహకరించాలని కోరారు.ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణ సమగ్ర కార్యాచరణకు శ్రీకారం చుట్టబోతున్నామని,అందుకు ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. పట్టణంలోని అన్ని వార్డులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక ద్వారా రానున్న మూడు నెలలో కోస్గి పట్టణంలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసే విధంగా చర్యలు చేపడతామని అన్నారు. ప్రతి వార్డులో పారిశుధ్య పనులు, సైడ్ డ్రైన్ లలో చెత్త తొలగింపు,వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ చింతల సరితా,కౌన్సిలర్లు బెజ్జు సంగీత,భానునాయక్,మాస్టర్ శ్రీనివాస్, నాయకులు ఇద్రిస్,బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"

- 99 రోజుల కార్యక్రమం లో భాగంగా, 5వ థీమ్ అయిన
- "పిల్లల భద్రత మరియు డ్రగ్స్ నిర్మూలన"
- విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమం
- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు




**వికారాబాద్, మార్చి,06(సమయం న్యూస్) :** 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, 5వ థీమ్ అయిన లి"పిల్లల భద్రత మరియు డ్రగ్స్ నిర్మూలన"లిపై వికారాబాద్ జిల్లా పోలీస్ యంత్రాంగం విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఖూా ఆదేశాల మేరకు, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డీఎస్పీలు, సీఐలు,ఎస్సైలు మరియు సిబ్బంది సమన్వయంతో క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజలను చైతన్యపరిచారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని 4 గ్రామాల చొప్పున, జిల్లా వ్యాప్తంగా మొత్తం 80 గ్రామాలలో ఈ అవగాహన సదస్సులు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా అధికారులు డ్రగ్స్ మహమ్మారి వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, యువత వ్యసనాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును ఎలా నాశనం చేసుకుంటున్నారో సోదాహరణంగా వివరించారు.పరిగి సబ్ డివిజన్‌లోని కొడంగల్ పట్టణంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ముఖ్య అతిథిగా హాజరై భారీ 2ఖ రన్‌ను ప్రారంభించారు. అనంతరం పరిగి నియోజకవర్గ పరిధిలోని మాదారం గ్రామంలో ఈగల్ టీమ్ డైరెక్టర్‌తో కలిసి ఎస్పీ నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యు–ంవత డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, విద్యార్థులు "గుడ్ టచ్ – బ్యాడ్ టచ్" పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. దోమ మండలంలోని దోమ, దిర్సంపల్లి గ్రామాలలో; కుల్కచర్ల, బందేన్ కిచర్ల గ్రామాలలో; మరియు చెంగోముల్ పరిధిలోని మన్నెగూడ, పూడూర్, మీర్జాపూర్ గ్రామాలలో ఆయా పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో ర్యాలీలు, సదస్సులు మరియు ప్రతిజ్ఞా కార్యక్రమాలు నిర్వహించారు.తాండూరు సబ్ డివిజన్‌లో ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, కరణ్‌కోట్ పరిధిలోని గౌతాపూర్ గ్రామంలో యువత కోసం ప్రత్యేకంగా వాలీబాల్ మరియు క్రికెట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. యాలాల మండలంలోని రాస్నం, అగనూర్ గ్రామాలలో మరియు పెద్దేముల్ మండలంలోని వివిధ గ్రామాలలో ర్యాలీలు, సదస్సులు మరియు మానవ హారాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం నింపారు. వికారాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద వాకర్స్‌తో కలిసి డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. మోమిన్‌పేట్ మండలంలోని మేకవనంపల్లి, ఎన్కతల, మొరంగపల్లి గ్రామాల్లోని పాఠశాలలు మరియు రైతు వేదికల వద్ద ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, నార్కోటిక్స్ టోల్ ఫ్రీ నెంబర్ 1908 పై అవగాహన కల్పించారు. అలాగే నవాబుపేట మండలంలోని పుల్మామిడి, దాతాపూర్ మోడల్ స్కూల్; ధారూర్, నాగసముందర్ గ్రామాలు; కోటపల్లి, ఎన్నారం గ్రామాలు; మరియు బంట్వారం మోడల్ స్కూల్, తురుమామిడి గ్రామాలలో ఆయా పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో ర్యాలీలు, సదస్సులు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ అవగాహన సదస్సులలో అధికారులు ముఖ్యంగా 'షీ టీమ్స్' (రాష్ట్రవ ంఖుఎం) ప్రాముఖ్యతను మరియు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టడానికి ఉద్దేశించిన పోక్సో (గూజూూ) చట్టం గురించి, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, గ్రామాలలో ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని యు–ంవత ఆటపాటల వైపు మళ్లాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో జిల్లాలోని సీనియర్ పోలీస్ అధికారులు, ఈగల్ టీమ్ అధికారులు, సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.


# మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం -- పోలీస్ శాఖ - TG NAB ఆదేశాల మేరకు
- మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు కుల్కచర్ల పోలీస్ స్టేషన్....
- పరిధిలోని నాలుగు గ్రామాలలో నిర్వహించబడినవి.






**కుల్కచర్ల మండలం, మార్చి,06(సమయం న్యూస్) :** ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా యాంటీ నార్కోటిక్స్ ఏసీపీ రమేష్ కుమార్ (హైదరాబాద్), కుల్కచర్ల తహేసిల్దార్ మనోహర్ చక్రవర్తి, చౌడాపూర్ తహేసిల్దార్ వెంకటేశ్వర్లు, కుల్కచర్ల ఎంపిడివో రామకృష్ణ, చౌడాపూర్ ఎంపిడివో సోమలింగం, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పెర్తా నాయక్, మెడికల్ ఆఫీసర్ కిరణ్ హాజరయ్యారు.గ్రామ ప్రజలకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు మరియు చట్టపరమైన చర్యల గురించి అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులు మరియు గ్రామస్థులతో కలిసి అవగాహన ర్యాలీలు నిర్వహించబడినవి. 1. కుల్కచర్ల గ్రామంకుల్కచర్ల సర్పంచ్ వరవాల అంజయ్య, గ్రామ సెక్రటరీ భాస్కర్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ భీమ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆనందం, మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 240 మంది పాల్గొన్నారు. జెడ్పిహెచ్ఎస్ బాలుర పాఠశాల మైదానంలో ఉదయం 10:30 గంటలకు కార్యక్రమం నిర్వహించబడింది. విద్యార్థులు మరియు గ్రామస్థులతో కలిసి 600 మీటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. 2. బందెనెకిచెర్ల గ్రామంసర్పంచ్ మడుగు శ్రీనివాస్, ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, పంబంద్ దేవాలయ కమిటీ చైర్మన్ మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 350 మంది పాల్గొన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ కాలేజ్ వద్ద మధ్యాహ్నం 12:00 గంటలకు కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా 200 మీటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. 3. ముజాయిద్‌పూర్ గ్రామంసర్పంచ్ చంద్రభూపాల్ రావు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 220 మంది పాల్గొన్నారు. జెడ్పిహెచ్ఎస్ పాఠశాల మైదానంలో మధ్యాహ్నం 1:45 గంటలకు కార్యక్రమం నిర్వహించబడింది. విద్యార్థులు మరియు గ్రామస్థులతో కలిసి 300 మీటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. 4. చౌడాపూర్ గ్రామంసర్పంచ్ నవీన్, ఉప సర్పంచ్ రాజు,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్వాటి అశోక్ కుమార్,బీఆర్ఎస్ నాయకుడు సుధాకర్ రెడ్డి,బీజేపీ నాయకుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 270 మంది పాల్గొన్నారు. జెడ్పిహెచ్ఎస్ చౌడాపూర్ వద్ద మధ్యాహ్నం 3:45 గంటలకు కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా 500 మీటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గ్రామాలలో ఎక్కడైనా మాదక ద్రవ్యాల వినియోగం లేదా విక్రయం జరుగుతున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారూ.



## గంభీర్‌కు గర్ల్‌ఫ్రెండ్‌ను పరిచయం చేసిన
# హార్దిక్ పాండ్యా!

**ఢిల్లీ:** ఐసీసీ మెన్స్ టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్ పోరుకు రంగం సిద్ధమైంది. ఈ మెగా ఫైనల్‌లో తలపడేందుకు టీమ్ ఇండియా శుక్రవారం (మార్చి 6) సాయంత్రం అహ్మదాబాద్ చేరుకుంది. సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై అద్భుత విజయం సాధించిన ఉత్సాహంలో ఉన్న భారత్, ఇప్పుడు కివీస్‌ను ఢీకొట్టేందుకు సిద్ధమవుతోంది. ముంబైలో జరిగిన సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను 7 పరుగుల తేడాతో ఓడించిన టీమ్ ఇండియా, శుక్రవారం సాయంత్రం 5:30 గంటలకు అహ్మదాబాద్ విమానాశ్రయానికి చేరుకుంది. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి అక్షర్ పటేల్, జస్ప్రీత్ బుమ్రా తమ వ్యక్తిగత కార్లలో వెళ్లగా, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఇతర ఆటగాళ్లు కలిసి హోటల్‌కు చేరుకున్నారు.


### వైరల్ అవుతున్న హార్దిక్ పాండ్యా వీడియో..

ముంబై ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించిన ఒక వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. టీమిండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా, తన గర్ల్‌ఫ్రెండ్ మాహికా శర్మను హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు పరిచయం చేయడం ఈ వీడియోలో కనిపిస్తుంది. మాహికా శర్మ ఈ వరల్డ్ కప్ టోర్నీ అంతటా హార్దిక్ వెంటే ఉంటూ టీమిండియాను ప్రోత్సహిస్తున్నారు. సెమీఫైనల్ మ్యాచ్‌లో హార్దిక్ కుమారుడు అగస్త్యతో కలిసి ఆమె మ్యాచ్ వీక్షించారు. మార్చి 8న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరగనున్న మ్యాచ్‌లో భారత్ గెలిస్తే పలు ప్రపంచ రికార్డులు బద్దలవుతాయి. టీమిండియా ఈ ఫైనల్ మ్యాచ్ గెలిస్తే, టీ20 వరల్డ్ కప్ చరిత్రలో వరుసగా రెండుసార్లు టైటిల్ నెగ్గిన మొదటి జట్టుగా చరిత్ర సృష్టిస్తుంది. ఇప్పటి వరకు ఏ దేశం కూడా తమ సొంతగడ్డపై టీ20 ప్రపంచకప్‌ను గెలవలేదు. భారత్ విజయం సాధిస్తే ఈ ఘనత సాధించిన తొలి దేశంగా చరిత్రపుటల్లో శాశ్వత కీర్తిని సొంతం చేసుకుంటుంది. ఇప్పటికే వరుసగా రెండు టీ20 వరల్డ్ కప్ ఫైనల్స్ ఆడుతున్న మొదటి జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. న్యూజిలాండ్ జట్టుకు నాకౌట్ మ్యాచ్‌ల్లో అద్భుతమైన రికార్డు ఉంది. పెద్ద మ్యాచుల్లో ఎప్పుడైనా గట్టి పోటీనిచ్చి ఫలితాన్ని తారుమారు చేసే సామర్థ్యం కివీస్‌కు ఉందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, 1.30 లక్షల మంది ప్రేక్షకుల మధ్య హోమ్ గ్రౌండ్‌లో ఆడుతుండటం టీమిండియాకు అతిపెద్ద బలంగా చెబుతున్నారు.

# మహ్మద్ అమీర్ కన్నా ఊసరవెల్లి నయం

### భారత్ విజయంతో మాట మార్పు..

**ఢిల్లీ:** టీ20 ప్రపంచ కప్‌లో భారత్ ఫైనల్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. గురువారం ఇంగ్లాండ్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో భారత్ 7 పరుగుల తేడాతో గెలిచింది. అయితే, భారత్ సెమీస్‌లో గెలవదు, అసలు సెమీస్‌కే చేరదు అంటూ పాకిస్తాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ అమీర్ అవాకులు చెవాకులు పెలాడు. భారత్‌పై తన అక్కసును వెళ్లగక్కాడు.ప్రస్తుతం భారత్ ఫైనల్స్‌కు చేరడంతో మాట మార్చాడు. సోషల్ మీడియాలో అమీర్‌పై నెటిజన్లు తెగ ట్రోలింగ్ చేస్తున్నారు. టీమిండియాను ఇంగ్లాండ్‌ను ఓడించి ఫైనల్ చేరిన తర్వాత అమీర్‌ను ఆయన చేసిన కామెంట్స్ గురించి ఓ టీవీ ఛానెల్ యాంకర్ ప్రశ్నించారు. దీనికి సమాధానంగా అమీర్ మాట్లాడుతూ..“ ఈ రోజు గుడ్ క్రికెట్ ఉంది, నేడు టీం ఇండియా పరిపూర్ణ క్రికెట్ ఆడింది. టీం ఇండియా గత మ్యాచ్‌లు చూస్తే ఇంగ్లాండ్ తో బాగా ఆడింది. ఇంగ్లాండ్ సంజూ శాంసన్ క్యాచ్ వదిలేసింది. అక్షర్ పటేల్ రెండు మంచి క్యాచ్‌లు పట్టుకున్నాడు. అక్షర్ క్యాచ్ పట్టకపోతే ఇంగ్లాండ్ ఒక ఓవర్ మిగిలి ఉండగానే మ్యాచ్ గెలిచేది” అని చెప్పాడు. గతం సూపర్-8లో ఇండియా వర్సెస్ వెస్టిండీస్ కీలక మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలవదని, వెస్టిండీస్ సెమీస్ కు వెళ్తుందని ఆమీర్ అన్నారు. కానీ,అతడి అంచనాలు తప్పని తేలింది. ఆ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించి సెమస్‌కు చేరింది. సెమీస్‌లో ఇంగ్లాండ్ గెలుస్తుందని మళ్లీ ఓ జోస్యం చెప్పాడు. చివరకు భారత్ ఘన విజయం సాధించి ఫైనల్‌లో నిలిచింది. అమీర్ వ్యాఖ్యలు చేయడం, ఆయన వ్యాఖ్యలు తప్పని భారత్ నిరూపించడం జరుగుతూనే ఉంది. కానీ, గెలిచిన తర్వాత మాట మార్చడం చూస్తున్న భారత ఫ్యాన్స్ మాత్రం నీకన్నా ఊసరవెల్లి నయం కదా అని అనుకుంటున్నారు.




# బుమ్రా కూడా మనిషే..

- న్యూజిలాండ్ ప్లేయర్ కీలక వ్యాఖ్యలు
- డెత్ ఓవర్లలో బుమ్రా యార్కర్లు పెద్ద సవాల్
- లూజ్ బాల్ వస్తే బౌండరీకి పంపేందుకు సిద్ధం: కివీస్ వ్యూహం
- వరుణ్ చక్రవర్తి స్పిన్ కూడా సవాల్




**అహ్మదాబాద్:** అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం జరగనున్న ఫైనల్ మ్యాచ్‌తో ఈ మెగా టోర్నీకి తెరపడనుంది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన గ్లెన్ ఫిలిప్స్, భారత బౌలింగ్ విభాగాన్ని, ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రాను ఎదుర్కోవడంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. బుమ్రాను ఒక 'ప్రపంచ స్థాయి ఆపరేటర్'గా అభివర్ణించిన ఫిలిప్స్, అతని వద్ద ఉన్న వైవిధ్యమైన బంతులు, ముఖ్యంగా డెత్ ఓవర్లలో అత్యంత ఖచ్చితత్వంతో వేసే యార్కర్లు ఏ బ్యాటర్ కైనా సవాలేనని అంగీకరించారు. అయితే, బుమ్రా అజేయుడేమీ కాదని, మిగిలిన ఆటగాళ్లలాగే అతను కూడా మనిషేనని, అతనికీ ఏదో ఒక రోజు తడబడే అవకాశం ఉంటుందని ఫిలిప్స్ వ్యాఖ్యానించారు. “బుమ్రా అత్యుత్తమ బౌలర్ అనడంలో సందేహం లేదు, కానీ అతను కూడా మనిషే. అందరిలాగే అతనికి కూడా 'బ్యాడ్ డే' ఉండొచ్చు. ఆ రోజు (ఫైనల్ మ్యాచ్) అతనికి అలాంటి రోజే కావాలని మేము కోరుకుంటున్నాము” అని ఫిలిప్స్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్‌లో బుమ్రా 18వ ఓవర్ వేసి కేవలం 6 పరుగులు మాత్రమే ఇచ్చి భారత్ విజయానికి బాటలు వేసిన తీరును ఆయన గుర్తు చేశారు. బుమ్రా వేసే 4 ఓవర్లను కేవలం డిఫెన్స్ ఆడుతూ వదిలేయలేమని, అతను పొరపాటున లూజ్ బాల్ వేస్తే దానిని బౌండరీకి తరలించడానికి తాము సిద్ధంగా ఉన్నామని కివీస్ వ్యూహాన్ని బయటపెట్టారు. ఒకవేళ బుమ్రా తన పదునైన బౌలింగ్‌తో కట్టడి చేస్తే, దానికి తగ్గట్లుగా మైదానంలోనే తమ ప్రణాళికలను మార్చుకుంటామని ఫిలిప్స్ స్పష్టం చేశారు. కేవలం బుమ్రా మాత్రమే కాకుండా, మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని ఎదుర్కోవడం కూడా తమకు కీలకమని ఫిలిప్స్ పేర్కొన్నారు. గత ద్వైపాక్షిక సిరీస్‌లలో వరుణ్‌ను ఎదుర్కొన్న అనుభవం తమకు ఉందని, బంతిని బట్టి ఆడుతూ ఒత్తిడిని అధిగమిస్తామని చెప్పారు. లక్షలాది మంది భారత అభిమానుల మధ్య, డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌ను వారి సొంత గడ్డపై ఎదుర్కోవడం 'డేవిడ్ జం గోలియత్' పోరాటంలా ఉంటుందని, కానీ తమ జట్టుకు ఒత్తిడిని తట్టుకుని నిలబడటం తెలుసని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో 2021 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో భారత్‌ను ఓడించిన జ్ఞాపకాలను కివీస్ జట్టు గుర్తు చేసుకుంటోంది. ఆదివారం జరగబోయే ఈ అమీతుమీ పోరులో బుమ్రా తన ప్రతాపం చూపిస్తాడా లేక ఫిలిప్స్ ఆశించినట్లుగా కివీస్ పైచేయి సాధిస్తుందా అన్నది వేచి చూడాలి.

## భారత్-న్యూజిలాండ్ ఫైనల్ మ్యాచ్ రద్దయితే
# విజేత ఎవరు?






**ఢిల్లీ:** 2026 టీ20 ప్రపంచ కప్ ఫైనల్ సమరానికి సర్వం సిద్ధమైంది. మార్చి 8న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో భారత్ ఉ న్యూజిలాండ్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. అయితే, ఈ మెగా ఫైనల్‌కు వర్షం ముప్పు పొంచి ఉంటే విజేతను ఎలా నిర్ణయిస్తారు? ఐసీసీ నిబంధనలు ఏం చెబుతున్నాయి? పూర్తి వివరాలను ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**ఫైనల్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగితే ఫలితం కోసం ఐసీసీ కింది నిబంధనలను అమలు చేస్తుంది.**

**రిజర్వ్ డే :** మార్చి 8న వర్షం కారణంగా మ్యాచ్ సాధ్యం కాకపోయినా లేదా అసంపూర్తిగా ఆగినా, మరుసటి రోజు అంటే మార్చి 9ని 'రిజర్వ్ డే'గా కేటాయించారు.

**ఆగిన చోటు నుంచే..:** ఒకవేళ మార్చి 8న టాస్ పడి, కొంత ఆట జరిగిన తర్వాత వర్షం పడితే, రిజర్వ్ డే నాడు మ్యాచ్ మళ్లీ మొదటి నుంచి కాకుండా ఆగిపోయిన పాయింట్ నుంచే కొనసాగుతుంది.

**అదనపు సమయం:** మ్యాచ్ పూర్తి చేయడానికి వీలుగా రెండు రోజులూ 120 నిమిషాల అదనపు సమయాన్ని కేటాయిస్తారు. ఓవర్ల తగ్గింపు ద్వారా అయినా ఫలితం రాబట్టేందుకు అంపైర్లు ప్రయత్నిస్తారు.

కనీస ఓవర్లు: ఫైనల్ ఫలితం తేలాలంటే రెండు జట్లు కనీసం 10 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేయాల్సి ఉంటుంది.

### ఒకవేళ రెండు రోజులూ ఆట సాధ్యం కాకపోతే..

దురదృష్టవశాత్తూ మార్చి 8, 9 తేదీల్లో కూడా వర్షం కారణంగా మ్యాచ్ పూర్తి కాకపోతే, ఐసీసీ నిబంధనల ప్రకారం భారత్ ఉ న్యూజిలాండ్ జట్లను 'సంయుక్త విజేతలు'గా ప్రకటిస్తారు. గతంలో 2002 ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్-శ్రీలంక మధ్య ఇలాగే టైటిల్‌ను పంచుకోవడం జరిగింది. అయితే టీమ్ ఇండియా వరుసగా రెండోసారి టీ20 ప్రపంచ కప్ గెలిచి చరిత్ర సృష్టించాలని పట్టుదలతో ఉంది. ఇప్పటివరకు ఏ జట్టు కూడా వరుసగా రెండు టైటిళ్లు నెగ్గలేదు. కానీ ఐసీసీ టోర్నీల్లో న్యూజిలాండ్‌పై భారత్‌కు అంత మంచి రికార్డు లేదు. ఇప్పటివరకు టీమ్ ఇండియా టీ20 ప్రపంచ కప్‌లో కివీస్‌ను ఓడించలేదు. ఈసారి ఆ రికార్డును తిరగరాయాలని టీమిండియా భావిస్తోంది. ఇదే సమయంలో తొలిసారి టీ20 ప్రపంచ కప్ ట్రోఫీని ముద్దాడాలని న్యూజిలాండ్ కూడా ఎంతో కసితో ఉంది.

# సంజు శాంసన్ సూపర్ ఫామ్ వెనుక సీక్రెట్

### బయటపెట్టిన టీమిండియా మాజీ కోచ్

**ఢిల్లీ:** కీలక మ్యాచ్‌లలో టీమిండియాను గట్టు ఎక్కించింది




సంజు శాంసన్.. అసలు.. సంజు.. సూపర్ నాక్ లేకపోతే.. భారత్ ఫైనల్‌కు చేరేదా? అంటే లేదనే చెప్పాలి.. అయితే, ఎన్నో అవమానాలు ఎదుర్కొన్న సంజుకు ఇంటి సూపర్ ఫామ్ ఎలా సాధ్యమైంది..? అనేది ఇప్పుడు చర్చ.. 2026 ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌లో భారత వికెట్‌కీపర్ బ్యాట్స్‌మన్ సంజు శాంసన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. కీలక మ్యాచ్‌లలో అతను ఆడిన ఇన్నింగ్స్‌లు టీమ్ ఇండియాకు విజయాన్ని అందించడంలో ముఖ్య పాత్ర పోషించాయి. ముఖ్యంగా వెస్టిండీస్ మరియు ఇంగ్లాండ్‌పై సంజు చేసిన బ్యాటింగ్ అభిమానులను ఆకట్టుకుంది.

ఇప్పుడు టైటిల్ పోరులో భారత్ మరియు న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. ఈ ఫైనల్ మ్యాచ్ మార్చి 8న అహ్మదాబాద్‌లో జరగనుంది. ఈ నేపథ్యంలో భారత మాజీ కోచ్ రవి శాస్త్రి.. సంజు శాంసన్ సూపర్ ఫామ్ వెనుక ఉన్న అసలు సీక్రెట్‌ను బయట పెట్టాడు..

### వెస్టిండీస్‌పై అద్భుత ఇన్నింగ్స్

వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో సంజు శాంసన్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి అజేయంగా 97 పరుగులు చేశాడు. అతని ఇన్నింగ్స్ కారణంగా భారత్ చిరస్మరణీయ విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో సంజు తన క్లాస్ మరియు ఆత్మవిశ్వాసాన్ని చూపించాడు.

### ఇంగ్లాండ్‌పై పేలుడు ఇన్నింగ్స్

సెమీఫైనల్లో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా సంజు అద్భుత ప్రదర్శన చేశాడు. అతను 89 పరుగుల విలువైన ఇన్నింగ్స్ ఆడి భారత్‌కు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. భారత్ ఆ మ్యాచ్‌లో 253/7 స్కోరు చేసి చివరికి 7 పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం విదితే..

### రవిశాస్త్రి బయట పెట్టిన సంజు విజయ రహస్యం

ఐసీసీ షో రివ్యూలో మాట్లాడిన రవిశాస్త్రి, సంజు విజయానికి ప్రధాన కారణం అతని మానసిక మార్పు మరియు స్థిరత్వం అని చెప్పారు. “సంజు శాంసన్ కు ప్రతిభ ఎప్పటినుంచో ఉంది.. కానీ, ప్రతిభ ఒక్కటే సరిపోదు. స్థిరంగా ప్రదర్శన ఇవ్వడం కూడా చాలా ముఖ్యం. గతంలో అతను కొన్ని సార్లు తప్పు షాట్ ఎంపిక వల్ల పెద్ద స్కోర్లు చేయలేకపోయాడు. ఇప్పుడు అతను తన ఆటను మరింత పరిపక్వంగా మార్చుకున్నాడు అని తెలిపారు. సంజు ప్రతిభపై ఎప్పుడూ సందేహం లేదని రవిశాస్త్రి చెప్పారు. అయితే గతంలో స్థిరత్వం లేకపోవడం వల్ల అభిమానులు కొంత నిరాశ చెందారని అన్నారు. ప్రస్తుతం 31 ఏళ్ల వయసులో సంజు మరింత పరిణతి చెందిన ఆటగాడిగా మారాడు. ఇప్పుడు అతను తన షాట్ ఎంపికలో జాగ్రత్తగా ఉండటం, తన బలాలపై నమ్మకం పెట్టుకోవడం వల్ల మంచి ఫలితాలు సాధిస్తున్నాడని శాస్త్రి తెలిపారు.మొత్తంగా టోర్నమెంట్ ప్రారంభంలో సంజు పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. నమీబియా మరియు జింబాబ్వేతో జరిగిన ప్రారంభ మ్యాచ్‌లలో అతను పెద్ద స్కోర్లు చేయలేదు. దీంతో అతని జట్టులో స్థానం గురించి కూడా ప్రశ్నలు వచ్చాయి. అయితే కీలక సమయంలో సంజు తన అసలైన ప్రతిభను చూపించాడు. వెస్టిండీస్ మరియు ఇంగ్లాండ్‌పై అద్భుత ఇన్నింగ్స్‌లు ఆడి విమర్శకులకు సమాధానం ఇచ్చాడు. ఇప్పుడు టీమ్ ఇండియా టైటిల్‌కు ఒక్క అడుగు దూరంలో ఉంది. ఫైనల్‌లో సంజు శాంసన్ ఇదే ఫామ్ కొనసాగిస్తే భారత్‌కు కప్ గెలిచే అవకాశాలు మరింత పెరుగుతాయి.



## సుశాంత్‌తో ప్రేమ .. గాసిప్స్‌పై మీనాక్షి చౌదరి క్లారిటీ

ప్రస్తుతం టాలీవుడ్‌లో పెళ్లిళ్ల సందడి ఎక్కువగా కనిపిస్తోంది. ఇటీవల విజయ్-రష్మిక వివాహం వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. అలాగే మార్చి 6న అల్లు శిరీష్-- నయనిక రెడ్డి వివాహం జరగనుండటంతో సినీ వర్గాల్లో పెళ్లి వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. ఇదే సమయంలో హీరోయిన్ మీనాక్షి చౌదరి వ్యక్తిగత జీవితంపై కూడా కొన్ని గాసిప్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె వాటిపై స్పష్టత ఇచ్చారు. తన అందం, నటనతో తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు సంపాదించిన హీరోయిన్లలో మీనాక్షి చౌదరి ఒకరు. ఆసక్తికర విషయం ఏమిటంటే, చాలా మంది నటీనటులు డాక్టర్ అవ్వాలని అనుకుని సినిమాల్లోకి వచ్చామని చెబుతుంటారు. కానీ మీనాక్షి మాత్రం నిజంగానే డెంటిస్ట్ చదివి తర్వాత సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. మొదట మోడలింగ్‌తో కెరీర్ ప్రారంభించిన ఆమె, తర్వాత వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుంటూ సినిమాల్లో ముందుకు సాగారు. 2019లో వచ్చిన హిందీ సినిమా అప్‌స్టార్ట్స్ ద్వారా మొదటిసారి తెరపై కనిపించిన మీనాక్షి, 2021లో వచ్చిన ఇచ్చట వాహనాలు నిలుపరాదు సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత ఖిలాడీ, హిట్: ది సెకండ్ కేసు, గుంటూరు కారం వంటి చిత్రాల్లో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన లక్కీ భాస్కర్ ఆమెకు మంచి పేరు తెచ్చింది. అలాగే వెకంటేష్‌తో కలిసి చేసిన సంక్రాంతికి వస్తున్నాం కూడా మంచి విజయాన్ని అందుకుంది. తెలుగు మాత్రమే కాకుండా తమిళంలో కూడా ఆమె పలు సినిమాల్లో నటించారు. ప్రస్తుతం కార్తీక్ దండు దర్శకత్వంలో నాగ చైతన్య హీరోగా నటిస్తున్న 'వృషకర్మ' సినిమాలో మీనాక్షి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఆమె లుక్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇదిలా ఉండగా, కొంతకాలంగా మీనాక్షి చౌదరి ఒక తెలుగు హీరోతో రిలేషన్‌లో ఉన్నారని గాసిప్స్ వినిపించాయి. ఆ హీరో మరెవరో కాదు సుశాంత్. వీరిద్దరూ కలిసి నటించినఇచ్చట వాహనాలు నిలుపరాదు సినిమా షూటింగ్ సమయంలో స్నేహం పెరిగి అది ప్రేమగా మారిందని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా స్పందించిన మీనాక్షి, వాటిని పూర్తిగా ఖండించారు. సుశాంత్‌తో తనకు ప్రేమ సంబంధం లేదని, అతను మంచి స్నేహితుడు మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ విషయంపై గాసిప్స్ ఎక్కువ కావడంతో మీనాక్షి టీమ్ కూడా స్పందించి ఇద్దరూ కేవలం ఫ్రెండ్స్ మాత్రమేనని క్లారిటీ ఇచ్చింది.

## కృతి సనన్‌ను తక్కువ చేసి అవమానించాలన్నది నా ఉద్దేశం కాదు



బాలీవుడ్ నటీమణులు యామీ గౌతమ్, కృతిసనన్ మధ్య సోషల్ మీడియా వేదికగా వివాదం తలెత్తింది. ఇటీవల జరిగిన 'జీ సినీ అవార్డ్స్' వేడుకలో కృతి సనన్ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు.అయితే, ఈ గెలుపును విమర్శిస్తూ రూపొందించిన ఒక వీడియోకు యామీ గౌతమ్ 'లైక్' చేయడంతో నెట్టింట పెద్ద దుమారమే రేపింది. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందించడంతో, యామీ తాజాగా సోషల్ మీడియా ద్వారా క్లారిటీ ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. 'తేరే ఇష్క్ మే' చిత్రంలో నటనకు గానూ కృతి సనన్‌కు ఉత్తమ నటి అవార్డు దక్కిన విషయం తెలిసిందే. అయితే, 'హక్' సినిమాతో ఆ అవార్డుకు యామీ గౌతమ్ మరింత అర్హురాలని నెటిజన్లలో ఒక వర్గం అభిప్రాయపడింది. ఈ క్రమంలో, కృతి సనన్ గెలుపును తక్కువ చేస్తూ.. గతంలో యామీ ఇచ్చిన ఒక ఇంటర్వ్యూ క్లిప్‌ను జోడిస్తూ ఇన్స్టాగ్రామ్‌లో ఒక వీడియో వైరల్ అయ్యింది. ఆ వీడియోలో యామీ, "అవార్డు వస్తేనే మంచి నటి అని కాదు.. నేను ఎవరి గుర్తింపును కోరుకోవడం లేదు" అని అన్న మాటలు ఉన్నాయి. ఈ వీడియోను యామీ లైక్ చేయడంతో, ఆమె కృతిపై అసూయతో ఉందని కొందరు విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో.. ఈ వివాదంపై స్పందిస్తూ, అది పొరపాటున జరిగిన 'లైక్' అని యామీ స్పష్టం చేశారు. "నేను ఒక నటిని కించపరిచేలా ఉన్న వీడియోను లైక్ చేశానని నా దృష్టికి వచ్చింది. ప్రతిరోజూ మమ్మల్ని వందలాది పోస్టుల్లో ట్యాగ్ చేస్తూ ఉంటారు. అవార్డు ఫంక్షన్ హడావిడిలో పొరపాటున ఆ వీడియోపై క్లిక్ అయి ఉండవచ్చు తప్ప, కావాలని చేసింది మాత్రం కాదు. నా కెరీర్‌లో ఎప్పుడూ ఇలాంటి చీప్ పీఆర్ టెక్నిక్స్ ఉపయోగించలేదు. నాకు అసలు పీఆర్ టీమే లేదు. అవార్డుల మీద నా అభిప్రాయం ఏంటో ఎప్పుడో చెప్పేశాను. నేను కేవలం నా పని మీద మాత్రమే దృష్టి పెడతాను. సోషల్ మీడియాలో వచ్చే గాసిప్స్ నమ్మవద్దు, నాకు అంతకంటే మంచి పేరు ఉందని ఆశిస్తున్నాను" అని ఆమె ఘాటుగా సమాధానమిచ్చారు.

## నాగబంధం ఫస్ట్ సింగిల్.. అద్భుతమైన పోస్టర్ రిలీజ్ చేసిన మేకర్స్



మోస్ట్ ఎవైటెడ్ పాన్-ఇండియన్ మూవీ నాగబంధం అద్భుతమైన కంటెంట్‌తో సంచలనం సృష్టిస్తోంది. అభిషేక్ నామా దర్శకత్వంలో ఔఎఐ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ హీరోగా నటించారు. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. మార్చి 15న ఉదయం 11:11 గంటలకు నాగబంధం ఫస్ట్ సింగిల్ "నమో రే" రిలీజ్ కానుంది. ఈ పాట నారాయణుడికి నివాళిగా ఆధ్యాత్మికత ప్రజెంట్ చేయబోతోంది. భారీ స్థాయిలో రూపొందుతున్న నాగబంధంలో "నమో రే" సాంగ్ ప్రధాన ఆకర్షణగా నిలవబోతోంది. ఈ పాటలో ఏకంగా 1,000 మంది డ్యాన్సర్లు పాల్గొంటూ, భారతీయ నృత్య కళల వైవిధ్యం, ఐక్యతను ప్రతిబింబించే అద్భుతమైన విజువల్ స్పెక్టాకిల్‌గా రూపొందించారు. ఇక రిలీజ్ చేసిన పోస్టర్‌లో నభా నటేష్, ఐశ్వర్య మీనన్‌లు సాంప్రదాయ లుక్‌లో కనిపిస్తూ అద్భుతంగా ఆకట్టుకుంటున్నారు. ఈ పాటను అనంత పద్మనాభ స్వామి ఆలయాన్ని ప్రతిబింబించే భారీ సెట్లో చిత్రీకరించడం ద్వారా విజువల్‌గా మరింత వైభవాన్ని అందించారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. దీంతో సినిమాపై అంచనాలు పెరిగిపోగా.. వేసవిలో విడుదలకు సిద్ధమవుతోంది.

## పెళ్లి పీటలు ఎక్కబోతున్న మరో కుర్ర హీరో.. త్వరలో ఆమెతో నిశ్చితార్థం?

టాలీవుడ్‌లో ఈ ఏడాది పెళ్లి సందడి కొనసాగుతోంది. వరుసగా యువ హీరోలు వివాహ బంధంలోకి అడుగుపెడుతుండగా, ఇప్పుడు మరో కుర్ర హీరో పెళ్లి వార్తలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రముఖ నిర్మాత బెల్లంకొండ సురేష్ కుమారుడు, టాలీవుడ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నట్లు సమాచారం. కొన్ని నెలలుగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వివాహంపై వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ వార్తలు నిజమయ్యేలా కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన లాయర్ కుటుంబానికి చెందిన యువతి కావ్య రెడ్డితో ఆయన పెళ్లి జరగబోతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కావ్య రెడ్డి తాతగారు జడ్జిగా పనిచేసి రిటైర్ అయ్యారని, ఆమె తండ్రి ప్రస్తుతం న్యాయవాదిగా కొనసాగుతున్నట్లు సమాచారం. ఇక ఈ వారంలోనే వీరిద్దరి నిశ్చితార్థం జరగనున్నట్లు వార్తలు వస్తున్నాయి. కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఎంగేజ్‌మెంట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే బెల్లంకొండ కుటుంబం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినీ కెరీర్ విషయానికి వస్తే, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ 2014లో వచ్చిన అల్లుడు శీను సినిమాతో హీరోగా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ తర్వాత వరుసగా పలు సినిమాలు చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతేడాది విడుదలైన భైరవం, కిష్కింధపురి సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా ఆశించిన స్థాయి విజయాలు దక్కలేదు. ప్రస్తుతం ఆయన టైసన్ నాయుడు, హైందవ వంటి సినిమాలతో బిజీగా ఉన్నారు. ఈ సినిమాలు త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నాయి. ఒకవైపు కెరీర్‌లో కొత్త సినిమాలతో ముందుకు సాగుతూనే, మరోవైపు వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్న బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పెళ్లి వార్తలు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో అన్నదానిపై ఇప్పుడు అందరి దృష్టి నిలిచింది.



## గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమైన 'కార్మేని సెల్వం'



రామ్ చక్కి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మిస్తున్న ఈ మూవీలో విలక్షణ నటులు సముద్రఖని, గౌతమ్ వాసుదేవ్ మీనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నట్లు తెలిపారు. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఈ చిత్రానికి అధికారిక థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ పార్ట్‌నర్‌గా చేరింది. ఆధునిక కాలానికి అనుసంధానమైన ఈ కథ ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో మంచి ఆసక్తిని రేకెత్తించింది. త్వరలో విడుదల కాబోయే టీజర్‌తో ప్రేక్షకుల్లో మరింత క్యూరియాసిటీని పెంచాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రం నిజాయితీతో జీవించే ఒక సాధారణ కార్ డ్రైవర్ సెల్వం జీవితం చుట్టూ తిరుగుతుంది. ఆధునిక సమాజంలో ఎదు-రయ్యే ఒత్తిళ్ల మధ్య అతడు ఎలా ముందుకు సాగుతాడు అనే అంశాన్ని భావోద్వేగభరితంగా చూపించనున్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

# చార్‌ధామ్ యాత్ర రిజిస్ట్రేషన్లు ప్రారంభం

భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చార్‌ధామ్ యాత్రకు సమయం దగ్గరపడుతోంది. ఉత్తరాఖండ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన కేదార్‌నాథ్, బద్రీనాథ్, గంగోత్రి, యమునోత్రి తీర్థయాత్ర ఏప్రిల్ 19న ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం యాత్రకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసింది. ఇదే సమయంలో ఆన్?లైన్ రిజిస్ట్రేషన్?? ప్రక్రియను కూడా శుక్రవారం ప్రారంభించింది. ఇక యాత్రికులు తమ తీర్థయాత్ర తేదీలను ప్లాన్ చేసుకుని ఆన్?లైన్?లో రిజిస్ట్రేషన్? చేసుకోవచ్చు. ప్రతి ఏడాది మాదిరిగానే దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు ఈ పుణ్యక్షేత్రాలను సందర్శించడానికి వస్తుంటారు. అయితే, భక్తుల సౌకర్యార్థం ఎప్పటిలాగే ఈసారి కూడా రిజిస్ట్రేషన్?ను తప్పనిసరి చేసింది అధికార యంత్రాంగం. రిజిస్ట్రేషన్ కోసం అధికారిక పోర్టల్, మొబైల్ యాప్?ను ఏర్పాటు చేసింది. అదేవిధంగా యాత్రకు రెండు రోజుల ముందు (ఏప్రిల్ 17)న ఆఫ్?లైన్? రిజిస్ట్రేషన్? కూడా ప్రారంభమవుతుందని అధికారులు పేర్కొన్నారు. ఇందుకోసం రిషికేశ్?, హరిద్వార్, డెహ్రాడూన్‌లో కౌంటర్లు కూడా ఏర్పాటు చేయనున్నారు. అక్షయ తృతీయ సందర్భంగా ఏప్రిల్? 19న గంగోత్రి, యమునోత్రి తలుపులు తెరుచుకోవడంతో తీర్థయాత్ర ప్రారంభమవుతుంది. ఏప్రిల్? 22న కేదార్?నాథ్?, ఏప్రిల్? 23న బద్రీనాథ్?లో తలుపులు తెరుచుకుంటాయి. రిజిస్ట్రేషన్ చేసుకున్న యాత్రికులు ప్రయాణ సమయంలో రిజిస్ట్రేషన్ స్లిప్ లేదా ఏదైనా గుర్తింపు కార్డు తీసుకెళ్లాలని అధికారులు సూచించారు.

యాత్రకు సంబంధించిన వివరాలు

చార్‌ధామ్ యాత్ర -ఏప్రిల్ 19న ప్రారంభం

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ- మార్చి 6

యమునోత్రి గంగోత్రి ద్వారాలు- ఏప్రిల్ 19

కేదార్‌నాథ్- ఏప్రిల్ 22

బద్రీనాథ్- ఏప్రిల్ 23

ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం 50 కౌంటర్లు ఏర్పాటు

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిగా ఉచితం

"యాత్రకు ముందు రిజిస్ట్రేషన్? తప్పనిసరి. అదేవిధంగా యాత్రికులు ప్రయాణానికి సంబంధించిన మార్గదర్శకాలను పాటించాలి. యాత్రను సులభతరం చేయడమే ఈ ఆన్?లైన్? ప్రక్రియ ముఖ్య ఉద్దేశం. ఆన్?లైన్?లో నమోదు చేసుకోలేని యాత్రికులు ఆఫ్?లైన్?లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందుకోసం మొత్తం 50 కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నాం. వీటిలో 30 కౌంటర్లు రిషికేశ్?లో మరో 20 వికాస్?నగర్? (డెహ్రాడూన్?)లో ఉంటాయి. యాత్రికులు ఎప్పుడైనా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా ఈ సేవలు 24 గంటలు అందుబాటులో ఉండనున్నాయి."



### తీర్థయాత్ర మార్గాల్లో కనీస సౌకర్యాల ఏర్పాటు

అదేవిధంగా, చార్‌ధామ్ యాత్రకు భక్తులు భారీ సంఖ్యలో రానున్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకుని, తీర్థయాత్ర మార్గాల్లో కనీస సౌకర్యాలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. భక్తులు వెళ్లే మార్గాల్లో తాగునీరు, మరుగుదొడ్లు ఇతరత్రా సౌకర్యాలు కల్పించనున్నారు. అదేవిధంగా అత్యవసర సమయాల్లో యాత్రికులకు తక్షణ వైద్య సహాయం అందేలా ఆరోగ్య సేవలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులకు మార్గనిర్దేశం చేయడానికి స్పష్టమైన సంకేతాలు అందేలా ఏర్పాటు చేస్తున్నారు. యాత్రలో రవాణా సజావుగా జరిగేలా మొత్తం 1880 బస్సులు సిద్ధం చేశారు.

మరో ముఖ్యమైన విషయం ఏంటంటే, చార్?ధామ్? ఆలయాల్లోకి మొబైల్ ఫోన్స్, కెమెరాలు తీసుకెళ్లడంపై పూర్తిగా నిషేధం విధించనున్నట్లు అధికారులు ఇదివరకే ప్రకటించారు. జనవరి 17న జరిగిన రిషికేశ్ ట్రాన్సిట్ క్యాంప్? ప్రాంగణంలో చార్?ధామ్ యాత్ర నిర్వహణ, నియంత్రణ సంస్థ నిర్వహించిన సమావేశంలో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గతేడాది ఆలయ ప్రాంగణంలోకి మొబైల్ ఫోన్స్, కెమెరాలు తీసుకెళ్లడం వల్ల దర్శన నిర్వహణలో అనేక సమస్యలు తలెత్తాయని అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. బద్రీనాథ్ ధామ్‌లో సింగ్ ద్వారం దాటిన తర్వాత మొబైల్ ఫోన్లు, కెమెరాలను అనుమతించబోమని గఢ్?వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే పేర్కొన్నారు. అలాగే, కేదార్‌నాథ్‌లో కూడా చబూతర ప్రాంతంలో కెమెరాలు ఉపయోగించడంపై అనుమతి లేదని చెప్పారు.

### రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇలా

చార్‌ధామ్ యాత్ర కోసం రిజిస్టర్? చేసుకోవడానికి భక్తులకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం రెండు సదుపాయాలను అందుబాటులోకి తెచ్చింది. వెబ్ పోర్టల్: తీవస్త్రఅరతీఫ్‌ఆశీఖుఅస్‌శీబతీఅర్-ఖుతీవ.బఎ.స్త్రశీజ.అఅ సందర్శించి నమోదు చేసుకోవచ్చు. అలాగే, మొబైల్ యాప్: ఎశీబతీఅర్ ఖుతీవ ఖ్ఖుతీఖుఎస్త్రుఖుఅఎ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేయవచ్చు.

# భారత వ్యవసాయ ఉత్పత్తులు ప్రపంచంతో పోటీ పడాలి

వ్యవసాయ రంగాన్ని ఎగుమతుల ఆధారితంగా, ప్రపంచదేశాలతో పోటీపడే విధంగా మార్చాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు వ్యవసాయ రంగం నిపుణులు, పారిశ్రామికవేత్తలు, రైతులు కలిపి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని వైవిధ్యంతో కూడిన వాతావరణ పరిస్థితులను రైతులు తమకు అనుకూలంగా మార్చుకోవాలని సూచించారు. బడ్జెట్ తర్వాత నిర్వహించిన మూడో వెబినార్‌లో 'వ్యవహాయం, గ్రామీణ పరివర్తన' అనే అంశంపై మాట్లాడుతూ ప్రధాని మోదీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. మన దేశ వ్యవసాయ ఉత్పత్తుల ప్రమాణాలను, నాణ్యతను, బ్రాండింగ్‌ను ప్రోత్సహించాల న్నారు. ఎగుమతులే లక్ష్యంగా సేంద్రీయ, సహజ వ్యవసా యాన్ని బలోపేతం చేయాలని ప్రధాని మోదీ అధికారులకు సూచించారు. పంటల వైవిధ్యీకరణపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. వ్యవసాయ రంగంపై దృష్టి పెట్టేలా రాష్ట్రాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ప్రధాని తెలిపారు. "వ్యవసాయం సుదీర్ఘకాలం నుంచి దేశాభివృద్ధికి వ్యూహాత్మక స్తంభంగా ఉంది. ఆ ఆలోచనతోనే మా ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిరంతరం బలోపేతం చేసింది. దాదాపు 10కోట్ల మంది రైతులు 4 లక్షల కోట్లకుపైగా పీఎం కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా లబ్ధి పొందారు. ఎంఎస్‌పీ సంస్కరణల వల్ల రైతులకు ఒకటన్నర రెట్ల ఆదాయం లభిస్తోంది. సంస్థాగత క్రెడిట్ కవరేజీ 75శాతానికి పెరిగింది. పీఎం పసల్ యోజన ద్వారా 2లక్షల కోట్ల మేర బీమా చెల్లింపులు జరిగాయి. అనేక ప్రయత్నాల వల్ల రైతుల చాలావరకు నష్టాలు తగ్గాయి. వారికి ఆర్థిక భద్రత లభించింది. ఫలితంగా వ్యవసాయ రంగం ఆత్మవిశ్వాసం కూడా పెరిగింది."

### ఆ పంటలపై స్పెషల్ ఫోకస్

2026-27 బడ్జెట్?లో జీడిపప్పు, కోకో, శ్రీగంధం లాంటి అధిక విలువ కలిగిన వ్యవసాయ ఉత్పత్తులపై ప్రత్యేకంగా దృష్టి



సారించనట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. వంట నూనెలు, పప్పు ధాన్యాలపై ఒక జాతీయ మిషన్, అలాగే ప్రకృతి వ్యవసాయంపై మరో జాతీయ మిషన్? ఏర్పాటు వంటివి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నాయని ఆయన అన్నారు. "మనం అధిక విలువ కలిగిన వ్యవసాయ ఉత్పత్తులను పెంచినప్పుడే, మన దేశ వ్యవసాయ రంగాన్ని ప్రపంచస్థాయిలో పోటీకి సిద్ధంగా మార్చగలం " అని మోదీ స్పష్టం చేశారు.

### సేంద్రియ వ్యవసాయంపై దృష్టి


ప్రస్తుత ప్రపంచం ఆరోగ్యం పట్లల మరింత స్పృహతో ఉందని మోదీ అన్నారు. అందుకే సంపూర్ణ ఆరోగ్యం కోసం సేంద్రియ ఆహారంపై ప్రజలు మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు. "మనం రసాయన రహిత, ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అప్పుడే ఈ ప్రకృతి వ్యవసాయమే మన ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు చేరువ అయ్యేలా ఒక రహదారిని నిర్మిస్తుంది" అని మోదీ అన్నారు. భారత సుదీర్ఘ అభివృద్ధి ప్రయాణంలో వ్యవసాయం ఒక వ్యూహాత్మక మూలస్తంభమని ఆయన నొక్కి చెప్పారు. తమ ప్రభుత్వం నిరంతరం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా దాదాపు 10 కోట్ల మంది రైతులు రూ.4లక్షల కోట్ల ఎక్కువ మొత్తాన్ని పొందారని మోదీ తెలిపారు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ వ్యవసాయ, గ్రామీణ పరివర్తనకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు.

### పాడి పరిశ్రమ పరిస్థితి ఏమిటి?

ఇక పాడి పరిశ్రమ గురించి కూడా మోదీ కీలక విషయాలు వెల్లడించారు. జంతువులకు గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డిసీజ్?) నుంచి రక్షించేందుకు, ఇప్పటి వర కు 125 కోట్ల కంటే ఎక్కువ డోసుల టీకాలను అందించామని చెప్పారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద సాంకేతికను విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. "మా ప్రభుత్వ హయాంలో పాడి రైతులకు కూడా కిసాన్ క్రెడిట్? కార్డుల ద్వారా లబ్ధి చేకూరుతోంది. ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించేందుకు పశుసంవర్ధక మౌలిక సదు-పాయల అభివృద్ధి నిధిని (ఏహెచ్?ఐడీఎఫ్?)ను ప్రారంభించాం. మేను గోవర్ధన్ యోజనను అమలు చేస్తున్నాం. గోవర్ధన్ యోజనలో భాగంగా పశువ్యర్థాలను, చెత్తను వినియోగించుకుని, మన గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవచ్చు. పాల ద్వారా మాత్రమేకాదు, ఆవు పేడ ద్వారా కూడా ఆదాయాన్ని పొందవచ్చు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు దీనికి ప్రాధాన్యతను ఇచ్చి ప్రోత్సహించాలని కోరుతున్నాను." 'కేవలం ఒకే రకమైన పంటపై ఆధారపడడం రైతులకు ప్రమాదకరమని గత అనుభవాల ద్వారా తెలుసుకున్నాం. పైగా ఇది ఆదాయ మార్గాలను కూడా పరిమితం చేసేస్తుంది. అందుకే మేము పంటల వైవిధ్యం (క్రాప్? డైవర్సిఫికేషన్)పై దృష్టి సారించాం. వాస్తవానికి వ్యవసాయం అనేది రాష్ట్రాల పరిధిలోని అంశం. రాష్ట్రాలకు భారీ వ్యవసాయ బడ్జెట్లు ఉన్నాయి. రాష్టాలు వాటి బాధ్యతలను నెరవేర్చడంలో సహాయపడడానికి, మా సూచనలు సద్వినియోగం అయ్యేలా చూడడానికి మేము నిరంతరం వారిని ప్రోత్సహిస్తాం. గ్రామాలకోసం, రైతుల కోసం రాష్ట్రాలు కేటాయించే ప్రతి పైసాను చాలా తెలివిగా వినియోగించాలి' అని అన్నారు.

# లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదు

ఇరాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో ఎటువంటి ఒప్పందం జరగాలన్నా, ఆ దేశం బేషరతుగా లొంగిపోవడం మినహా మరో మార్గం లేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ చేశారు. "ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలి! ఆ తర్వాత అక్కడ గొప్ప, ఆమోదయోగ్యమైన నాయకత్వం రావాలి. అప్పుడే మేము, మా మిత్రదేశాలు కలిసి ఇరాన్‌ను వినాశనం అంచుల నుంచి బయటకు తీసుకొస్తాం. ఇరాన్‌ను ఆర్థికంగా మునుపటి కంటే బలంగా తీర్చిదిద్దుతాం. ఇరాన్‌కు గొప్ప భవిష్యత్తు ఉంటుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. అంతేకాకుండా తన ఎన్నికల నినాదాన్ని గుర్తుచేస్తూ.. "మేక్ ఇరాన్ గ్రేట్ అగైన్" అంటూ కొత్త నినాదాన్ని వినిపించారు. మరోవైపు అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. క్షిపణి దాడులు, నావికాదళ దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. ఇజ్రాయెల్ లెబనాన్‌లోని హిజ్బుల్లా లక్ష్యాలపై దాడులు విస్తృతం చేయగా, ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై క్షిపణులతో విరుచుకుపడుతోంది. కొన్ని రోజుల కిందట హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌకను అమెరికా సబ్‌మెరైన్ దాడి చేసి ముంచేయడం ఉద్రిక్తతలను పతాక స్థాయికి చేర్చింది. ఈ యుద్ధంలో ఇప్పటివరకు ఇరాన్‌లో వెయ్యి మందికి పైగా




మరణించగా, ఇజ్రాయెల్, లెబనాన్‌లలో డజన్ల కొద్దీ ప్రాణాలు కోల్పోయారు. టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురుస్తుండటంతో వేలాది మంది రాజధానిని వదిలి పారిపోతున్నట్లు ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఇదిలా ఉండగా, ట్రంప్ యుద్ధ అ ది. కా ంా ల న ం నియంత్రించేందుకు చేసిన ప్రయత్నాలను వాషింగ్టన్‌లో సెనేట్ రిపబ్లికన్లు అడ్డుకున్నారు. ప్రస్తుతానికి అమెరికా బలగాలు నేరుగా రంగంలోకి దిగకపోయినా, భవిష్యత్తులో ఆ అవకాశాన్ని వైట్‌హౌస్ కొట్టిపారేయలేదు. ఈ యుద్ధం ప్రభావం ప్రపంచ వాణిజ్యం, ఇంధన సరఫరాలపై తీవ్రంగా పడుతోంది. హోర్ముజ్ జలసంధిలో దాడుల భయంతో నౌకల రాకపోకలు తగ్గిపోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 90 డాలర్లకు చేరాయి. భద్రతా కారణాల దృష్ట్యా పలు షిప్పింగ్ సంస్థలు తమ సర్వీసులను నిలిపివేస్తున్నాయి.

## దేశ అభివృద్ధికి అంతర్గత భద్రత ఎంతో ముఖ్యం



దేశంలో నక్సలిజాన్ని తుదముట్టించాలని మోదీ సర్కార్ తీసుకున్న సంకల్పాన్ని పూర్తిచేయటంలో సీఐఎస్ఎఫ్ కీలకభూమిక పోషించినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ లేదా తెలంగాణలో నక్సలిజాన్ని నిర్మూలించడంలో సీఐఎస్ఎఫ్ కీలకపాత్ర పోషించిందన్నారు. ఒడిశా కటక్‌జిల్లాలోని ముండలిలో జరిగిన సీఐఎస్ఎఫ్ 57వ వార్షికోత్సవంలో పాల్గొన్న అమిత్ షా తిరుపతి నుంచి పశుపతి వరకు రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని కలలు కనేవారి కలలను భద్రతా దళాలు కల్లలు చేశాయన్నారు. "ఈ సందర్భంగా దేశప్రజలకు ఒక విషయం స్పష్టం చేయాలనుకుం టున్నా. 2026 మార్చి 31 నాటికి దేశం నక్సల్స్‌రహితంగా మారుతుంది. ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి నుంచి నేపాల్?లోని పశుపతి వరకు రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని కలలు కన్నవారిని భద్రతాదళాలు పూర్తిగా ఓడించి తమ ఆధిపత్యం చాటుకోనున్నాయి. ప్రధాని మోదీ సారథ్యంలో భద్రతాదళాలకు ఇది అతిపెద్ద విజయం కానుంది."

### దేశ అభివృద్ధికి అంతర్గత భద్రత ఎంతో ముఖ్యం : షా

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్? మారాలంటే అంతర్గత భద్రత చాలా కీలకమని అమిత్? షా పేర్కొన్నారు. దేశంలోని కీలక ప్రాంతాల్లో సీఐఎస్ఎఫ్ దళాలు పటిష్ఠ భద్రతను కల్పిస్తూ ఆర్థిక అభివృద్ధికి సహకరిస్తున్నాయని చెప్పారు. దేశంలోని వివిధ జలాశయాలు, పరిశ్రమలు, విమానాశ్రయాలు, పార్లమెంట్ వంటి ముఖ్యమైన ప్రాంతాల కు రక్షణను అందిస్తున్నాయని చెప్పారు. అయితే, దేశంలో శాంతి వాతావరణం నెలకొ న్నప్పుడే ఆర్థిక వృద్ధి సాకారమవుతుందని షా చెప్పుకొచ్చారు. అదేవిధంగా, దేశాన్ని ప్రపం చంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలంటే పరిశ్రమల అభివృద్ధి అవసరమని షా నొక్కి చెప్పారు. అయితే, ఆ బాధ్యతను సీఐఎస్ఎఫ్ సమర్థంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

### సీఐఎస్ఎఫ్ సేవలను ప్రశంసించిన అమిత్ షా

ఇదిలా ఉండగా, సీఐఎస్ఎఫ్ స్థాపించి 56 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఆ దళాలు సాధించిన పురోగతిని అమిత్ షా ప్రశంసించారు. సీఐఎస్?ఎఫ్? చిన్న స్థాయిలో ప్రారంభమై, ప్రస్తుతం పారిశ్రామిక భద్రత రంగంలో అగ్రస్థానానికి చేరుకుందని కొనియాడారు. దేశ చరిత్రలో ధైర్యం, త్యాగం, అంకితభావంతో ఈ దళం ప్రతి సవాల్‌ను సమర్థంగా ఎదుర్కొందని, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించిందని పేర్కొన్నారు. సీఐఎస్?ఎఫ్? లేకుండా దేశ పారిశ్రామిక అభివృద్ధి దార్శనికతను ఊహించలేమన్నారు. మరోవైపు, దేశంలోని అన్ని ఓడరేవుల భద్రతా బాధ్యతలను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో ప్రైవేట్ పరిశ్రమలకు కూడా హైబ్రిడ్ విధానంలో భద్రత అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతాం!

అదేవిధంగా, 2047 నాటికి భారతదేశాన్ని పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు అమిత్? షా. ప్రపంచవ్యాప్తంగా ప్రతి రంగంలోనూ అగ్రస్థానాన్ని సాధించడం, అలాగే 2027 నాటికి దేశాన్ని ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలపడం, అనే ఈ తీర్మానాలను ప్రధానమంత్రి ప్రజల ముందు ఉంచారని ఆయన ఎత్తి చూపారు.

### కేంద్ర హెూంమంత్రికి ఘన స్వాగతం పలికిన ఒడిశా సీఎం

ఇదిలా ఉండగా, వివిధ ప్రజా కార్యక్రమాల్లో పాల్గొనడానికి శుక్రవారం ఒడిశాకు చేరుకున్న అమిత్? షాకు, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ భువనేశ్వర్ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం భువనేశ్వర్‌లో రూ.890 కోట్ల ఖర్చుతో నిర్మించనున్న రెండు నివాస ప్రాజెక్టులను ప్రారంభించారు. దాంతో పాటు మూడు రిజర్వ్ బెటాలియన్‌లకు షా శంకుస్థాపన కూడా చేశారు. ఈ కార్యక్రమంలో ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్? మాఝీ, అసెంబ్లీ స్పీకర్ సురామ పాఢీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్? తదితరులు పాల్గొన్నారు.

## బిహార్‌లో తొలి బీజేపీ సర్కార్

బిహార్‌లో తొలిసారి బీజేపీ సర్కార్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. సుదీర్ఘకాలం సీఎంగా కొనసాగిన నీతీశ్‌కుమార్ రాజ్యసభకు వెళ్లనుండటంతో కమలం పార్టీకి మార్గం సుగమమైంది. అయితే బీజేపీ నుంచి ముఖ్యమంత్రి పగ్గాలు ఎవరు చేపడ్తారనే విషయమై తీవ్రచర్చ మొదలైంది. సీఎం రేసులో బిహార్ ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, ఒడిశాలో మాదిరిగా అనూహ్యంగా కొత్తవారికి అవకాశం దక్కే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. బిహార్‌లో తమ ప్రభుత్వం ఏర్పడాలన్న బీజేపీ కల ఎట్టకేలకు సాకారం కానుంది. 4నెలల క్రితం జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 89స్థానాలతో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించటంతో సీఎంగా నీతీశ్‌కుమార్‌ను మార్చటం తథ్యమనే విశ్లేషణలు అప్పుడే మొదలయ్యాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా రెండోసారి జేడీయూ కంటే బీజేపీ ఎక్కువ స్థానాలు గెలుపొందింది. ఈ నేపథ్యంలో గతేడాది జరిగిన ప్రమాణ స్వీకారోత్సవం పూర్తిగా కమలం పార్టీ కార్యక్రమంగానే సాగింది. కొత్త మంత్రివర్గంలో సింహభాగంతో పాటు కీలకమైన హోంశాఖను కాషాయదళం దక్కించుకుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్రమంత్రులతో పాటు పలువురు ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఈ పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేసిన ఆర్జేడీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు తేజస్వీయాదవ్, బిహార్‌లో బీజేపీ మహారాష్ట్ర తరహా రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. దళితులు, ఓబీసీలను వ్యతిరేకించే కమలం పార్టీ సామాజిక కోణంతో తన అజెండా అమలు చేయాలని చూస్తోందని విమర్శించారు.

1990ల్లో బిహార్ రాజకీయాల్లో అగ్రవర్ణాల ఆధిపత్యానికి ముగింపు పలికిన మండల్ ఉద్యమంతోనే లాలూప్రసాద్ యాదవ్, నీతీష్ కుమార్ కీలక నేతలుగా ఎదిగారు. ఇప్పుడు బీజేపీ కూడా సామాజిక వ్యూహంతోనే బడుగు, బలహీన వర్గాలకే సీఎం పీఠం కట్టబెట్టవచ్చనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. బిహార్ ఉపముఖ్యమంత్రి, హోంశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సామ్రాట్ చౌదరి కోయెరీ- ఓబీసీ సామాజికవర్గానికి చెందినవారు. ఈ వర్గానికి ఇప్పటివరకు సీఎం అయ్యే అవకాశం రాలేదు. ఆయనను పెద్ద నాయకుడిని చేస్తామని ఎన్నికల ప్రచారంలో అమిత్ షా ప్రకటించారు. అయితే సామ్రాట్ చౌదరీ ఆర్జేడీ నుంచి వచ్చి పదేళ్లు కూడా కాకపోవడంతో బీజేపీ అధినాయకత్వం ఆయనపై ఎంతవరకు విశ్వాసం చూపుతుందన్నది ఆసక్తి రేపుతోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ అయోధ్య ఉద్యమ సమయం నుంచి ఏబీవీపీలో, ఆరెస్సెస్‌లో చురుకైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన బిహార్‌లో అత్యధిక జనాభా కలిగిన యాదవ సామాజిక వర్గానికి చెందినవారు. నిత్యానందరాయ్‌కు అవకాశం ఇస్తే అగ్రవర్ణాలు, నీతీష్ కుమార్ వర్గానికి చెందిన కుర్మీలు, ఇతర అత్యంత వెనుకబడినవర్గాల నుంచి వ్యతిరేకత రావచ్చని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి.

### అర్హత ఆధారంగానే సీఎం అభ్యర్థి ఎంపిక

మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, ఒడిశా మాదిరిగా ఎవరూ ఊహించని నాయకుడు లేదా అగ్రవర్ణాలకు చెందిన నేతకు సీఎం పీఠం దక్కే అవకాశం ఉందని కొందరు బీజేపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. మండల్ ఉద్యమం తర్వాత సీఎం పీఠం అగ్రవర్ణాలకు దూరమనే అనుమానాలను యూపీ, రాజస్థాన్, మహారాష్ట్రల్లో చెరిపేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. బిహార్‌లో కూడా అర్హత ఆధారంగానే సీఎం అభ్యర్థి ఎంపిక జరగొచ్చని బీజేపీ నేతలు అంటున్నారు.

### నీతీశ్ కుమారుడికి డిప్యూటీ సీఎం!

మరోవైపు బీజేపీ ఆధిపత్యంతో జేడీయూలో తమ ఉనికి పట్ల ఆ పార్టీకి చెందిన కొందరు సీనియర్ నేతల్లో ఆందోళన మొదలైంది. కుటుంబ రాజకీయాలను వ్యతిరేకించే నీతీశ్? కుమార్ తన కుమారుడు నిశాంత్‌ను 2రోజుల క్రితమే రాజకీయరంగ ప్రవేశం చేయించారు. ఆయనకు ఉపముఖ్యమంత్రి పదవి దక్కవచ్చని ప్రచారం జరుగుతోంది. ఇకముందు పరిస్థితులు పాతరోజుల్లా ఉండకపోవచ్చని, నీతీష్ కుమారుడితో సహా తమ మంత్రులంతా పదవుల్లో కొనసాగాలంటే బీజేపీ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిందేనని జేడీయూకు చెందిన ఓ సీనియర్ నేత ఆవేదన వ్యక్తంచేశారు.